
'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 210

శుక్రవారం 21-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫోన్‌పే భారీ పెట్టుబడి

డేటా సెంటర్ల నిర్మాణానికి రూ.1,661 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఫోన్‌పే వెల్లడి – బిజినెస్‌లో



సూపర్-12కు శ్రీలంక క్వాలిఫై

టీ20 ప్రపంచకప్‌లో ముందంజ వేసిన శ్రీలంక, నెదర్లాండ్స్ - స్పోర్ట్స్‌లో

సాక్షి ఫ్యామిలీ
వంటిల్లు
ఫ్యాషన్
విజయవాడ
శుక్రవారం ॥ 21-10-2022



ఆటే కా హల్వా

కావలసినవి: గోధుమపిండి- నాలుగు టేబుల్ స్పూన్‌లు; నెయ్యి - నాలుగు టేబుల్ స్పూన్‌లు; బాదం పప్పు - పది (తరగాలి); జీడిపప్పు - పది (పలుకులు చేయాలి); ఎండు ద్రాక్ష - పది; యాలకుల పొడి- అర టీ స్పూన్; కుంకుమ పువ్వు - పావు టీ స్పూన్; బెల్లం తురుము - వంద గ్రాములు (అభిరుచిని బట్టి కొలత మార్చుకోవచ్చు).

తయారీ : ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి, కుంకుమ పువ్వు వేసి నీరు చిక్కబడే వరకు మరిగించాలి. అందులో జీడిపప్పు, యాలకుల పొడి, కిస్‌మిస్ వేసి కలిపి ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచాలి. ● మందపాటి బాణలిలో నెయ్యి వేడి చేసి గోధుమ పిండి వేసి గరిటతో కలుపుతూ సన్నని మంట మీద మంచి వాసన వచ్చే వరకు వేయించాలి. ఇప్పుడు బెల్లం తురుము వేసి కలుపుతూ ఉడికించాలి. నెయ్యి పైకి తేలిన తర్వాత ముందుగా సిద్ధం చేసుకున్న మిశ్రమాన్ని వేసి కలిపి దించేయాలి. బాదం పలుకులతో గార్నిష్ చేయాలి. నోరూరించే ఆటే కా హల్వా రెడీ. ఇది పంజాబీ వంటకం. గోధుమ పిండికి బదులు శనగపిండి, పెసర పిండి, మినప పిండితో కూడా చేసుకోవచ్చు.

తియ్యటి వెలుగులు

పండుగ వస్తోంది... ఇంటికి కొత్త ప్రమిదలు వచ్చేసి ఉంటాయి. ఇంటి ముందు ముగ్గులు... వాకిటికి పూలతోరణాలు వెలుస్తాయి. పండుగ అంతా ఇంటి ముందే ఉంటే... ఇంటి లోపల ఏముంటుంది? పండుగ సంతోషంలో నేను లేనా అని వంటగది ఎదురు చూస్తుంటుంది. పిండివంటల పాత్రల కోసం భోజనాల గది దొంగచూపులు చూస్తుంది. తియ్యటి రుచుల కోసం ఇంటిల్లిపాది నోట్లో నీళ్లూరుతుంటాయి. చక్కగా వండండి... ప్రేమగా వడ్డించండి... హాయిగా ఆస్వాదించండి. పిల్లల ముఖాలు పగలే మతాబుల్లా వెలగకపోతే అడగండి. బాణలి పెట్టండి... స్టవ్ వెలిగించండి... పండగ చేసుకుందాం.



ఖోయా నారియల్ లడ్డు

కావలసినవి: పాలకోవా - కప్పు ; కొబ్బరి కోరు - అరకప్పు ; చక్కెర లేదా బెల్లం తురుము- అర కప్పు ; యాలకుల పొడి- టీ స్పూన్ ; కిస్‌మిస్- పది ; జీడిపప్పు - పది.

తయారీ : ● మందపాటి బాణలిలో కొబ్బరి కోరు, కిస్‌మిస్, జీడిపప్పు వేసి సన్నమంట మీద వేయించాలి. కొబ్బరి వేగిన తర్వాత పాలకోవా. బెల్లం, యాలకుల పొడి వేసి కలిపి దించేయాలి. వేడి తగ్గి మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడు లడ్డులు చేసుకోవాలి.



మాల్ పువా

కావలసినవి: గోధుమ పిండి- ముప్పావు కప్పు ; సూజీ (బొంబాయి) రవ్వ- పావు కప్పు ; యాలకుల పొడి- అర టీ స్పూన్ ; సోంపు పొడి- పావు టీ స్పూన్ ; వేడి పాలు - ఒకటిన్నర కప్పు ; పాల మీగడ- రెండు టేబుల్ స్పూన్‌లు; చక్కెర - కప్పు; కుంకుమ పువ్వు - పది రేకలు; నెయ్యి - వేయించడానికి తగినంత; బాదం - పది (సన్నగా తరగాలి), పిస్తా - పది.

తయారీ : ● పెద్ద పాత్రలో గోధుమపిండి, రవ్వ, యాలకులపొడి, సోంపు పొడి వేసి బాగా కలపాలి. ఇందులో పాలు పోసి కలుపుకోవాలి. ఇప్పుడు పాల మీగడ వేసి గరిటజారుడుగా కలిపి మూతపెట్టి 15 నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ● స్టవ్ మీద వెడల్పు పాత్రలో చక్కెరలో అదే మోతాదులో నీరు పోసి మీడియం మంట మీద మరిగించాలి. అందులో కుంకుమ పువ్వు, యాలకుల పొడి, బాదం తరుగు, పిస్తా వేసి కలపాలి. చక్కెర పాకం చిక్కబడేటప్పుడు మంట తగ్గించాలి. తీగపాకం వచ్చిన వెంటనే స్టవ్ మీద నుంచి దించి పక్కన పెట్టాలి. ● స్టవ్ మీద బాణలి పెట్టి నెయ్యి వేసి వేడి చేయాలి. ముందుగా కలిపి పెట్టుకున్న గోధుమ పిండిని ఒకసారి సరి చూసుకోవాలి. మరీ గట్టిగా అనిపిస్తే మరికొన్ని పాలు పోసి కలపాలి, మరీ వదులుగా ఉంటే కొంచెం గోధుమ పిండి వేసి కలపాలి. ఈ పిండిని చిన్న గరిటెతో తీసుకుని కాగిన నెయ్యిలో పోసి దోరగా వేగే వరకు కదిలించకూడదు. రెండు వైపులా దోరగా కాలిన తరవాత చిల్లుల గరిటెతో తీసి మరొక చెక్క గరిట సాయంతో నెయ్యి జారిపోయేటట్లు వత్తి చక్కెర పాకంలో వేయాలి. మూడు- నాలుగు నిమిషాల పాటు పాకంలో మునిగేటట్లు ఉంచి తీసివేయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

ప్యాంట్ శారీ

సంప్రదాయ వేడుకల్లో చీరకట్టు, లంగా ఓణీ అమ్మాయిల ఎవర్‌గ్రీన్ డ్రెస్‌గా ఉంటుంది. కానీ, ఆ'కట్టు'కోవడంలో పెద్ద ఇబ్బందిగా ఫీలవుతుంటారు. పెద్దవారిలా చీరకట్టు ఎందుకు అని ప్రశ్నించే నవతరం పెద్దవారు సైతం మెచ్చేలా డ్రెస్సింగ్ ఉండాలంటే ప్యాంట్ శారీ సరైన ఎంపిక అవుతుంది. స్టైలిష్ జాబితాలో ముందు వరసలో ఉంటుంది వేడుకలలో హైలైట్‌గా నిలుస్తుంది. ముఖ్యంగా ఈ దీపావళి మరింత శోభాయమానం అవుతుంది.

కుర్తీస్‌కి పలాజో ప్యాంట్ ధరించడం మనకు తెలిసిందే. పలాజో టాప్ విత్ దుపట్టాతో లుక్‌లో మార్పు తీసుకురావచ్చు. అలాగే, పలాజో స్కర్ట్, షరారా ప్యాంట్, స్ట్రెయిట్ కట్ ప్యాంట్స్ కూడా ఈ స్టైల్‌కు బాగా నప్పుతాయి.



ఆభరణాలు..
డ్రెస్‌తోనే స్టైలిష్‌గా కనిపిస్తారు కాబట్టి ఇతరత్రా అలంకరణలు పెద్దగా అవసరం లేదు. అయితే నడుముకు మాత్రం ఎంబ్రాయిడరీ చేసిన ఫ్యాబ్రిక్ బెల్ట్ ధరిస్తే లుక్ బాగుంటుంది. చెవులకు పెద్ద హ్యాంగింగ్స్ పెట్టేస్తే చాలు. కేశాలంకరణలో ఫిష్ టెయిల్ లేదా లూజ్‌గా వదిలేస్తే ముస్తాబు పూర్తయినట్టే.

కాంట్రాస్ట్
ప్యాంట్-టాప్ సేమ్ ప్లెయిన్ కలర్‌లో ఉండి, దీనికి కాంట్రాస్ట్ లేదా ఫ్లోరల్ దుపట్టాతో అలంకరిస్తే చాలు. 'స్టైలిష్ లుక్ అంతా మీలోనే కనిపిస్తుంది' అన్న కితాబులు అందుకుంటారు.

ప్లెయిన్
ఒకే రంగులో ఉండే ప్లెయిన్ శారీ ప్యాంట్‌లు ఈవెనింగ్ గెట్ టు గెదర్ పార్టీలకు బాగా నప్పుతాయి. ఇవి శారీ గౌన్ స్టైల్‌లో కనిపించడంతో ఇండోవెస్టర్న్ లుక్‌లో ఆకట్టుకుంటాయి.



మీకో విషయం తెలుసా!

● జపాన్‌లోని కొన్ని దీవులలో ఇసుక 'స్టార్' షేప్‌లో ఉంటుంది ● ప్రపంచంలోని పురాతనమైన, ఎత్తైన చెట్లకు కాలిఫోర్నియా పెట్టింది పేరు ● చాలామంది మధ్యాహ్నం వరకు డల్‌గా ఉండే రోజు... సోమవారం ● ప్రతి వ్యక్తి దగ్గర కనీసం పదమూడు రహస్యాలు దాగుంటాయట ● నాన్-డిజిటల్ గేమ్స్ ఆడితేనే జ్ఞాపకశక్తి పదిలంగా ఉంటుందని అధ్యయనాలు తెలియస్తున్నాయి ● ప్రకృతి దృశ్యాలతో సహా రకరకాల ప్రదేశాలను చూస్తూ కాదు... కేవలం జ్ఞాపకాల ఆధారంగా గీయడంలో దిట్ట అమెరికాకు చెందిన స్టీఫెన్ విల్ట్‌షైర్. అంటే ఒక్కసారి చూసి ఆ దృశ్యాలను మదిలో నిక్షిప్తం చేసుకుంటాడు.

యువర్స్

డ్రాగన్ బెల్

● గేమింగ్

మల్టీ ప్లేయర్ ఎడ్వెంచర్‌గేమ్ 'డ్రాగన్ బెల్: ది బ్రేకర్స్' నేడు విడుదల అవుతుంది. సర్వైవర్‌లకు, రైడర్‌లకు మధ్య జరిగే పోరు ఇది. మీరు సర్వైవర్ అయితే మీ ఏకైక లక్ష్యం రైడర్ నుంచి తప్పించుకోవడం. దీనికి రకరకాల స్ట్రాటజికల్ ఆప్షన్స్ ఉంటాయి. కఠినమైన పరిస్థితుల నుంచి తప్పించుకోవడానికి స్మోక్‌స్ట్రీక్స్‌లాంటి వాటిని ఉపయోగించవచ్చు. ఇక మీరు రైడర్‌గా మారితే సర్వైవర్‌లను అంత మొందించడమే మీ ఏకైక లక్ష్యం అవుతుంది. అయితే ఇది అంత తేలికైన విషయం కాదు. ఐకానిక్ డ్రాగన్ బాల్ ఫ్రాంచైజ్ నుంచి ఇన్‌స్పైర్ అయ్యి 'డెడ్ బై డే లైట్' గేమ్ డిజైన్‌ను అనుసరించి గేమ్ ఇది.

ప్లాట్‌ఫామ్: పీఎస్ఎస్, పీఎస్4, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, ఎక్స్‌బాక్స్ వన్



● డిజిటల్ స్కూల్

■ షేర్ చేయడానికి...

ఎక్కువ నిడివి ఉన్న యూట్యూబ్ వీడియోల నుంచి 5-30 సెకండ్ల ఆసక్తికరమైన 'క్లిప్స్' క్రియేట్ చేసి, ఫ్రెండ్స్‌కు షేర్ చేయడానికి...

1. యూట్యూబ్ ఎకౌంట్‌తో సైన్ కావాలి
2. మీకు అవసరమైన వీడియో ఓపెన్ అయిన తరువాత, దీని కింద ఉన్న 'క్లిప్'ను నొక్కాలి
3. ఈ క్లిప్‌కు ఒక టైటిల్ క్రియేట్ చేయాలి
4. స్లైడర్స్‌తో 'క్లిప్' సైజ్‌ను అడ్జస్ట్ చేసుకోవాలి
5. అడ్జస్ట్ చేసిన తరువాత 'షేర్ క్లిప్'ను క్లిక్ చేయాలి
6. ఆతరువాత లింక్‌ను కాపీ చేసి షేర్ చేయవచ్చు.

■ ఆర్కైవ్ చేయడానికి...

వ్యక్తిగత, గ్రూప్ చాట్‌లను హైడ్ చేయడానికి వాట్సాప్‌లో 'ఆర్కైవ్ చాట్ ఫీచర్' అందుబాటులో ఉంది. అన్ని రకాల చాట్స్ ఒకేసారి ఆర్కైవ్‌లోకి వెళ్లడానికి... 1. వాట్సాప్ ఓపెన్ చేసిన తరువాత 'చాట్స్ ట్యాబ్'లో మోర్ ఆప్షన్స్ నొక్కాలి 2. సెట్టింగ్స్-క్లిక్ 3. చాట్స్-క్లిక్ 4. చాట్ హిస్టరీ-క్లిక్ 5. ఆర్కైవ్ ఆల్ చాట్స్-క్లిక్

■ మోటో ఇ22 ఎస్ - బడ్జెట్ ఫోన్

- డిస్‌ప్లే: 6.5 అంగుళాలు
- ర్యామ్: 4జీబి
- స్టోరేజ్: 64 జీబి
- రిజల్యూషన్: 720×1600 పిక్సెల్స్
- రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్
- బ్యాటరీ సామర్థ్యం: 5000 ఎంఏహెచ్
- బరువు: 185 గ్రా.
- ఎల్‌సీడి ఐపీఎస్ స్క్రీన్
- కలర్స్: ఎకో బ్లాక్, ఆర్కిటిక్ బ్లూ
- ధర: రూ.8,999



క్రై క్రై... బసిన్... ఐ డునో

ENGLISH స్లాంగ్ వర్డ్స్

బోజి - రిచ్, లగ్జరి, స్పెషల్, ఫ్యాన్సీ
ఉదా: టూ బోజి ఫర్ మీ

బసిన్ - అమేజింగ్, రియల్లీ గుడ్
ఉదా: దోజ్ పొటాటో చిప్స్ ఆర్ బసిన్

వైబ్‌చెక్: ఒక వ్యక్తి మూడ్, ఎమోషనల్ స్టేట్‌ను తెలుసుకోవడం.
ఉదా: హాయ్ రాజు, వైబ్ చెక్?
రాజు: వైబ్ ఆల్ గుడ్

క్రై క్రై: క్రేజీకి సంక్షిప్త రూపం
ఉదా: ది న్యూ ఆల్బమ్ ఈజ్ క్రై క్రై

ఐ డునో: 'ఐ డోన్ట్‌నో'కు సంక్షిప్త రూపం

● టాలెంట్



అచ్చం ఆ హీరోల్లాగే మాట్లాడతాడు!

ముంబై శివారులోని అంబర్‌నాథ్‌లో పుట్టి పెరిగిన సుమేద్ షిండే బాలీవుడ్ హీరోలు అమీర్‌ఖాన్, హృతిక్ రోషన్, అజయ్‌దేవ్ గణ్... మొదలైన వారి గొంతులను అద్భుతంగా అనుకరిస్తాడు. అచ్చం గాయకుడు సోనూనిగమ్‌లాగే పాడతాడు. ట్విట్టర్‌లో ఇతడికి 27,000 మంది ఫాలోవర్స్ ఉన్నారు. అమీర్‌ఖాన్, హృతిక్‌రోషన్‌లు షిండే ప్రతిభను మెచ్చుకున్నారు. వ్యాపార ప్రకటనల కోసం ఈ ఇద్దరు హీరోలకు మరాఠీ, తెలుగు, తమిళ భాషల్లో డబ్బింగ్ చెప్పాడు. తనలోని మిమిక్రీ కళ వల్ల ఎన్నో దేశాలకు వెళ్లే అవకాశం షిండేకు వచ్చింది. 'ఇదేమీ అసాధ్యమైన విద్య కాదు. మీరూ ప్రయత్నించండి' అంటున్నాడు. మరి ఒకసారి ట్రై చూసి చూడండి!

● సక్సెస్ స్టోరీ

ఈ కుర్రాడు... 'సక్సెస్'కు సన్నిహిత మిత్రుడు

ఈ అబ్బాయికి తన వయసు వారిలాగే సినిమాలు అంటే ఇష్టం. సినిమా పాటలు అంటే ఇష్టం. ఆ పాటలకు తీన్మార్ డ్యాన్స్ చేయడం అంటే ఇష్టం. అయితే వీటితో పాటు తనకు టెక్నాలజీ అంటే కూడా ఇష్టం. ఆ ఇష్టమే ఇతడిని 14 సంవత్సరాల వయసులో కంటెంట్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టడానికి కారణం అయింది. 21 సంవత్సరాల వయసులో సొంతంగా ఒక స్టార్టప్ స్టార్ట్ చేయడానికి, మరో కంపెనీలో భాగస్వామి కావడానికి కారణం అయింది...



రుత్విక్ లోఖండె

టిక్‌టాక్‌తో ఊపందుకున్న షార్ట్ ఫామ్ కంటెంట్ ఆ తరువాత యూట్యూబ్ షార్ట్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్... మొదలైన మాధ్యమాల ద్వారా మరింత విస్తరించింది.

షార్ట్ ఫామ్ కంటెంట్ వల్ల ప్రేక్షకులకు అందే వినోదం అనేది ఒక కోణం మాత్రమే. మరో కోణంలో చూస్తే షార్ట్ ఫామ్ కంటెంట్ వల్ల రకరకాల జానర్‌లలో ఎంతోమంది యువప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారు. మ్యూజిక్ ఇండస్ట్రీలో కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తోంది. అన్ని మ్యూజిక్ ప్లాట్ ఫామ్స్‌లో యాక్టివ్ స్ట్రీమర్స్ పెరిగారు.

వీరిని రకరకాల బ్రాండ్స్ తమ మార్కెటింగ్‌కు ఉపయోగించుకుంటున్నాయి. సంప్రదాయ మార్కెటింగ్‌తో పోల్చితే ఇది తక్కువ ఖర్చుతో కూడిన వ్యవహారం.

ఇన్‌ఫ్లుయెన్సర్‌లు, బ్రాండ్లకు మధ్య వారధిగా ముంబైలో ఏర్పడిన 'నోఫిల్టర్' ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ సంస్థ వ్యవస్థాపక సభ్యులలో ముంబైకి చెందిన రుత్విక్ లోఖండె ఒకరు. అప్పుడు అతని వయసు 14 సంవత్సరాలు.

క్రిప్టో కరెన్సీ నేపథ్యంలో అందరిలాగే బ్లాక్ చెయిన్ అనే మాటను చాలాసార్లు విన్నాడు రుత్విక్.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) భద్రతకు ఉపకరించే, డేటాను జాగ్రత్తగా కాపాడే, పారదర్శకతకు వీలయ్యే బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ రుత్విక్‌ను బాగా ఆకర్షించింది.

'ఇది మనకు ఎలా ఉపయోగపడుతుంది?' అని ఆలోచించాడు.

'ఇలా ఉపయోగించుకోవచ్చు' అనే ఐడియా తట్టడంతో బ్లాక్‌చెయిన్ సాంకేతికత ఆధారంగా 'బిలీవర్స్' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టి సూపర్ హిట్ చేశాడు.

ఈ ప్లాట్‌ఫామ్ కళాకారులకు సహాయపడుతుంది. ఉదాహరణకు... రైటర్ లేదా డైరెక్టర్ కావాలనుకుంటున్నవారు తమ స్క్రిప్ట్‌ను షేర్ చేస్తే, అది ఆడియెన్స్(బిలీవర్స్)కు నచ్చితే నిధుల సమీకరణకు వీలవుతుంది.

'షార్ట్ కంటెంట్ అనేది హోటల్స్ నుంచి టూర్ గైడ్‌ల వరకు ప్రతి ఒక్కరికీ తమను తాము ప్రమోట్ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది' అంటున్న రుత్విక్ ప్రస్తుతం ఎక్స్‌పెరిమెంటల్ మార్కెటింగ్ సంస్థ 'కొలబ్‌ట్రైబ్' భాగస్వామి.

'ప్రస్తుతం మన దేశంలో స్ట్రీట్‌కల్చర్ పెరిగింది. హిప్ హాప్ టాలెంట్ ముందుకు వస్తుంది. మారుమూల గ్రామంలో ఎక్కడో ఉన్న కళాకారుడి ప్రతిభ ప్రపంచానికి తెలియడానికి ఎంతో టైమ్ పట్టడం లేదు. అయితే ప్రపంచంలోని ఎన్నో దేశాలతో పోల్చితే మన దగ్గర వీరి ప్రతిభకు సరియైన ప్రతిఫలం లభించడం లేదు.

2025 నాటికి కంటెంట్ క్రియేషన్‌కు పెద్ద మార్కెట్ ఏర్పడనుంది. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తమ అభిరుచుల ప్రకారం ఇన్‌ఫ్లూయెన్సర్ కావచ్చు, అయితే ప్రతిభ మాత్రమే సరిపోదు. తమ కంటెంట్‌ను ప్రమోట్ చేసుకోవడానికి మార్కెటింగ్ స్కిల్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలి' అంటున్నాడు రుత్విక్.

కంటెంట్ క్రియేషన్‌లో వ్యక్తులు, సంస్థలకు సహాయపడడానికి ఏంజెల్ ఫండ్ 'మూన్ క్యాపిటల్' లాంచ్ చేసే ప్రయత్నాలలో ఉన్నాడు రుత్విక్.

'ప్రతిభకు ఎలాంటి హద్దులు, అవరోధాలు లేవు. అది ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షిలాంటిది' అంటున్నాడు యంగ్‌స్టార్ రిత్విక్. తన సక్సెస్ స్టోరీ ఆ విషయాన్ని చెప్పకనే చెబుతుంది కదా!

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 210
శుక్రవారం 21-10-2022
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 96	నిఫ్టీ ▲ 52
59,203	17,564

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,666	▽	14
డోజోన్స్	30,428	▲	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,944	▲	19
డాక్స్	12,767	▲	26
షాంఘై	3,035	▽	9
నికాయ్	27,006	▲	250

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	50,228	▽	8
బంగారం (99.5 స్వచ్ఛత)	50,027	▽	8
వెండి (కేజీ)	56,267	▽	661

యాక్సిస్ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 5,330 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 70 శాతం జంప్‌చేసి రూ. 5,330 కోట్లకు చేరింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 3,133 కోట్లు ఆర్జించింది. మొండిబకాయిలు తగ్గడం, వడ్డీ, పెట్టుబడుల ఆదాయంలో వృద్ధి ఇందుకు సహకరించాయి. క్యూ2లో మొత్తం ఆదాయం రూ. 20,134 కోట్ల నుంచి రూ. 24,180 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం సైతం 24 శాతం పుంజుకుని రూ. 20,239 కోట్లను తాకింది. పెట్టుబడుల నుంచి 27 శాతం అధికంగా రూ. 4,477 కోట్ల ఆదాయం లభించింది. ఫారెక్స్ లావాదేవీలు, ఫీజులు తదితర ఆదాయం 4% పెరిగి రూ. 3,941 కోట్లుగా నమోదైంది.

ఎన్‌పీఏలు డౌన్: కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ2లో యాక్సిస్ బ్యాంక్ నికర లాభం రూ. 3,383 కోట్ల నుంచి రూ. 5,625 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 20,967 కోట్ల నుంచి రూ. 25,259 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.53% నుంచి 2.5%కి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.08% నుంచి 0.51%కి మెరుగుపడ్డాయి. కేటాయింపులు భారీగా తగ్గి రూ.550 కోట్లకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో యాక్సిస్ షేరు 0.4 శాతం నీరసించి రూ. 826 వద్ద ముగిసింది.

ఐటీసీ లాభం 24 శాతం అప్

క్యూ2లో రూ. 4,670 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 24% ఎగసి రూ. 4,670 కోట్లను అధిగమించింది. గతేడాది(2021) ఇదే కాలంలో రూ. 3,764 కోట్లు ఆర్జించింది. సిగరెట్లు, అగ్రిబిజినెస్‌సహా వివిధ విభాగాలు పటిష్ట పనితీరు చూపడం ఇందుకు దోహదపడింది. మొత్తం ఆదాయం సైతం 25 శాతం వృద్ధితో రూ. 18,608 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 14,844 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 25% పెరిగి రూ. 12,824 కోట్లకు చేరాయి.

విభాగాలవారీగా..: ప్రస్తుత సమీక్షా కాలంలో ఐటీసీ ఎఫ్ఎంసీజీ విభాగం 22% వృద్ధితో రూ.12,530 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దీనిలో సిగరెట్ల బిజినెస్ నుంచి 23% అధికంగా రూ.7,635 కోట్లు నమోదైంది. ఎఫ్ఎంసీజీ విభాగాల నుంచి అమ్మకాలు 21% ఎగసి రూ.4,894 కోట్లను దాటాయి. హోటళ్ల బిజినెస్ 80% జంప్‌చేసి రూ. 560 కోట్లను అధిగమించింది. ఈ బాటలో అగ్రి బిజినెస్ ఆదాయం 43% పుంజుకుని రూ. 4,039 కోట్లకు చేరింది. పేపర్, ప్యాకేజింగ్ విభాగం టర్నోవర్ 25% బలపడి రూ. 2,288 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో 0.8 శాతం లాభపడి రూ. 350 వద్ద ముగిసింది.

యూనియన్ బ్యాంక్ లాభం 1,848 కోట్లు

క్యూ2లో 21 శాతం వృద్ధి



ముంబై: ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 1,848 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధితో పోలిస్తే లాభం 21 శాతం వృద్ధి చెందింది. రికవరీలు .. అసెట్ క్వాలిటీ మెరుగుపడటం, మార్జిన్లు పెరగటం తదితర అంశాలు ఇందుకు దోహదపడ్డాయి. సమీక్షాకాలంలో నికర వడ్డీ ఆదాయం 21.61 శాతం పెరిగి రూ. 8,305 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 20 బేసిస్ పాయింట్లు పెరిగి 3.15 శాతానికి చేరినట్లు బ్యాంక్ ఎండీ ఎ. మణిమేఖలై తెలిపారు. ఆర్‌బీఐ రెపో రేటును 190 బేసిస్ పాయింట్లు పెంచగా, యూనియన్ బ్యాంకు 165 బేసిస్ పాయింట్ల మేర భారాన్ని కస్టమర్లకు బదలాయించడం .. మార్జిన్ పెరగడానికి తోడ్పడింది. మరోవైపు, కొత్తగా రూ. 2,900 కోట్లు మొండిపద్దుల కింద వర్గీకరించగా .. రూ. 5,100 కోట్ల మేర రికవరీలు నమోదైనట్లు, వీటిలో రైటాఫ్ చేసిన ఖాతాల నుంచి ఏకంగా రూ. 1,700 కోట్లు వచ్చినట్లు బ్యాంక్ తెలిపింది. రెండో త్రైమాసికంలో స్థూల మొండిబాకీలు 419 బేసిస్ పాయింట్లు తగ్గి 8.45 శాతానికి, నికర ఎన్‌పీఏలు 197 బేసిస్ పాయింట్లు తగ్గి 2.64 శాతానికి దిగి వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 8,100 కోట్ల మూలధనాన్ని సమీకరించుకునేందుకు బోర్డు ఆమోదముద్ర వేసిందని మణిమేఖలై తెలిపారు.

ఫలితాల నేపథ్యంలో యూనియన్ బ్యాంక్ షేరు 2 శాతం లాభపడి రూ.47.25 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంక్ లాభం రూ.2,525 కోట్లు



న్యూఢిల్లీ: కెనరా బ్యాంకు నికర లాభం సెప్టెంబర్ త్రైమాసికంలో గణనీయంగా పెరిగింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 89 శాతం వృద్ధితో రూ.2,525 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.24,932 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.21,331 కోట్లుగా ఉంది. బ్యాంకు రుణ ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 8.42 శాతం నుంచి 6.37 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 3.22 శాతం నుంచి 2.19 శాతానికి పరిమితమయ్యాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-10-2022	
విశాఖ	455-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	449-00
విజయవాడ	449-00
రిటైల్ ధర (డజను)	66.00
20-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

దానకర్ణుడు శివ్‌నాడార్

- సమాజం కోసం రోజుకు రూ.3కోట్లు
- ఏడాదిలో రూ.1,161 కోట్ల విరాళం
- రూ.484 కోట్లతో రెండో స్థానంలో విప్రో ప్రేమ్‌జీ
- దానంలో ఏడో స్థానానికి పరిమితమైన అదానీ...



అజీమ్ ప్రేమ్‌జీ | శివ్ నాడార్

ముంబై: సంపద ఎంత ఉందన్నది కాదు.. సమాజానికి ఎంత ఇచ్చామన్నదే ముఖ్యం.! దీన్ని ఆచరణలో చూపించారు హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ (77). ఏడాదిలో దాతృత్వ కార్యక్రమాలకు రూ.1,161 కోట్లు ఇచ్చి.. దేశంలోనే అత్యంత ఉదారవాదిగా 'ఎడెల్‌గివ్ హురూన్ ఇండియా ఫిలాంత్రోఫీ లిస్ట్ 2022' జాబితాలో మొదటి స్థానంలో నిలిచారు. అంటే ఒక రోజుకు రూ.3 కోట్లు సమాజానికి వెచ్చించారు. గడిచిన రెండు సంవత్సరాలుగా దాతృత్వంలో అగ్ర స్థానంలో నిలిచిన విప్రో అజీమ్ ప్రేమ్‌జీ (77) ఈ విడత రెండో స్థానానికి పరిమితమయ్యారు. ఆయన ఇచ్చిన విరాళం రూ.484 కోట్లు. కానీ, ప్రపంచ కుబేరుల్లో ఒకరు, దేశంలోనే అత్యధిక ఐశ్వర్యం కలిగిన అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ (60) కేవలం రూ.190 కోట్ల విరాళంతో ఏడో స్థానంలో నిలవడం గమనార్హం. ఇక దేశంలోనే రెండో అత్యంత ధనవంతుడు ముకేశ్ అంబానీ రూ.411 కోట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఏఎం నాయక్ (80) రూ.142 కోట్ల విరాళం ఇచ్చి ఎంతో దానగుణం కలిగిన ప్రొఫెషనల్ మేనేజర్‌గా నిలిచారు.

వయసు చిన్న.. విరాళంలో మిన్న

బ్రోకరేజీ సంస్థ జెరోదా వ్యవస్థాపకులు నితిన్ కామత్ (41), నిఖిల్ కామత్ (36) దానంలోనూ తమ ప్రత్యేకత చాటుకున్నారు. వారు తమ విరాళాన్ని ఏడాదిలో ఏకంగా 300 శాతం పెంచి రూ.100 కోట్లు ఇచ్చారు. నిఖిల్ కామత్ అత్యంత చిన్న వయసులోని వితరణశీలిగా నిలిచారు. చెరో రూ.213 కోట్ల విరాళంతో మైండ్ ట్రీ సహ వ్యవస్థాపకులైన సుబ్రతో బాగ్చి, ఎన్ఎస్ పార్థసారథి టాప్–10లో చోటు సంపాదించారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులైన నందన్ నిలేకని, క్రిస్ గోపాలకృష్ణన్, ఎస్‌డీ శిబూలాల్ ఈ జాబితాలో ఉన్నారు. ఇన్ఫోసిస్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్న నందన్ నీలేకని రూ.159 కోట్లను దానం చేసి 9వ స్థానంలో నిలిచారు. ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ క్రిస్ గోపాలకృష్ణన్ రూ.90 కోట్లతో 16వ స్థానంలో, శిబూలాల్ రూ.35 కోట్లతో రూ.28వ స్థానంలో నిలిచారు.

దానంలోనూ భాగస్వామే

ఇన్ఫోసిస్‌కు చెందిన నందన్ నీలేకని జీవిత భాగస్వామి రోహిణి నీలేకని (63), దానంలోనూ భర్తకు అర్ధాంగినని అనిపించుకున్నారు. రూ.120 కోట్ల విరాళంతో మహిళా వితరణశీలుల్లో మొదటి స్థానంలో నిలిచారు. లీనా గాంధీ తివారీ రూ.21 కోట్లు, అను అఘా రూ.20 కోట్లు విరాళంతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మొత్తం ఆరుగురు మహిళలు ఈ జాబితాలో ఉన్నారు.

ఐదేళ్లలో రెట్టింపు..

15 మంది రూ.100 కోట్లకు మించి విరాళం ఇచ్చారు. 20 మంది రూ.50 కోట్లకు మించి విరాళం ఇవ్వగా, రూ.20 కోట్లకు పైగా సమాజం కోసం వెచ్చించిన వారు 43 మంది ఉన్నారు. ఈ ఏడాది జాబితాలో 19 మంది కొత్తగా చేరారు. రూ.10 కోట్లకు పైగా విరాళం ఇచ్చిన వారి సంఖ్య 80గా ఉంది. నాలుగేళ్ల క్రితం వీరి సంఖ్య 37గానే ఉంది. 75 మంది దాతలు ఉమ్మడిగా ఇచ్చిన మొత్తం రూ.1,233 కోట్లుగా ఉంది. ''గత ఐదేళ్లలో రూ.100 కోట్లకు పైగా విరాళం ఇచ్చిన వారి సంఖ్య 2 నుంచి 15కు పెరిగింది. రూ.50 కోట్లకు పైగా విరాళం ఇచ్చిన వారి సంఖ్య 5 నుంచి 20కి చేరింది. భారత్‌కు ఉన్న సంపద సృష్టి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని చూస్తే బిలియనీర్లు తమ దాతృత్వాన్ని మరింత పెంచుతారని భావిస్తున్నాం. వీరి సంఖ్య రానున్న ఐదేళ్లలో రెట్టింపు అవుతుంది''అని హురూన్ ఇండియా ఎండీ అనాస్ రెహమాన్ జునైద్ పేర్కొన్నారు.

ఆఖర్లో కొనుగోళ్లు

- సూచీలకు అయిదోరోజూ లాభాలే
- సెన్సెక్స్ లాభం 96 పాయింట్లు
- 52 పాయింట్లు పెరిగిన నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం లాభ, నష్టాల్లో కదలాడిన సూచీలు..., ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో అయిదో రోజూ లాభాలను ఆర్జించాయి. ఐటీ షేర్లతో పాటు అధిక వెయిటేజీ ఐటీసీ, భారతీ ఎయిర్ షేర్లు రాణించాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 96 పాయింట్లు పెరిగి 59,203 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 52 పాయింట్లు బలపడి 17,564 వద్ద నిలిచింది. డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం 21 పైసలు బలపడి 82.79 వద్ద స్థిరపడింది. ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఇంధన, ఫార్మా, మెటల్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్ల కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ప్రైవేట్ బ్యాంక్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

ట్రాక్సన్ టెక్నాలజీస్ లిస్టింగ్ సూపర్ హిట్

ట్రాక్సన్ టెక్నాలజీస్ షేరు లిస్టింగ్ రోజే ఇన్వెస్టర్లకు లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.80తో పోలిస్తే నాలుగుశాతం ప్రీమియంతో రూ.83 వద్ద లిస్టయ్యింది. ఒడిదుడుకుల ట్రేడింగ్‌లోనూ ఈ షేరుకు డిమాండ్ లభించడంతో ఒకదశలో 25% దూసుకెళ్లి రూ.99.60 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. గరిష్టస్థాయి వద్ద లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో 18% లాభంతో రూ.94.20 వద్ద స్థిరపడింది.

ఫోన్‌పే రూ.1,661 కోట్ల పెట్టుబడి



ముంబై: డిజిటల్ చెల్లింపుల దిగ్గజం ఫోన్‌పే డేటా సెంటర్ల నిర్మాణానికి రూ.1,661 కోట్లు వెచ్చిస్తోంది. ఇందులో రూ.1,246 కోట్లు ఇప్పటికే ఖర్చు చేసింది. తాజాగా నవీ ముంబైలో డేటా సెంటర్‌ను ప్రారంభించింది. సమాచారాన్ని విదేశాల్లో కాకుండా దేశీయంగా భద్రపరచాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఈ కేంద్రాల ఏర్పాటుకు కంపెనీ నిర్ణయం తీసుకుంది. సంస్థకు ఇప్పటికే బెంగళూరులో 3 డేటా సెంటర్లున్నాయి. ప్రస్తుతం రోజుకు 12 కోట్ల లావాదేవీలను నమోదు చేస్తున్నట్టు ఫోన్‌పే కో–ఫౌండర్ రాహుల్ చారి వెల్లడించారు. గరిష్ఠంగా సెకనుకు 7,000 లావాదేవీలు జరుగుతున్నాయ న్నారు. డిసెంబర్ నాటికి లావాదేవీల సంఖ్య రోజుకు 20 కోట్ల స్థాయికి చేరుకుంటుందన్న ధీమా వ్యక్తం చేశారు.

సినిమా

"'జిన్నా' ని రెండు షోలు ప్రివ్యూ వేశాం.. చూసిన వారందరూ విపరీతంగా ఎంజాయ్ చేశారు. మా అమ్మ, అత్తగార్లు కూడా చప్పట్లు కొట్టేసి నవ్వుతూ ఎంజాయ్ చేశారు. అప్పుడు వచ్చిన నమ్మకంతోనే 'జిన్నా'ని ఎక్కువగా ప్రమోట్ చేశాను. నేను, 'వెన్నెల' కిశోర్, చమ్మక్ చంద్ర సెకండాఫ్‌లో కడుపుబ్బా నవ్విస్తాం.. నవ్వి నవ్వి ప్రేక్షకులకు కడుపునొస్తుంది" అని హీరో విష్ణు మంచు అన్నారు. ఈషాన్ సూర్య దర్శకత్వంలో విష్ణు మంచు హీరోగా, పాయల్ రాజ్‌పుత్, సన్నీలియోన్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జిన్నా'. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ సినిమా తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంచు విష్ణు పంచుకున్న విశేషాలు...

నవ్వి నవ్వి కడుపునొస్తుంది

- విష్ణు మంచు



● మా నాన్న(మోహన్ బాబు) 'జిన్నా' చిత్రాన్ని 'ఢీ' సినిమాతో పోల్చారు. 'ఢీ' చేస్తున్నప్పుడు నవ్వుతూనే ఉన్నాం. విడుదలయ్యాక అది కల్ట్ సినిమా అయింది. 'ఢీ'లో ఇంటర్వెల్‌కు అంత సర్‌ప్రైజ్ అనిపించదు. కానీ, 'జిన్నా'లో ఇంటర్వెల్‌కు అందరూ సర్‌ప్రైజ్ షాక్ అవుతారు. అయితే 'జిన్నా'' మూవీ 'ఢీ' రేంజ్‌లో సక్సెస్ అవుతుందా? లేదా? అనేది చూడాలి. ● యాక్షన్ కామెడీ జానర్‌లో నేను చేసిన సినిమాలన్నీ హిట్లు ఇచ్చాయి. మధ్యలో వేరే జానర్స్ ప్రయత్నించి, తప్పు చేశాను. ఆ తప్పుని సరిదిద్దుకోవడం కోసమే 'జిన్నా' చేశా. ప్రతి సినిమా బాగుండాలనే అందరూ అనుకుంటాం.. కానీ, ఫలితాన్ని ప్రేక్షకులే నిర్ణయిస్తారు. ● 'జిన్నా'లో నా పాత్ర పేరు గాలి నాగేశ్వ రావు. జినా అని పిలిస్తే బాగుండదు.. అందుకే జిన్నా అని పెట్టాం. జిన్నా అప్పు చేసి టెంట్ హౌస్ పెట్టుకుంటాడు. ఏ పెళ్లికి టెంట్ వేసినా ఆ పెళ్లి ఆగిపోతుంది. అప్పుడు అప్పు ఎలా తీర్చాడు?. అన్నదే ఈ చిత్ర కథ.

● 'పెదరాయుడు, రాయలసీమ రామన్న చౌదరి' సినిమాలకు ఏమైనా ప్రిపేర్ అయ్యారా? అని నాన్నని అడిగాను. 'ప్రిపరేషన్ లేదు.. మన పాత్ర చెబుతారు.. దాన్నే దృష్టిలో పెట్టుకుని చేయాలి' అని ఆయన చెప్పడంతో షాక్ అయ్యాను. 'జిన్నా' కోసం నేను చిత్తూరు యాస మాట్లాడాల్సి వచ్చింది.. దాని కోసం కష్టపడ్డాను. జి.నాగేశ్వరరెడ్డి గారు ఇతర సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఈ చిత్రానికి శ్రీనువైట్లగారి అసిస్టెంట్ సూర్యను డైరెక్టర్‌గా తీసుకున్నాం. ● ఈ చిత్రానికి మూల కథ జి.నాగేశ్వరరెడ్డిగారు అందించారు. 'జిన్నా' కోసం కోన వెంకట్ గారు ప్రతి రోజూ పని చేశారు.. ఆయనకు చాలా థ్యాంక్స్. మనకు జనాలతో కనెక్షన్ ఉండాలంటే సోషల్ మీడియాలో ఉండక తప్పదు. అయితే ఇందులో విమర్శలు కూడా ఎదుర్కోవాల్సిందే. ● 'జిన్నా'తో నా కెరీర్‌లో ది బెస్ట్ ఆల్బమ్ ఇచ్చారు అనూప్ రూబెన్స్. ఈ చిత్రంలో చిన్నపిల్లల ట్రాక్‌ని నా కుమార్తెలు అరియానా, వివీయానా పాడాలనే ఆలోచన నాదే. దీనిపై అనూప్ తొలుత సందేహపడ్డా, వారి పాట విన్నాక సంతోషించాడు. భవిష్యత్తులో వాళ్లు మంచి సింగర్లు కావాలని కోరుకుంటున్నాను.. కానీ వాళ్లకి నటీమణులు కావాలని ఉంది. నేను నటించే సినిమాలు మా అమ్మ, నా పిల్లలతో కలిసి చూసేలా ఉండాలనుకుంటున్నా. ప్రభుదేవా, ప్రేమ్ రక్షిత్ మాస్టర్‌లు డ్యాన్స్ విషయంలో బాగా కష్టపెట్టారు. నా కెరీర్‌లో బెస్ట్ సాంగ్స్, డ్యాన్స్‌లు 'జిన్నా' లో ఉన్నాయి. ● కొన్ని సినిమాల రీమేక్ హక్కులు కొన్నాను. మా ప్రొడక్షన్‌లో వేరే హీరోలతోనూ ఆ సినిమాలు చేస్తాను. నవంబర్‌లో ఆ చిత్రాల గురించి ప్రకటిస్తాను. ప్రస్తుతానికి యాక్షన్ కామెడీ జానర్‌లోనే సినిమాలు చేయాలనుకుంటున్నాను. శ్రీను వైట్లగారు, నేను కలిసి చేయనున్న చిత్రం జనవరి లేదా ఫిబ్రవరిలో స్టార్ట్ అవుతుంది. మరో క్రేజీ ప్రాజెక్ట్‌కి చర్చలు జరుగుతున్నాయి.

> 'మా'(మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) టీమ్‌లో అంతా మంచి వాళ్లున్నారు. వారు బాగా పని చేస్తుండటంతో నేను ఓ వైపు హీరోగా, మరోవైపు 'మా' అధ్యక్షునిగా ప్రశాంతంగా ఉంటున్నాను. 'మా' అధ్యక్షునిగా మళ్లీ పోటీ చేయనన్నాను. నా కంటే ఇంకా మంచి ప్రెసిడెంట్ రావొచ్చేమో? ఒక వేళ ఇండస్ట్రీ పెద్దలు మళ్లీ నన్ను చేయమంటే చేస్తాను. అయితే ఈసారి ఏకగ్రీవంగా ఎన్నుకుంటే మంచిదని నా అభిప్రాయం.

సర్దార్‌ని ఎంజాయ్ చేస్తారు

- కార్తీ

"'సర్దార్' లాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. దీపావళికి కుటుంబం అంతా కలసి ఈ చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయొచ్చు" అని హీరో కార్తీ అన్నారు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా నటించిన చిత్రం 'సర్దార్'. రాశీఖన్నా, రజిషా విజయన్ హీరోయిన్స్. ప్రిన్స్ పిక్చర్స్‌పై ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో నేడు విడుదలవుతోంది. తెలుగులో అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాని రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా కార్తీ మాట్లాడుతూ...



● 'పొన్నియిన్ సెల్వన్' చిత్రం లేట్‌గా విడుదలైనా గొప్ప హిట్ అందుకుంది. అలాంటి ఓ మంచి చిత్రం తర్వాత నేను చేసే సినిమా ప్రత్యేకంగా ఉండాలి. అలా ఇండియన్ స్పై థ్రిల్లర్‌గా 'సర్దార్' వస్తోంది. ఇందులో మొదటిసారి తండ్రీ కొడుకుల పాత్రలో కనిపిస్తున్నా. 'సర్దార్' పాత్ర సమాజం నుండి ఏమీ ఆశించదు.. దేశం కోసమే పని చేస్తుంది. కానీ, పోలీస్ పాత్రకి ప్రతి చిన్నదానికి పబ్లిసిటీ కావాలి. ఈ రెండు పాత్రల మధ్య చాలా వైవిధ్యం ఉంటుంది. ● సర్దార్ పాత్ర రియల్ క్యారెక్టర్ స్ఫూర్తితో డిజైన్ చేశారు. ఇండియాలో పుట్టిన రంగస్థల నటుడు పాకిస్థాన్‌లో జనరల్‌గా పని చేశారు. దీని స్ఫూర్తిగా ఈ కథని రాశారు. 1980లో జరిగే కథ ఇది. ఒక గ్రామంలో పెరిగిన రంగస్థల నటుడు గూఢచారిగా మారి దేశానికి ఏం చేశాడనేది మిత్రన్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమా చూసిన తర్వాత చాలా మంది కొన్ని మామూలు అలవాట్లు మార్చుకుంటారనే నమ్మకం ఉంది. ● 'ఖైదీ' సినిమా చేసినప్పుడు హాలీవుడ్ సినిమాకి దీటుగా ఉండాలని అనుకున్నాం. ఇప్పుడు 'సర్దార్'ని కూడా హాలీవుడ్ మూవీలా చేశాం. నా కెరీర్‌లో ఇది సవాల్‌తో కూడిన పాత్ర. ఒక బలమైన విషయాన్ని సమాజానికి చూపించాలనే మిత్రన్ తపన నాకు నచ్చింది. కెమెరామేన్ జార్జ్ 1980ల నాటి కొత్త ప్రపంచాన్ని సృష్టించారు. జీవీ ప్రకాష్ కుమార్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. 'సర్దార్'ని వారం తర్వాత హిందీలో రిలీజ్ చేయాలనే ఆలోచన ఉంది. ● ప్రేక్షకులు ఇచ్చిన నమ్మకంతోనే 'కాష్మోరా, ఖాకీ, ఖైదీ, పొన్నియిన్ సెల్వన్' వంటి భారీ సినిమాలు చేస్తున్నాను. వారు ఇచ్చిన ప్రోత్సాహంతో వైవిధ్యమైన సినిమాలు చేయాలనే ఉత్సాహం మరింతగా నాలో వస్తోంది. ● నాగార్జున అన్నయ్య ఉన్నారని 'ఊపిరి'లో నటించాను. మా 'సర్దార్'ని తెలుగులో ఆయన రిలీజ్ చేస్తుంటే హాయిగా ఉంది.. సినిమాకి కావాల్సినవన్నీ ఆయనే చూసుకుంటారు. నన్ను చాలా ప్రేమిస్తారు.. నేను కూడా ఆయన పట్ల కృతజ్ఞతతో ఉంటాను. 'సర్దార్' ట్రైలర్ చూసిన అన్నయ్య(సూర్య) చాలా సర్‌ప్రైజ్ అయ్యారు.. బలమైన కథలా ఉందన్నారు. ● పాన్ ఇండియా కథలు మనం ప్లాన్ చేస్తే వచ్చేవి కాదు. రాజమౌళిగారు 'బాహుబలి'ని తెలుగు ప్రేక్షకుల కోసం తీశారు.. అది పాన్ వరల్డ్ వెళ్లింది. సినిమా, కాన్సెప్ట్ బాగుంటే పాన్ ఇండియా ఆడుతుంది. తెలుగులో నేరుగా సినిమా చేసేందుకు కొన్ని కథలు వింటున్నాను. నిజానికి తెలుగు వేరే పరిశ్రమ అనుకోను. ఇది నా సొంత ఇల్లు. అమ్మ(తమిళ్) ఇంటి నుంచి పిన్ని(తెలుగు) ఇంటికి వచ్చినట్లే ఉంటుంది(నవ్వుతూ).

హిట్ సినిమాను ప్లాన్ చేయలేం

- విష్వక్‌సేన్


"నేను ఓ యాక్టర్‌గా అత్యాశ పడకూడదని, తొందర పడకూడదని ఫిక్స్‌అయ్యాను. కొంతకాలం వరకు డిఫరెంట్, ప్రయోగాత్మక సినిమాలు చేస్తూనే ఉంటాను. యాక్టర్‌గా కొంత దూరం ప్రయాణించాక.. అంటే నాకు ముప్పై ఏళ్లు దాటిన తర్వాత బాక్సాఫీస్ నంబర్ ఫార్ములా, స్టార్ కావడం ఎలా? వంటి అంశాలపై దృష్టిపెడతాను. అప్పటి వరకు క్రమశిక్షణతో ఓ ఫ్లోలో సినిమాలు చేసుకుంటూ వెళతాను" అని విష్వక్ సేన్ అన్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో విష్వక్‌సేన్ హీరోగా, వెంకటేశ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఓరి దేవుడా..!'. ఈ సినిమాలో ఆశాభట్, మిథిలా పాల్కర్ హీరోయిన్స్‌గా నటించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై పెరల్ వి. పొట్లూరి, పరమ్ వి.పొట్లూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో విష్వక్ సేన్ చెప్పిన విశేషాలు.....



● 'ఓ మై కడవులే' చిత్రానికి 'ఓరి దేవుడా..!' సినిమా తెలుగు రీమేక్. 'ఓరి దేవుడా..!' కు కూడా ఒరిజినల్ డైరెక్టర్ అయితేనే బాగుంటుందని పీవీపీగారు అన్నారు. 'ఓ మై కడవులే..' చిత్రంలో దర్శకునిగా అశ్వత్ ఏమైతే చేయాలేకపోయాడో అవన్నీ 'ఓరి..దేవుడా..!' లో చేశాడు. అలా సినిమా అప్‌గ్రేడ్ అయ్యింది. ● వెంకటేశ్‌గారితో వర్క్ చేయడం నా లైఫ్‌లో నేను ఊహించని సర్‌ప్రైజ్. నా అదృష్టం కూడా. వెంకటేశ్ గారి రాకతో మా సినిమా స్థాయి ఇంకా పెరిగింది. షాట్ గ్యాప్‌లో సమయాన్ని వృథా చేయకుండా డైలాగ్స్‌ను ప్రాక్టీస్ చేయడం అనేది వెంకటేశ్‌గారిని చూసి నేర్చుకున్నాను. సల్మాన్‌ఖాన్ గారి సినిమాతో వెంకటేశ్‌గారు బిజీగా ఉండటం వల్లే ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొనలేకపోయారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నా గురించి రామ్‌చరణ్‌గారు మంచిగా మాట్లాడటం సంతోషంగా ఉంది.. అది ఆయన గొప్పదనం. ● 'అశోకవనంలో అర్జునకల్యాణం' వంటి సినిమా చేయొద్దని నాకు చాలా మంది సలహాలు ఇచ్చారు. కానీ ఓ యాక్టర్‌గా నన్ను కొత్త ఆడియన్స్‌కు దగ్గర చేసింది, యాక్టర్‌గా నాకు ఇంకా మంచి పేరు తెచ్చిపెట్టింది ఆ సినిమాయే. ఇక హిట్ సినిమాలను ప్లాన్ చేసి తీయలేం. గొప్ప సినిమాలు ఏవైనా మనల్ని వెతుక్కుంటూనే రావాలి. ఇక ఏదైనా కాంట్రవర్సీ జరిగినప్పుడు నా తప్పు లేదని నేను నిరూపించుకుంటాను. అలాంటప్పుడు ఆ వివాదం నా సినిమా పబ్లిసిటీకి ప్లస్ అయితే కావొచ్చు. 'పాగల్' మూవీ ప్రమోషన్ ప్రాంక్ వీడియో ఆలోచన మా యూనిట్ అందరిదీ. ● కాల్షీట్స్ సర్దుబాటు కుదరక పోవడం వల్లే 'హిట్ 2' చేయలేకపోయా. 'దాస్ కా ధమ్కీ' షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. అర్జున్‌గారి దర్శకత్వంలో నేను చేస్తున్న సినిమా షూటింగ్‌లో నవంబరు 3 నుంచి పాల్గొంటాను. 'గామీ' సినిమాకు సీజీ వర్క్ ఎక్కువ చేయాల్సి ఉంది. అందుకే ఆలస్యం అవుతోంది. 'ఫలక్‌నుమాదాస్ 2' షూటింగ్ వచ్చే ఏడాది చివర్లో ప్రారంభం అవుతుంది. నిర్మాత రామ్ తాళ్లూరిగారితో ఓ సినిమా చేస్తున్నా. కొత్త దర్శకుడు రవితేజ ఈ సినిమాకు వర్క్ చేస్తారు. కథలు కుదిరితే మల్టీస్టారర్ ఫిల్మ్స్‌కు సిద్ధమే.


కాలర్ ఎగరేసుకునే సమయం ఇది

- సందీప్ కిషన్



● రంజిత్, భరత్ చౌదరి, సందీప్ కిషన్, దివ్యాంశ, రామ్‌మోహన్ రావు

సందీప్ కిషన్ హీరోగా, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో రంజిత్ జయకొడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'మైఖేల్'. దివ్యాంశా కౌశిక్ హీరోయిన్. నారాయణ్‌దాస్ కె.నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్‌మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. సందీప్ కిషన్ మాట్లాడుతూ–''నాకు నేను పెట్టుకున్న అతి పెద్ద పరీక్ష మైఖేల్. మూడుసంవత్సరాల క్రితం 'మైఖేల్' వర్క్‌ను స్టార్ట్ చేశాం. ఈ సినిమా కోసం దాదాపు 24 కేజీల బరువు తగ్గాను. సినిమాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు నంబరవన్ అని నంబర్స్ చెబుతున్నాయి. తెలుగు ఇండస్ట్రీ కాలర్ ఎగరేసుకునే సమయం ఇది'' అన్నారు. ''మైఖేల్' చేసేందుకు ఒప్పుకున్న సందీప్ కిషన్, విజయ్ సేతుపతిలతో పాటు నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు రంజిత్. ''మైఖేల్' పట్ల హ్యాపీగా ఉన్నాం'' అన్నారు రామ్‌మోహన్ రావు, భరత్ చౌదరి.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 210

శుక్రవారం 21-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ రాజీనామా

సొంత పార్టీ నుంచే అసమ్మతి సెగ ఎదుర్కొంటున్న బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. అధికార పగ్గాలు చేపట్టిన 45 రోజుల్లోనే.. '10 డౌనింగ్ స్ట్రీట్' నుంచి నిష్క్రమించారు. తనకు కట్టబెట్టిన బాధ్యతను నెరవేర్చలేకపోయాయని, అందుకే రాజీనామా చేసినట్లు చెప్పారు.

-IV లో

ఏది న్యాయం? ఎవరిది ధర్మం?

మంచికి, మోసానికి మధ్య జరుగుతున్న యుద్ధమిది

మున్ముందు ఎన్నో కుట్రలకు తెర తీస్తారు

వాటన్నింటినీ తిప్పికొట్టి ధర్మం వైపు నిలబడండి

కృష్ణాజిల్లా అవనిగడ్డ సభలో సీఎం వైఎస్ జగన్ పిలుపు

- విప్లవాత్మక పథకాలతో ఊళ్ల ముఖ చిత్రమే మార్చేశాం
- ఎన్నో విధాలా మనం చేస్తున్న మంచిని జీర్ణించుకోలేకే కుట్రలు.. దత్తపుత్రుడితో బూతులు తిట్టిస్తూ వీధి రౌడీలను మించిపోయారు
- చెప్పులు చూపిస్తూ దారుణంగా మాట్లాడుతున్నారు
- ఇలాంటి వారు మనకు నాయకులా? ఆలోచించండి

6లో

"నాకు వారి మాదిరిగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడు తోడుగా ఉండకపోవచ్చు. నాకు దేవుడి దయ, ఆశీర్వదించే ప్రజలు ఉన్నారు. ప్రతి అక్క, చెల్లెమ్మ, అన్న, తమ్ముడు, అవ్వ, తాత తోడుగా నిలబడతారన్న నమ్మకం ఉంది. వారు అబద్ధాలను, కుట్రలను, మీడియాను, దత్తపుత్రుడిని, వారి పొత్తులను నమ్ముకుంటే.. నేను దేవుడి దయను, అక్కచెల్లెమ్మల కుటుంబాలను నమ్ముకున్నాను. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అన్నదే కొలమానంగా తీసుకోండి. మంచి జరిగుంటే జగనన్నకు తోడుగా నిలవండి. - సీఎం జగన్



రైతులకు భూ హక్కు పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

- కృష్ణాజిల్లా అవనిగడ్డ సభలో సీఎం జగన్
- అత్యాధునిక సర్వే ద్వారా 22(ఏ)1 భూముల సమస్య కొలిక్కి.. 22 వేల మంది రైతులకు హక్కు పత్రాల జారీకి శ్రీకారం

6లో

'ఫ్యామిలీ డాక్టర్' ట్రయల్ రన్

- నేటి నుంచే పల్లె ప్రజలకు ఇంటివద్దే వైద్య సేవలు
- వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి సాంత్వన

10లో

పోలీసు ఉద్యోగార్థులకు సీఎం దీపావళి కానుక

6,511 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు



- పోలీస్ కావాలనుకుంటున్న నిరుద్యోగ యువతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీపావళి కానుక ఇచ్చారు. పోలీసు శాఖలో ఏకంగా 6,511 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఎస్సై(సివిల్) 315, కానిస్టేబుల్(సివిల్) 3,580, ఆర్ఎస్సై 96, కానిస్టేబుల్(ఏపీఎస్పీ) 2,520 పోస్టులను వైఎస్ జగన్ ప్రభుత్వం భర్తీ చేయనుంది.

- వివరాలు 10లో

600 దాటొద్దు

- పాదయాత్రలో రైతులే ఉండాలి
- వేల మంది ఎలా పాల్గొంటారు?
- ఇతరులు సంఘీభావం తెలపొచ్చు
- ఆ పేరుతో యాత్రలో పాల్గొనరాదు
- రోప్ పార్టీకి పోలీసులను ఆదేశిస్తాం
- మా ఆదేశాలకు లోబడే యాత్ర జరగాలి
- ఎలాంటి ఆదేశాలు కావాలో చెప్పండి
- ఇరుపక్షాలకు హైకోర్టు ఆదేశం.. నేడు మళ్లీ విచారణ
- అడుగడుగునా కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు
- ముఖ్యమంత్రి, ఆయన కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు
- తొడలు కొడుతూ రెచ్చగొడుతున్నారు.. వీడియోలు మీరే చూడండి
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్
- అనుబంధ పిటిషన్ దాఖలుకు అనుమతినిచ్చిన హైకోర్టు



సాక్షి, అమరావతి: రైతుల పేరుతో అమరావతి నుంచి అరసవల్లి వరకు చేపట్టిన మహా పాదయాత్రను టీడీపీ మద్దతుతో నిర్వాహకులు రాజకీయ యాత్రగా మార్చిన నేపథ్యంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తమ ఆదేశాలకు లోబడే మహా పాదయాత్ర జరగాలని తేల్చి చెప్పింది. 600 మంది రైతులు మాత్రమే యాత్రలో పాల్గొనేందుకు తాము అనుమతినిచ్చిన సంగతి గుర్తు చేసింది. అందుకు విరుద్ధంగా 600 మందికి మించి పాల్గొన డానికి వీల్లేదని ప్రాథమికంగా తేల్చిచెప్పింది. అది కూడా యాత్రలో రైతులు మాత్రమే పాల్గొనాలని తేల్చి చెప్పింది. రైతులు మినహా మిగిలిన వారెవరూ పాల్గొనకుండా రోప్ పార్టీతో తగిన చర్యలు చేపట్టేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటిం చింది. సంఘీభావం పేరుతో మిగిలిన వారు యాత్రలో పాల్గొనడానికి వీల్లేదని పేర్కొంది. తమ ఆదేశాల వల్లే పాదయాత్ర చేస్తున్నారని గుర్తు చేసిన హైకోర్టు, ఆ యాత్ర కొనసాగాలంటే వాటిని అమలు చేయాల్సిందేనని తెలిపింది. రూట్‌మ్యాప్ ప్రకారం యాత్ర జరిగేచోట అదేరోజు ఇతర పార్టీలు ఎలాంటి పోటీ కార్యక్రమాలు చేపట్టకుండా ఆదేశాలు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామంది. కోర్టు ఆదేశాలకు లోబడి యాత్ర సాగేందుకు ఎలాంటి ఆదేశాలు కావాలో తెలియచేయాలని అటు పిటిషనర్‌ను, ఇటు పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి అమరావతి పరిరక్షణ సమితి కార్యదర్శి గద్దె తిరుపతిరావు, మరో ఇద్దరు లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది.

సీఎం, ఆయన కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు..

విచారణ సందర్భంగా హోంశాఖ తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ హైకోర్టు అనుమతితో పాదయాత్ర చేస్తున్నవారు అడుగడుగునా న్యాయస్థానం విధించిన నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని నివేదించారు. యాత్ర సందర్భంగా ప్రభుత్వంపై, ప్రభుత్వ పెద్దలపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయరాదని కోర్టు ఆదేశించినా ఖాతరు చేయకుండా ముఖ్యమంత్రి, ఆయన కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. యాత్ర చేస్తున్న వారు తొడలు కొడుతూ రెచ్చగొడుతున్నారన్నారు. యాత్రలో పాల్గొనేందుకు హైకోర్టు 600 మందికే అనుమతినిస్తే రోజూ వేల సంఖ్యలో పాల్గొంటున్నారని, వీరిలో టీడీపీ నేతలు, కార్యకర్తలే ఉన్నారని తెలిపారు. సంఘీభావం పేరుతో ఏం చేస్తున్నారన్నదే ముఖ్యమన్నారు. యాత్రలో ఎవరెవరు పాల్గొంటున్నారో ఫొటోలు చూస్తే అర్థమవుతుందన్నారు. అభ్యంతరకర నినాదాలు చేయడం, రెచ్చగొట్టేలా మాట్లాడటం వల్లే రాజమహేంద్రవరం ఘటన జరిగిందని, ఇందుకు నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో యాత్ర క్షేత్రస్థాయిలో ఎలా సాగుతోంది? నిర్వాహకులు కోర్టు ఆదేశాలను ఎలా ఉల్లంఘిస్తున్నారు? టీడీపీ నాయకులు సంఘీభావం పేరుతో ఏం చేస్తున్నారు? తదితర అంశాలతో అనుబంధ పిటిషన్‌ను సిద్ధం చేశామన్నారు. పాదయాత్రకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని అందులో కోరామని, ఆ పిటిషన్‌ను పరిశీలించిన తరువాత తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఏజీ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు అనుబంధ పిటిషన్ దాఖలుకు అనుమతినిచ్చింది.

ఎలా అడ్డుకోగలం?.. ఉద్రేకం వద్దు!

సాధారణ ప్రజానీకం తమ యాత్రకు సంఘీభావం తెలుపుతున్నారని, వారిని ఎలా అడ్డుకోగలమని ఉన్నం మురళీధరరావు పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు ఏ కార్యక్రమం చేపట్టినా పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోవడం లేదన్నారు. అమరావతి రైతులను పెయిడ్ ఆర్టిస్టులంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మురళీధరరావు ఆవేశంగా వాదనలు వినిపిస్తుండటంతో.. ఉద్రేకం తగ్గించుకోవాలని న్యాయమూర్తి ఆయనకు సూచించారు. 600 మంది రైతులు మాత్రమే పాదయాత్రలో పాల్గొనాలని హైకోర్టు స్పష్టంగా చెబితే అందుకు విరుద్ధంగా వేల సంఖ్యలో ఎలా పాల్గొంటారని న్యాయమూర్తి ప్రశ్నించారు. సంఘీభావం తెలిపేందుకు రావడంలో తప్పు లేకున్నా ఆ పేరుతో యాత్రలో పాల్గొంటామంటే అది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. యాత్ర విషయంలో కోర్టు ఆదేశాలు చాలా స్పష్టంగా ఉన్నాయని న్యాయమూర్తి గుర్తు చేశారు. తమ ఆదేశాలకు లోబడే యాత్ర సాగాల్సి ఉంటుందని తేల్చి చెబుతూ విచారణను నేటికి వాయిదా వేశారు. ఇదిలా ఉంటే ఈ మొత్తం వ్యవహారంలో హోంశాఖ కౌంటర్ సైతం సిద్ధం చేసినట్లు తెలిసింది.

రూ.6.7 కోట్ల బంగారం, రూ.4.24 కోట్లు జప్తు!

కస్టమ్స్ అధికారుల కొరడా

సాక్షి, అమరావతి: ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి అక్రమంగా తరలిస్తున్న రూ.6.7కోట్ల విలువైన బంగారంతోపాటు రూ.4.24కోట్లను కస్టమ్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. 100 మంది అధికారులతో కూడిన 20 బృందాలు కొన్ని రోజులుగా రాష్ట్రంలోని నెల్లూరు, ఏలూరు, కాకినాడ, సూళ్లూరుపేట, చిలకలూరిపేటలో విస్తృతంగా దాడులు నిర్వహించాయి. అక్రమంగా తరలిస్తున్న 13.18 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నాయి. దాంతోపాటు అప్పటికే అక్రమ బంగారం విక్రయించడం ద్వారా వచ్చిన రూ.4.24కోట్లనూ జప్తు చేశాయి. ఈ కేసులో నలుగురిని కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. వారిని విశాఖపట్నంలోని న్యాయస్థానంలో హాజరువరచగా.. వారికి రిమాండ్ విధించారు.

'డిగ్రీ' గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనం పెంపు

ఉత్తర్వులు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనం పెంచుతూ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే శ్యామలరావు గురువారం ఉత్తర్వులు (జీవో 157) జారీ చేశారు. వారి వేతనాన్ని గంటకు రూ.200 నుంచి రూ. 400కు ప్రభుత్వం పెంచింది. ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కొంతమేరకైనా ఉపశమనం కలిగించేలా వీరి వేతనాలు పెంచడం హర్షణీయమని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. నెలకు రూ.28 వేలకు మించకుండా వీరికి గౌరవ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

విహారం... పెను విషాదం!

- సముద్రంలో నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం.. మరో ముగ్గురి కోసం గాలింపు
- అందరూ గుంటూరులోని జీవీఆర్ఎస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు
- బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లో ఘటన



చీరాల టౌన్: విహారయాత్ర కోసం బీచ్‌కు వచ్చిన నలుగురు విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభించింది. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఈ విషాద ఘటన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం సముద్రతీరంలో గురువారం జరిగింది. చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు... గుంటూరుకు చెందిన జీవీఆర్ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు రామాపురం బీచ్‌కు వచ్చారు. వారు సముద్రంలో స్నానం చేస్తుండగా పెద్ద అలలు వచ్చాయి. తెనాలికి చెందిన యడవల్లి రమణ (19), పులివర్తి గౌతమ్ (20), అమరావతి మండలం పరిమి గ్రామానికి చెందిన తాళ్లూరి రోహిత్ (20), హైదరాబాద్‌కు చెందిన తిరుణగిరి మహదేవ్ (18) అలల తాకిడికి నీటిలో మునిగిపోయారు. ఆ సమయంలో కేకలు వేస్తున్న విద్యార్థులను కాపాడేందుకు రామాపురం మత్స్యకారులు ప్రయత్నించినా, ఫలితం లేకపోయింది. కొద్దిసేపటి తర్వాత మహదేవ్ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. మిగిలిన ముగ్గురు విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. మహదేవ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

తీరంలో మిన్నంటిన రోదనలు...

గల్లంతైన విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సహచర విద్యార్థులు రామాపురానికి చేరుకున్నారు. కుమారులు సముద్రంలో గల్లంతుకావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. కష్టపడి బిడ్డలను చదివించుకుంటున్న తమపై విధి కక్షగట్టి తీసుకెళ్లిందని, తమకు కడుపుకోత మిగిల్చిందని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అక్కడికి చేరుకుని విద్యార్థులు, డీఎస్పీ పి.శ్రీకాంత్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

పాఠశాలల పనివేళల్లో ఎన్నికల ప్రచారం వద్దు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజకవర్గాలకు జరుగనున్న ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు, టీచర్ల సంఘాల నేతలు పాఠశాల పనివేళల్లో ఎన్నికల ప్రచారం చేయరాదని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. అలాచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో పాఠశాలల పనివేళల్లో టీచర్లసంఘాల నేతలు ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. ఆ కారణంగా విద్యాభ్యాసన కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం ఎదురవుతుందని వివరించింది. డీఈవోలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

సాగులో బ్రాండింగ్ తీసుకురండి

- రాష్ట్రస్థాయి సమాఖ్యగా ఏర్పడండి
- ప్రభుత్వం చేయూతనిస్తుంది
- వ్యవసాయదారుల సదస్సులో మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి



సదస్సులో మాట్లాడుతున్న నాబార్డు మాజీ చైర్మన్ గోవిందరాజులు

సాక్షి, అమరావతి/మధురానగర్ (విజయవాడ సెంట్రల్): పనిచేసే సంస్థలు, కంపెనీలకు బ్రాండింగ్ తీసుకొచ్చేందుకు ఎంతలా తపన పడతామో.. అదేస్థాయిలో సాగులో కూడా బ్రాండింగ్ తీసుకొచ్చేందుకు కృషిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి పిలుపునిచ్చారు. సాగుబాట పట్టిన ఏ ఒక్కరూ వెనక్కితిరిగి చూడకుండా ముందుకుదూసుకుపోవాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడుగా నిలుస్తుందని చెప్పారు. విజయవాడలో గురువారం జరిగిన విద్యావంతులైన వ్యవసాయదారుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల జీతాలను వదులుకుని వ్యవసాయం పట్ల మక్కువతో సాగుబాట పట్టిన యువ రైతులంతా ఒకే వేదికపైకి రావడం శుభపరిణామమన్నారు. పండించే పంటలకు అదనపు విలువను జోడించేలా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం 30 నుంచి 50 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. రాష్ట్రస్థాయిలో సమాఖ్యగా ఏర్పడి మీరు పండించే ఉత్పత్తులకు బ్రాండింగ్ తీసుకురావాలని సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నేటి తరానికి ఆదర్శంగా సాగును లాభసాటిగా మార్చాలని కోరారు. స్త్రీనిధి బ్యాంక్ తరహాలో వ్యవసాయదారులంతా కలిసి ఓ బ్యాంకు ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు.

డ్రోన్ టెక్నాలజీతో ఖర్చులు తగ్గించుకోవాలి

నాబార్డు మాజీ చైర్మన్ సీహెచ్.గోవిందరాజులు మాట్లాడుతూ రానున్న ఐదేళ్లు డ్రోన్ టెక్నాలజీదేనని చెప్పారు. డ్రోన్ల ద్వారా సాగుచేసి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. సంప్రదాయ నాట్లు వేసే విధానాన్ని వదిలి డ్రోన్ల ద్వారా విత్తనాలు నాటుకుంటే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రామకృష్ణంరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్‌వర్మ, అఖిల భారత రైతు ఉత్పత్తిదారుల సంఘాల కన్వీనర్ జలగం కుమారస్వామి, భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాఘవులు, డైరెక్టర్లు క్రాంతికుమార్‌రెడ్డి, నరసింహరాజు, రైతు నేస్తం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో చేసిన తీర్మానాలు..

- దేశంలో మరే రాష్ట్రంలోను లేనిరీతిలో ప్రత్యేకంగా ఆర్గానిక్ పాలసీ తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్గానిక్ విశ్వవిద్యాలయం ఏర్పాటు దిశగా కృషిచేయాలి. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయాలి.
- ఆర్గానిక్ ఉత్పత్తుల విక్రయం కోసం జాతీయ రహదారుల్లో ప్రతి వంద కిలోమీటర్లకు కనీసం 10 షాపులు నిర్మించి ఇవ్వాలి. రైతుబజార్లలో ప్రత్యేక స్టాల్ కేటాయించాలి.
- ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజెన్సీని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలి.
- జనవరి 5వ తేదీన విజయవాడలో కనీసం 10 వేలమందితో ఆర్గానిక్ వ్యవసాయదారుల రాష్ట్రస్థాయి సమ్మేళనం నిర్వహించాలి.

గిరిపుత్రులకు కొత్త 104, 108 వాహనాలు

- 40 వాహనాలను ప్రారంభించిన మంత్రి విడదల రజిని
- గిరిజనుల సంక్షేమాభివృద్ధే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- వారి కోసం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి



108 అంబులెన్స్‌లో బీపీ పరీక్షించుకుంటున్న మంత్రి రజిని, పక్కన ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంత ప్రజల అభివృద్ధికి చిత్తశుద్ధితో వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు అడుగులు వేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలందించేందుకు పాత వాటి స్థానంలో 20 నూతన 104 వాహనాలు, మరో 20 నూతన 108 వాహనాలను గుంటూరు జిల్లా మంగళగిరిలో మంత్రి రజిని జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి 104, 108 వాహనాలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజనులకు మరింత మెరుగ్గా, వేగంగా, సులువుగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. రూ.246 కోట్లతో గిరిజనుల ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నామన్నారు. పార్వతీపురం మన్యం, పాడేరు ప్రాంతాల్లో రూ.వెయ్యి కోట్లకు పైగా ఖర్చుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకొస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇప్పుడు అంబులెన్సు సర్వీసులను కూడా పెంచుతున్నామన్నారు.

విశాఖ గర్జనతో బాబు, పవన్‌ల ముసుగు తొలిగింది..

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్.. ఇలా ఎంత మంది కలిసి వచ్చినా సీఎం వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరని మంత్రి రజిని అన్నారు. మూడు రాజధానులను కాంక్షిస్తూ నిర్వహించిన విశాఖ గర్జన విజయవంతమవ్వడంతో.. భయపడిన చంద్రబాబు, పవన్ ముసుగు తీసి బహిరంగంగా మళ్లీ కలిసిపోయారని చెప్పారు. పవన్ ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం.. ఆ తర్వాత చంద్రబాబు పంచన చేరడం అంతా వారి స్క్రిప్టులో భాగమేనన్నారు. వీరు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధిస్తామని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని.. ఆయన హయాంలో గిరిజనులకు కనీస వైద్య సదుపాయాలు కూడా కల్పించలేదని గుర్తుచేశారు. గిరిపుత్రులను విషజ్వరాలకు వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీని చంద్రబాబు నీరుగారిస్తే.. సీఎం జగన్ జీవం పోశారన్నారు. గ్రామీణ ప్రజలు ఇబ్బంది పడకుండా ఫ్యామిలీ డాక్టర్ విధానం కూడా అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, డిప్యూటీ సీఈవో మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకులకు అండగా సీఎం వైఎస్ జగన్

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఏకసభ్య కమిషన్ ఏర్పాటుపై వాల్మీకుల హర్షం



దీక్ష శిబిరం వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/ గాంధీనగర్(విజయవాడసెంట్రల్) : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ధర్నాచౌక్‌లో 19 రోజులుగా వాల్మీకులు చేస్తున్న సత్యాగ్రహ దీక్షలను గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. వాల్మీకి, బోయ, బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చాలన్న అంశంపై సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించడంతోపాటు దీనిపై అధ్యయనం చేసేందుకు ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో వాల్మీకులు దీక్ష విరమించారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో వాల్మీకుల దీక్షా శిబిరాన్ని మంత్రి పెద్దిరెడ్డి సందర్శించి విరమింపజేసి సీఎం వైఎస్ జగన్ వారి కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వాల్మీకుల డిమాండ్‌పై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌తో వేసిన ఏకసభ్య కమిషన్ నివేదికతోపాటు ఎస్టీ కమిషన్ నుంచి మరో నివేదికను తీసుకుని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని పెద్దిరెడ్డి వివరించారు. సీఎం వైఎస్ జగన్, తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి ప్రధాని, హోంశాఖ మంత్రులను కలుస్తామని హామీ ఇచ్చారు. కాగా, తమ డిమాండ్‌పై సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్‌కు వాల్మీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొప్పర్తిలో విద్యుత్ ఉపకరణాల తయారీ జోన్

225 ఎకరాల్లో రూ.445 కోట్లతో ఏర్పాటు

- పీఎల్ఐ స్కీం కింద ఈ రంగానికి కేంద్రం రూ.24,000 కోట్లు కేటాయింపు
- ఈ జోన్ ద్వారా రూ.3,500 కోట్ల పెట్టుబడి అంచనా
- 5,000 మందికి ప్రత్యక్షంగా 25,000 మందికి పరోక్షంగా ఉపాధి
- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు



సాక్షి, అమరావతి : వైఎస్సార్ జిల్లా కొప్పర్తి వద్ద 225 ఎకరాల్లో విద్యుత్ ఉపకరణాల తయారీ జోన్ ఏర్పాటుకు ఏపీఐఐసీ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పెంచడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ఉపకరణాల తయారీ జోన్ ఏర్పాటుకోసం ఆసక్తి గల రాష్ట్రాల నుంచి బిడ్లను ఆహ్వానించింది. సుమారు రూ.445 కోట్ల పెట్టుబడితో 225 ఎకరాల్లో ఈ జోన్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు ఏపీఐఐసీ వీసీ, ఎండీ నారాయణ భరత్‌గుప్తా 'సాక్షి'కి వెల్లడించారు. నిజానికి.. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మన్నవరం వద్ద ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ భాగస్వామ్యంతో విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్‌కు 753.85 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఆయన మరణం తర్వాత ఈ ప్రాజెక్టును ఎవ్వరూ పట్టించుకోకపోవడం, మారిన రాజకీయ పరిస్థితులతో ఈ ప్రాజెక్టు ఆర్థికంగా ప్రయోజనం కాదంటూ రెండు సంస్థలు ఒప్పందం నుంచి వైదొలగడానికి సిద్ధపడ్డాయి. ఈ నేపథ్యంలో.. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రీన్ఎనర్జీకి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుండటమే కాకుండా రూ.1.26 లక్షల కోట్లతో భారీ ఇంధన ప్రాజెక్టులను చేపట్టారు. ఈ అవకాశాలను వినియోగించుకుంటూ సౌర, పవన విద్యుత్ రంగాలకు చెందిన విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్‌ను కొప్పర్తిలో ఏర్పాటుచేయడానికి ప్రతిపాదనలను పంపింది. మొత్తం రూ.445 కోట్ల అంచనా వ్యయంలో కేంద్ర ప్రభుత్వం రూ.400 కోట్లు భరిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.45 కోట్లు వ్యయం చేస్తుంది. ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతూ ఈ జోన్‌ను సాధించుకునేందుకు నీరు, విద్యుత్‌ను చౌకగా అందించడమే కాకుండా అనేక రాయితీలను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది.

30,000 మందికి ఉపాధి

ఇక ఈ తయారీ జోన్ రాష్ట్రానికొస్తే పెట్టుబడులు, ఉపాధితోపాటు కీలకమైన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు కొప్పర్తిలో ఏర్పాటయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. విద్యుత్ ఉపకరణాల తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద సుమారు రూ.24,000 కోట్ల బడ్జెట్‌ను ఈ రంగానికి కేటాయించింది. కొప్పర్తిలో ఈ తయారీ రంగ జోన్ ద్వారా సుమారు రూ.3,500 కోట్ల పెట్టుబడులు రావడంతోపాటు ప్రత్యక్షంగా 5,000 మందికి పరోక్షంగా 25,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ, సెంటర్ పవర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లు ఇక్కడ ఏర్పాటయ్యే అవకాశముంది. ఇక్కడే 1,186 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు ప్రతిపాదనలను కూడా కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే. అలాగే, కాకినాడ వద్ద ఇప్పటికే బల్క్ డ్రగ్ పార్క్ సాధించుకున్న రాష్ట్రం ఈ రెండు పార్కులను ఇతర రాష్ట్రాలతో పోటీపడి చేజిక్కించుకుంటుందన్న ఆశాభావాన్ని అధికారులు వ్యక్తంచేస్తున్నారు.

క్రీడాభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ కృషి ప్రశంసనీయం: పీవీ సింధు



ప్రసంగిస్తున్న సింధు

ఉక్కునగరం: క్రీడాభివృద్ధికి విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కృషి అభినందనీయమని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. గురువారం ఆమె విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన కస్టమర్లు, సప్‌లైయర్స్, స్టేక్ హోల్డర్స్ సమావేశంలో సింధు పాల్గొన్నారు. అంతకు ముందు ఉక్కు స్టేడియంలో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సింధు, స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు గాలిలోకి బెలూన్లు వదిలారు. స్వచ్ఛత ప్రచారంలో భాగంగా కాంట్రాక్టు కార్మికులకు క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఇండోర్ స్టేడియంలో సింధు బాలలతో ముచ్చటించి కొద్దిసేపు వారితో బ్యాడ్మింటన్ ఆడారు. అనంతరం ఉక్కు ఎంపీ హాలులో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను, ఆమె తండ్రి రమణను సత్కరించారు. అనంతరం ఆమె స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాలను సందర్శించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మహంతి పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న క్రీడా సంబరాలు

- విజేతలకు రూ.50లక్షల విలువైన బహుమతులు
- పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి ఆర్కే రోజా



జగనన్న క్రీడా సంబరాల లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్న క్రీడా సంబరాలు' పేరుతో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో గురువారం జగనన్న క్రీడా సంబరాలు లోగోను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జగనన్న క్రీడా సంబరాలలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను తొలుత నియోజకవర్గ, జిల్లా, జోన్ స్థాయిలో పూర్తి చేస్తామన్నారు. డిసెంబర్ 20 , 21 తేదీల్లో రాష్ట్రా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు రూ.50 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామన్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, ఎండీ ఎస్.ప్రభాకరరెడ్డి, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి వాణిమోహన్ పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కళాబృందాల పోటీలు: మంత్రి రోజా

కళలు, కళాకారుల అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కళా బృందాలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి రోజా తెలిపారు. సచివాలయంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష, సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్లతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ సంప్రదాయ, జానపద, గిరిజన నృత్యరీతులు, గాత్ర (ఆర్కెస్ట్రా) పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు https:// culture. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా నంబవర్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన కళాబృందాలకు బహుమతులు, పారితోషకాలు అందజేస్తామన్నారు. వివరాలకు 0866-2434380 /390 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నువ్వు ఎక్కడవున్నా ఆయన నీతో ఉన్నాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, అక్టోబర్, 21

ప్రాణాలు తోడేస్తున్న నిర్లక్ష్యం

ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో మంగళవారం పైలెట్‌తో సహా ఏడుగురి మరణానికి దారితీసిన హెలికాప్టర్ ప్రమాదం ఎన్నో ప్రశ్నలు రేకెత్తిస్తోంది. కేదార్‌నాథ్ నుంచి గుప్తకాశీ వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. హెలికాప్టర్‌ను దించాల్సిన ప్రాంతంలో దట్టమైన మంచు అలుముకుని ఉన్నదని పైలెట్ గ్రహించి, వెనక్కి మళ్లించేందుకు ప్రయత్నించినప్పుడు దాని వెనుక భాగం నేలను తాకడంతో ప్రమాదం జరిగిందంటున్నారు. కేదార్‌నాథ్ గగనంలో హెలికాప్టర్ల సందడి మొదలై పదిహేనేళ్లు దాటుతోంది. ఏటా మే నెల మధ్యనుంచి అక్టోబర్ నెలాఖరు వరకూ సాగే చార్‌ధామ్ యాత్ర సీజన్‌లో హెలికాప్టర్లు ముమ్మరంగా తిరుగుతాయి. కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రిలలోని క్షేత్రాలను భక్తులు సందర్శిస్తారు. ఇతర ప్రయాణ సాధనాల విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. హెలికాప్టర్ల వినియోగమే వద్దని ఆదినుంచీ పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్రశాంతతకు మారుపేరైన హిమవన్నగాలతో నిండిన సున్నితమైన పర్యావరణ ప్రాంతం కేదార్‌నాథ్. ఇక్కడ హెలికాప్టర్ల రొద వన్య ప్రాణులకు ముప్పు కలిగిస్తుందనీ, వాతావరణంలో కాలుష్యం పెరుగుతుందనీ పర్యావరణవేత్తల అభియోగం. తక్కువ ఎత్తులో ఎగురుతూ చెవులు చిల్లులుపడేలా రొద చేస్తూ పోయే హెలికాప్టర్ల తీరుపై స్థానికులు సైతం తరచు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. వాటి చప్పుడు తీవ్ర భయాందోళనలు కలిగిస్తోందనీ, పిల్లల చదువులకు కూడా వాటి రాకపోకలు ఆటంకంగా మారాయనీ చెబుతున్నారు. అయినా వినే దిక్కూ మొక్కూ లేదు. హెలికాప్టర్లు నడిపే సంస్థలకు లాభార్జనే తప్ప మరేమీ పట్టదు. అందుకే లెక్కకుమించిన సర్వీసులతో హడావిడి పెరిగింది.

పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోని అధికారులు కనీసం హెలికాప్టర్ల భద్రతనైనా సక్రమంగా పర్యవేక్షిస్తున్న దాఖలాలు లేవు. తాజా దుర్ఘటనలో మరణించిన పైలెట్ అనిల్ సింగ్‌కు ఆర్మీలో 15 ఏళ్ల అనుభవం ఉంది. అయితే మొదట్లో హెలికాప్టర్లు నడిపినా మిగిలిన సర్వీసంతా విమానాలకు సంబంధించిందే. అలాంటివారు కొండకోనల్లో హెలికాప్టర్లు నడపాలంటే అందుకు మళ్లీ ప్రత్యేక శిక్షణ పొందటం తప్పనిసరి. పైగా వాతావరణంలో హఠాత్తుగా మార్పులు చోటుచేసుకునే కేదార్‌నాథ్ వంటిచోట్ల సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్లు నడపాలంటే ఎంతో చాకచక్యత, ఏకాగ్రత అవసరమవుతాయి. ఆ ప్రాంతంలో అంతా బాగుందనుకునేలోగానే హఠాత్తుగా మంచుతెర కమ్ముకుంటుంది. హెలికాప్టర్ నడిపేవారికి ఏమీ కనబడదు. అదృష్టాన్ని నమ్ముకుని, దైవంపై భారం వేసి ముందుకు కదిలినా, వెనక్కిరావడానికి ప్రయత్నించినా ముప్పు పొంచివుంటుంది. ఆ ప్రాంతం గురించి, అక్కడ హెలికాప్టర్ నడిపేటపుడు ప్రత్యేకించి పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి క్షుణ్ణంగా తెలిసినవారైతేనే ఈ అవరోధాలను అధిగమించగలుగుతారు. ముఖ్యంగా 600 మీటర్ల (దాదాపు 2,000 అడుగులు) కన్నా తక్కువ ఎత్తులో హెలికాప్టర్లు నడపరాదన్న నిబంధన ఉంది. కానీ చాలా హెలికాప్టర్లు 250 మీటర్ల (820 అడుగులు)లోపు ఎత్తులోనే దూసుకుపోతున్నాయని స్థానికులు తరచూ ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పుడు ప్రమాదం జరిగిన హెలికాప్టర్ సైతం తక్కువ ఎత్తులో ఎగురుతున్నందునే వెనక్కు మళ్లుతున్న క్రమంలో దాని వెనుక భాగం అక్కడున్న ఎత్తయిన ప్రదేశాన్ని తాకి మంటల్లో చిక్కుకుంది. ఈ సీజన్‌లో ఇంతవరకూ 14 లక్షలమందికిపైగా యాత్రికులు కేదార్‌నాథ్‌ను సందర్శించగా అందులో దాదాపు లక్షన్నరమంది తమ ప్రయాణానికి హెలికాప్టర్లను ఎంచుకున్నారు. ఈ ప్రాంతంలో హెలికాప్టర్ల వినియోగాన్ని నిషేధించాలని కొందరు పర్యావరణవేత్తలు అయిదేళ్ల క్రితం జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినప్పుడు దాన్ని తోసిపుచ్చిన ట్రిబ్యునల్... వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించింది. అవి నిర్దేశిత ఎత్తులో ఎగిరేలా చూడాలనీ, సర్వీసుల సంఖ్యపై కూడా పరిమితులు విధించాలనీ ఆదేశించింది. కానీ ఎవరికి పట్టింది?

మన దేశంలో పారిశ్రామిక ప్రాంతాల్లో, వాణిజ్య ప్రాంతాల్లో, నివాస ప్రాంతాల్లో శబ్ద కాలుష్యం ఏయే స్థాయిల్లో ఉండాలో నిర్దేశించారు. ఈ శబ్దకాలుష్యానికి సంబంధించిన నిబంధనల్లో పగలు, రాత్రి వ్యత్యాసాలున్నాయి. కానీ విషాదమేమంటే దేశానికే ప్రాణప్రదమైన హిమశిఖర ప్రాంతాల్లో శబ్దకాలుష్యం పరిమితులు ఏమేరకుండాలో నిబంధనలు లేవు. అక్కడ తిరిగే హెలికాప్టర్ల వల్ల ధ్వని కాలుష్యం సగటున 70 డెసిబుల్స్ స్థాయిలో, గరిష్ఠంగా 120 డెసిబుల్స్ స్థాయిలో ఉంటున్నదని పర్యావరణవేత్తల ఆరోపణ. దీనిపై నిర్దిష్టమైన నిబంధనలు రూపొందించాల్సిన అవసరం లేదా? పుణ్యక్షేత్రాలు సందర్శించుకోవాలనుకునేవారినీ, ఆ ప్రాంత ప్రకృతిని కళ్లారా చూడాలని తహతహలాడే పర్యాటకులనూ ప్రోత్సహించాల్సిందే. ఇందువల్ల ప్రభుత్వ ఆదాయం పెరగటంతోపాటు స్థానికులకు ఆర్థికంగా ఆసరా లభిస్తుంది. అయితే అంతమాత్రంచేత పర్యావరణ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడే ధోరణి మంచిది కాదు. పర్వత ప్రాంతాల్లో హెలికాప్టర్లు నడపటంలో అనుభవజ్ఞులైనవారిని మాత్రమే పైలెట్లుగా అనుమతించటం, తగిన ఎత్తులో హెలికాప్టర్లు రాకపోకలు సాగించేలా చూడటం, అపరిమిత శబ్దకాలుష్యానికి కారణమయ్యే హెలికాప్టర్ల వినియోగాన్ని అడ్డుకోవటం తక్షణావసరం. ఈ విషయంలో సమగ్రమైన నిబంధనలు రూపొందించటం, అవి సక్రమంగా అమలయ్యేలా చూడటం ఉత్తరాఖండ్ ప్రభుత్వ బాధ్యత.

రూపాయి విలువ తగ్గింది, ఎందుకు?

విశ్లేషణ


రంగనాయకమ్మ

ఒక దేశపు కరెన్సీ మారకం రేటు ఎందుకు తగ్గుతుంది? దేశాల మధ్య ఎగుమతులు, దిగుమతుల విలువ సమానంగా ఉంటే, మారకాల సమస్య, ఎకౌంట్లు చూసుకునే సాంకేతిక సమస్య మాత్రమే. కానీ, 2 దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ సమానంగా వుండడం ఎప్పుడో గానీ జరగదు.

ఇటీవల తరచుగా వినిపిస్తున్న ఒక వార్త: 'డాలరుతో మారకంలో రూపాయి విలువ పడిపోతోంది'–అని. రూపాయి 'మారకం విలువ రేటు'లో మార్పునకి కారణాన్ని తెలుసుకోవాలంటే, 'మారకం' అంటే ఏమిటో, 'మారకం విలువ' అంటే ఏమిటో ముందు తెలియాలి.

సరుకుల 'మారకం' అంటే, ఒక వ్యక్తిగానీ, ఒక దేశంగానీ, ఒక సరుకుని బైటికి ఇచ్చి, ఇంకో సరుకుని బైటినించీ తీసుకోవడమే. సరుకుకి 'మారకం విలువ' అంటే, ఆ సరుకుని తయారు చేయడానికి పట్టిన శ్రమ కాలమే. ఎక్కువ శ్రమ జరిగితే ఎక్కువ విలువ, తక్కువ శ్రమకి తక్కువ విలువ.

ఏ సరుకుని తయారు చేయడానికైనా, మొదట ప్రకృతిలో దొరికే సహజ పదార్థం ఏదో ఒకటి వుండాలి. ప్రకృతి సహజ పదార్థం మీద శ్రమ జరిగితే, ఏదో ఒక వస్తువు తయారవుతుంది. ఆ వస్తువుని అమ్మకానికి పెడితే, అదే 'సరుకు'. ఒక సరుకు తయారు కావడానికి జరిగిన శ్రమని కొలవడానికి వున్న సాధనం అది జరిగిన 'కాలమే'. గంటలో, రోజులో, నెలలో, సంవత్సరాలో!

సరుకుని, మారకం కోసం ఇవ్వడం అంటే, దాన్ని అమ్మడమే. అప్పుడు ఆ సరుకు వల్ల 'కొంత డబ్బు' వస్తుంది. 'డబ్బు' అంటే, సరుకుని తయారుచేసిన శ్రమ కాలమే– అని గ్రహించాలి. డబ్బుకి వెనక, ఆధారంగా వుండేది బంగారం అనే లోహం! బంగారం కూడా ఇతర సరుకుల లాగే, మొదట గనుల్లో దొరికే సహజ పదార్థం తోటీ, దానిమీద జరిగే శ్రమల తోటీ తయారవుతుంది. మారకం విలువ రేటునీ, తర్వాత ఆ రేటులో మార్పునీ తెలుసుకోవడానికి, మొదట ఇంత వరకూ చూసిన విషయాలు చాలు.

2 దేశాల డబ్బుల మధ్య మారకం విలువ రేటు ఏర్పడడానికి ఆధారం – ఆ 2 దేశాల డబ్బుకీ వెనక వుండే కొంత కొంత బరువుగల బంగారాలే. డాలర్ దేశపు డబ్బు వెనక 4 గ్రాముల బంగారం వుందనీ, రూపాయి దేశపు డబ్బు వెనక 2 గ్రాముల బంగారం వుందనీ అనుకుందాం. అప్పుడు ఒక డాలరు= 2 రూపాయలు అవుతుంది. ఇది, ఆ రెండు దేశాల డబ్బులకు వున్న మారకం విలువ రేటు. ఇది, ఆ దేశాల డబ్బు వెనక వున్న బంగారాల కొలతల్ని బట్టే! ఈ కొలతలు మారడానికి, వేరే వేరే కారణాలు కూడా వుండొచ్చు.

2వ ప్రపంచ యుద్ధకాలం తర్వాత, డాలర్ దేశంలో (అమెరికాలో), ఆర్థిక పరిస్థితులు ఇతర దేశాలలో కన్నా 'అభివృద్ధి' చెంది వున్నాయి. ముఖ్యంగా, ఆ నాడు ఏ దేశంలోనూ లేనన్ని బంగారు నిల్వలు డాలరు దేశంలో వున్నాయి. దానివల్ల, డాలరు దేశపు ఆధిక్యం పెరిగింది. అప్పట్నించీ 'అంతర్జాతీయ ధనం'గా డాలరుని దాదాపు అన్ని దేశాలూ అంగీకరిస్తూనే వున్నాయి. వేరు వేరు దేశాల మధ్య ఎగుమతులతో, దిగుమతులతో 'విదేశీ వర్తకాలు' జరుగుతూ వుంటాయి. ఒక దేశం ఇంకో దేశానికి కొంత డబ్బు ఇవ్వవలిసి వస్తే, ఆ డబ్బు లెక్కని, ఆ 2 దేశాల డబ్బులకూ వున్న మారకం రేటు ప్రకారమే



లెక్క చూడాలి. ఒక దేశం నించి, ఆ రెండో దేశం డబ్బుకి ఎన్ని డాలర్లు వస్తాయో కూడా లెక్క చూసి, ఆ డబ్బుని డాలర్లలోనే చెల్లించాలి.

ఇప్పుడు అసలు ప్రశ్న, ఒక దేశపు కరెన్సీ మారకం విలువ రేటు ఎందుకు తగ్గుతుంది? దేశాల మధ్య ఎగుమతుల విలువలూ, దిగుమతుల విలువలూ సమానంగా వుంటే, వేరు వేరు దేశాల డబ్బు మారకాల సమస్య, కేవలం ఎకౌంట్లు చూసుకునే సాంకేతిక సమస్యగా మాత్రమే వుంటుంది. కానీ, 2 దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ సమానంగా వుండడం ఎప్పుడో గానీ జరగదు.

భారత దేశం ఏ దేశానికి చెల్లించవలిసి వచ్చినా, సాధారణంగా డాలర్లలోనే చెల్లించాలి కాబట్టి, అప్పుడు భారత దేశానికి డాలర్లు అవసరం. ఆ డాలర్లు ఎంత మొత్తంలో కావాలీ – అనేది, భారత దేశం ఇతర దేశాలకు చేసిన ఎగుమతుల, దిగుమతుల విలువ ఎంతా– అనే లెక్క (కరెంట్ ఎకౌంటు) మీద ఆధార పడి వుంటుంది. గత కొంత కాలంగా, భారత దేశానికి దిగుమతుల కోసం (ఉదాహరణకి: క్రూడ్ ఆయిల్ కోసం) అయ్యే ఖర్చు ఎక్కువగా వుండడం వల్ల, భారత దేశం ఇతర దేశాల దిగుమతుల కోసం చెల్లించేదాన్ని ఎక్కువ డాలర్లలోనే చెల్లించాలి. కాబట్టి డాలర్లని కొనడం కోసం డాలర్లు అమ్మే కరెన్సీ మార్కెట్‌కి వెళ్ళాలి. డాలరు అనేది, బియ్యం లాంటి వాడకం సరుకు కాకపోయినప్పటికీ, అది కరెన్సీలను అమ్మే, కొనే మార్కెట్‌లో ఒక సరుకుగా అయింది. ఏ సరుకుకి అయినా, దాని సప్లై తక్కువగా వుంటే, అది దొరకడం కష్టం కాబట్టి దాని కోసం డిమాండ్ పెరిగి, దాని ధర పెరుగుతుంది. అలాగే, డాలర్లని కొనవలిసిన పరిస్థితిలో, దాని ధర తగ్గడమో, పెరగడమో జరుగుతుంది. ఈ దశలో, ఏ దేశం అయినా, ఇతర దేశాలకు చెల్లించవలిసిన దిగుమతుల డబ్బుని డాలర్లలోనే చెల్లించాలి కాబట్టి, డాలర్లకి డిమాండు ఎక్కువగా వుంటుంది. అప్పుడు డాలర్లని ఎక్కువ ధరలతో కొనాలి. అలాంటప్పుడు ఒక డాలర్‌కి, గతంలో కంటే ఎక్కువ రూపాయిలు ఇచ్చి కొనవలిసి వస్తుంది. ఉదాహరణకి, డాలరు ధర పెరుగుతూ, పెరుగుతూ, కిందటి నెలలో 70 రూపాయిలు అయింది. ఆ ధర ఇప్పుడు 80 కూడా దాటేసింది. పత్రికల్లో, ''డాలరు మిలమిల, రూపాయి వెల వెల!'' అనే హెడ్డింగులు కనిపిస్తున్నాయి. అంటే, రూపాయి విలువ తగ్గుతూ, తగ్గుతూ పోతోంది. అంటే, డాలరుని ప్రతీసారీ ఎక్కువ రూపాయలతో కొనవలిసి వస్తోంది. అలా కొన్న డాలర్లని, దిగుమతుల చెల్లింపుల కోసం ఇవ్వాలి. రూపాయి దేశం, డాలర్ల కోసం, వేల వేల రూపాయల్ని ఖర్చు పెట్టెయ్యవలిసి వస్తుంది. (రూపాయి మారకం విలువ తగ్గిన ఈ సమస్య ఈ దేశంలోనే సరుకుల్ని కొనడానికి వర్తిస్తుందా? దీన్ని ఇక్కడ వివరించలేము.)

ఈ సమస్యకు పరిష్కారం, వీలైనంత వరకూ ప్రతీ దేశమూ, తన దగ్గిరవున్న వనరులతో, కావలిసిన వస్తువుల్ని సొంతంగా తయారు చేసుకోవడమే! తప్పనిసరి వాటికోసం మాత్రమే వేరే దేశాల దిగుమతుల మీద ఆధారపడొచ్చు. కానీ, లాభాల కోసం పోటీపడే పెట్టుబడిదారీ విధానంలో, అది సాధ్యం కాదు. ఎందుకంటే, పెట్టుబడిదారుల మధ్య, 'దేశంలో ఎన్ని సరుకుల్ని అమ్మగలం? విదేశాలకు ఎన్ని సరుకుల్ని అమ్మగలం?' అనే ఒక సమష్టి ప్లానింగు వుండదు. సమష్టి ప్లానింగు వుండని చోట ఎగుమతులూ, దిగుమతులూ సమానంగా వుండవు. అలా వుండనప్పుడు మారకం రేట్లు కూడా స్థిరంగా వుండవు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

సర్కార్ ఎవల్తోని నడుస్తున్నది?

అట్లుంటది


తెలిదేవర భానుమూర్తి

జిద్దు ఇడ్వని విక్రమార్కుడు మోటర్ల బొందలగడ్డ దిక్కు బోయిండు. గాడ బేతాలుని రొండంత్రాల బంగ్ల ముంగట మోటరాపి హారన్ గొట్టిండు. బేతాలుడు ఇవుతలకొచ్చిండు. మోటర్ ఎన్క సీట్ల గూసుండు.

''ఎత్తుగడ్డలు, గుంతలు సూడకుంట మోటర్ నడ్పుతనే ఉంటవు. బర్రెలు అడ్డం రావొచ్చు. ఎవడన్న సైడియ్యక పోవచ్చు. ట్రాఫిక్ల ఇర్కపోతే తిక్కలేవొచ్చు. బేచైన్ గాకుంట ఉండెతందుకు రొండు ముచ్చట్లు జెప్త ఇను'' అని అన్నడు.

''నువ్వు జెప్తె ఇనకుంట ఉన్ననా?'' అని విక్రమార్కుడన్నడు.

''మునుగోడు అంటె ఏందో ఎర్కేనా? మును అంటె ముందుగాల, గోడు అంటె గోస. బై ఎలచ్చన్లు వొచ్చె బట్కె సంటర్ మంత్రులు, ముక్యమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు అన్ని పార్టీల లీడర్లు గదిస్తం గిదిస్త మనుకుంట బొంబై తమాస సూబెడ్తున్నా ఇక ముందుగాల గుడ్క జెనం గోస బదలాయించదు.''

''బాగనే ఉన్నది గని ఇంతకు జెనమేమంటున్నరు?''

''గిదొక జాత్ర. అందరితాన పైసల్ దీస్కుంటం. మేం జేసేది జేస్తం. తింటం. తాగుతం. ఇంట్ల పంటం. ఏ పార్టి లీడరొస్తె గా పార్టి కండ్వలు గప్పుకుంటం. ఇదువర దాంక ఏ లీడరేం బీకలేదు. ఇంక నాల్గు నెలలల్ల ఏం బీక్తరు. ఫ్లోరైడ్ నీల్లట్లనే ఉంటయి. తొవ్వలల్ల గుంతలట్లనే ఉంటయి'' అని మునుగోడు జెనమంటున్నరు.

''మునుగోడుల ఎవ్వలెట్ల ప్రచారం జేస్తున్నరు?''

''రూపాయలు ఏర్ల లెక్క బారుతున్నయి. మా పార్టి చోటామోటా లీడర్లు, సర్పంచ్‌లు మమ్ములనే డిమాండ్ జేస్తున్నరు... అవుతల లచ్చల రూపాయిల ఆఫర్ ఉన్నదంటున్నరు. గిట్లయితె ఏం జెయ్యాలెరో అని ఒక కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మొత్తుకుండు.''

''రాహుల్ గాంది బారత్ జోడో అసరు మునుగోడు మీద ఏమన్న ఉంటదా?'' అని విక్రమార్కుడు అడిగిండు.

''గాయిన జోడో అంటె గిల్లు తోడో అన్కుంట కొట్లాడ్తున్నరు. కాంగ్రెస్ల ఏ లీడర్ కా లీడర్ తీస్మార్‌ఖాన్ ననుకుంటడు. మునుగోడుల ప్రచారం జేసెతందుకు నా అసువంటి హోంగార్డుల అవుసరం లేదు. ఎస్పీలే పోతరు. గాయిన మీద నూరు కేసులు పెట్టినా వొచ్చే అసెంబ్లీ ఎలచ్చన్ల గెలిపిచ్చి కాంగ్రెస్‌ను హుకూమత్లకు దెస్తనని ఒక పెద్దమన్సి అన్నడు. గాయిననే మునుగోడుల కాంగ్రెస్‌ను గెలిపిస్తడని గా పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డిని బనాయించిండు.''



''బీజేపీ, టీఆర్ఎస్ల సంగతేంది?''

''బీజేపీ దిక్కుకెల్లి నిలబడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రొండెక్రాలల్ల క్యాంప్ ఆఫీస్ బెట్టిండు. దినాం మటన్, చికెన్ తోని వెయ్యిమందిక్కి దావత్ ఇయ్యబట్టిండు. ప్రచారం జేస్కుంట అవ్వా నీ ఓటు నాకే ఎయ్యాలె అని గాయిన అన్నడు. తప్పకుంట చెయ్యి గుర్తుకే ఓటేస్త అని గామె అన్నది. చెయ్యి గాదు పువ్వు అన్కుంట రాజగోపాల్ రెడ్డి మొత్తుకుండు.''

''బండి సంజయ్, కేటీఆర్‌ల సంగతేంది?''

''ప్రగతి బవన్ల ఒక మంత్రగానితోని కేసీఆర్ పూజలు జేపిస్తున్నడు అని బండి సంజయ్ అన్నడు. పిచ్చి ముదురుతున్నది, కరుస్తడేమో అని కేటీఆర్ అన్నడు. కావలి కుక్క లెక్క ఉండుమని కుర్సీమీద గూసుండబెడ్తె కచరా కుక్కల్లెక్క, పిచ్చికుక్కల్లెక్క కర్సెతందుకు ఊరిమీద బడ్డరు అని బండి సంజయ్ అన్నడు. పూజాల్ల గీ లీడర్లు మమ్ములను బద్నాం జేస్తున్నరనుకుంట పట్నంల కుక్కలన్ని రాస్తారోకో జేసినయి.''

''చండూరు ర్యాలీ ఎట్లయింది?''

''టీఆర్ఎస్ దిక్కుకెల్లి నిలబడ్డ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నామినేసన్ ఏసినంక చండూరుల మీటింగ్ బెట్టింద్రు. కేటీఆర్ పక్కపంటే మైకు బట్కోని, నామినేషన్ కొచ్చిన నందమూరి తారక రామారావు గారికి, తమ్మినేని సీతారాం గారికి అనుకుంట కూసుకుంట్ల మాట్లాడబట్టిండు. యాల పొద్దుగాలే మందుగొట్టినట్లున్నడు అని కేటీఆర్ గాయినను ఎన్కకు బొమ్మన్నడు. ఒక మంత్రి అయితె మన బీఎస్పి పార్టీ అనబట్టిండు. ఇంతకు టీఆర్ఎస్ లీడర్లు పగటీలనే మందు ఎందుగ్గొడ్తున్నరు. గీ సవాల్‌కు జవాబ్ జెప్పకుంటె నీ మోటర్కు టక్కరైతది'' అని బేతాలుడన్నడు.

''గీ సర్కార్ ముక్యమంత్రితోని నడుస్త లేదు. మంత్రుల తోని నడుస్త లేదు. ఎమ్మెల్యేలతోని నడుస్త లేదు. పోలీసోల్లతోని నడుస్త లేదు. మందుతోని నడుస్తున్నదని గాల్లు పగటీలనే మందుగొట్ట బట్టింద్రు'' అని విక్రమార్కుడు జెప్పంగనే మోటర్ దిగి బేతాలుడు బంగ్ల దిక్కు బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: బ.ఏకాదశి ప.3.09 వరకు, తదుపరి ద్వాదశి **నక్షత్రం:** మఖ ఉ.11.26 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.8.01 నుండి 9.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.07 నుండి 12.55 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.49 నుండి 10.34 వరకు.

సూర్యోదయం : 5.57
సూర్యాస్తమయం: 5.33
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ మీడియా

తర్వాతే దేవుడు



వాల్మీకి సంస్కృతంలో రాసిన మూల రామాయణంలో రాముడు దేవుడు కాదు. గొప్ప రాజు. రెండు వేల సంవత్సరాల తర్వాత తులసీదాస్ అవధిలో రాసిన రామ్‌చరిత్‌మానస్‌లో రాముడు దేవుడయ్యాడు.

– మార్కండేయ ఖట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

అన్నీ మలుపులే



యూకేలో నివసించడమంటే బాలీవుడ్ సినిమాలో జీవించినట్టే. ఎప్పుడూ డ్రామా ఉంటూనే ఉంటుంది. ఏదో ఒకటి జరగకుండా ఏ రోజూ ఉండదు. ఆ లెక్కలో చూస్తే అచ్చం ఇండియాలా కూడా అనిపిస్తుంది.

– నయోమీ క్యాంటన్, లండన్ జర్నలిస్ట్

ప్రధానిగా ఉండను



ఏ విధుల కోసం కన్జర్వేటివ్ పార్టీ నన్ను ఎన్నుకుందో వాటిని నిర్వర్తించలేకపోతున్నానని గుర్తిస్తున్నాను. అందుకే కన్జర్వేటివ్ పార్టీ నాయకురాలిగా రాజీనామా చేస్తున్నానని రాజుగారి దివ్యసముఖానికి తెలియజేస్తున్నా. నా తదుపరి నేత ఎంపికయ్యే వరకు ప్రధానిగా కొనసాగుతాను.

– లిజ్ ట్రస్, బ్రిటన్ ప్రధాని

ఇన్‌బాక్స్

ప్రజా రక్షకులు

సరిహద్దు భద్రతా దళం, ఇండో – టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ వంటి దళాలు ఏర్పడక ముందు... సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) మన దేశ సరిహద్దులను కాపాడుతూ ఉండే రోజులవి. 1959 అక్టోబర్ 21న 'ఆక్సాయిచిన్'లోని భారత్ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులపై చైనా సైనికులు దాడిచేశారు. ఈ ఘటనలో 10 మంది పోలీసులు మరణించారు. ఆ రోజును ప్రతి ఏడాదీ దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుతున్నారు. వివిధ ప్రాంతాల్లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం నింపే రోజు ఇది. మన సైన్యం బాహ్య శత్రు మూకల నుంచి దేశాన్ని కాపాడుతూ ఉంటే... అంతర్గత శత్రువుల నుండి ప్రజలను, ఆస్తులను కాపాడే వారే పోలీసులు. కుటుంబసభ్యులకు దూరంగా ఎన్నోసార్లు విధి నిర్వహించవలసి ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వీరు అందించే సేవలు సదా స్మరణీయం. పోలీసులు కూడా సుఖవంతమైన, సౌకర్యవంతమైన జీవితం గడిపే విధంగా ప్రభుత్వాలు సహకరించాలి. అమరులైనవారి కుటుంబాలను సకాలంలో ఆదుకోవాలి. అదే అమరులైన పోలీసులకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుంది.

– ఐ. ప్రసాదరావు, కాకినాడ
(నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం)

ఆ ప్రతిజ్ఞలే మార్గదర్శకాలు


మల్లెపల్లి లక్ష్మయ్య

అక్టోబర్ అయిదవ తేదీన బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, మిషన్ జై భీం సంస్థల ఆధ్వర్యంలో పదివేల మందికి పైగా న్యూఢిల్లీలోని అంబేడ్కర్ భవన్‌లో బౌద్ధ ధమ్మ దీక్ష స్వీకరించారు. అందులో ధమ్మ దీక్ష సంప్రదాయం ప్రకారం, బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపొందించిన 22 ప్రతిజ్ఞలను పఠించారు. గత 66 ఏళ్లుగా ఎక్కడ బౌద్ధ ధమ్మ దీక్షా సమ్మేళనాలు జరిగినా ఇది సర్వసాధారణంగా జరిగే కార్యక్రమం అయ్యింది. ఇప్పుడు దాన్ని బీజేపీ వివాదాస్పదం చేసి రాజకీయ ప్రయోజనాలను పొందాలనుకుంటోంది.

1950 అక్టోబర్ 14 విజయదశమి నాడు అంబేడ్కర్ నాయకత్వంలో ఐదున్నర లక్షల మంది బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించినప్పుడు... అంబేడ్కర్ రూపొందించిన 22 ప్రతిజ్ఞలను అనుసరిస్తామని అందరూ శపథం చేశారు. అందులో నైతిక సూత్రాలు, నైతిక జీవన విధానంతో పాటు దేవీ దేవతలను పూజించం అనే అంశాలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా, బుద్ధుడు ప్రబోధించిన అష్టాంగ మార్గాన్ని అవలంబిస్తామనే విషయం కూడా ఉంది. అక్టోబర్ 5న జరిగిన బౌద్ధ ధమ్మ దీక్షా స్వీకార ఉత్సవానికి ఢిల్లీ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజేంద్రపాల్ గౌతమ్ కూడా హాజరయ్యారు. ఈ విషయాన్ని ఢిల్లీ భారతీయ జనతాపార్టీ నాయకులు వివాదాస్పదం చేశారు. అక్కడ హిందూ దేవుళ్ళని కించపరిచారనీ, దూషించారనీ, అందులో రాజేంద్ర గౌతమ్ భాగమయ్యారనీ ఆరోపించారు.

రాజేంద్ర గౌతమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని, హిందూ వ్యతిరేక పార్టీగా చిత్రీకరించడానికి చేసిన ప్రయత్నమే ఇది. అందులో భాగంగానే రాజేంద్ర గౌతమ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో గుజరాత్‌లో జరగబోయే ఎన్నికల్లో బీజేపీ ఈ అంశాన్ని ఆప్‌కు వ్యతిరేకంగా వాడుకోవాలని చూస్తున్నదని భావించిన రాజేంద్ర గౌతమ్ తనకు తానుగానే మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే 'ఈ వివాదాన్ని సృష్టించి, ఆప్‌ను ఇరకాటంలో పెట్టాలని బీజేపీ భావించింది. అంతేకాకుండా బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను దోషిగా నిలబెట్టాలనీ చూశారు. పదవి, బాబాసాహెబ్ అంబేడ్కర్ అనేవి రెండు విషయాలు నా ముందున్నప్పుడు అంబేడ్కర్ మహోన్నతాశయం మాత్రమే నాకు కనిపించింది. పదవిని వదులుకున్నాను. భవిష్యత్‌లో మరింత శక్తిమంతంగా అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా గౌతమ బుద్ధుని మార్గంలోనే నడవడానికి నిశ్చయించుకున్నాను' అన్నారు.

అసలు బాబాసాహెబ్ అంబేడ్కర్ కులాన్ని పెంచి పోషిస్తున్న హిందూ మతాన్ని వీడి, సమత, కరుణ, ప్రేమతో నిండిన బౌద్ధాన్ని స్వీకరించడానికి, ఇప్పటికీ ఈ దేశంలోని దళితులు, ఇతర మానవతావాదులు బౌద్ధాన్ని స్వీకరించడానికీ ఎవరు కారకులు? ఏంటి కారణాలు? అనేది ఆలోచించాలి.

అంబేడ్కర్ 1935, అక్టోబర్ 13వ తేదీన పదివేల మంది అణగారిన కులాల పేరుతో పిలవబడే అంటరాని కులాల ప్రజలు పాల్గొన్న సమావేశంలో మాట్లాడుతూ... 'దురదృష్టవశాత్తూ నేను హిందువుగా జన్మించాను. కానీ హిందువుగా మరణించను. అంతిమ నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. హిందూ సమాజంలోని ఆధిపత్యకులాలు పెడుతున్న బాధలు భరించడం ఇంకా అవసరం లేదు. అయితే ఒక మతాన్ని వీడి, మరో మతాన్ని స్వీకరించాలనుకున్నప్పుడు చాలా జాగ్రత్తగా అడుగులు వేయాలి. సమానత్వ హోదా, భద్రత, గౌరవప్రదమైన జీవితం లభించగలిగే ధర్మంలోకి వెళ్ళాలి' అన్నారు. అదే సందర్భంలో అప్పటికే ఐదేళ్లుగా సాగుతున్న నాసిక్‌లోని కాలారామ్ దేవాలయ ప్రవేశ ఉద్యమాన్ని అంబేడ్కర్ ప్రస్తావించారు. ఏ మతంలోని దేవాలయాలలోకి మనకు ప్రవేశం లేదో, ఆ మతంలో ఉండాల్సిన అవసరం ఉందా అని బహిరంగంగా ప్రశ్నించారు.

అంతేకాకుండా, 1922 మార్చి 20వ తేదీన మహద్‌లోని చౌదర్ చెరువు నీళ్ళను తాగడానికి సాగించిన సత్యాగ్రహం, ఆ సందర్భంగా మహర్‌లపై జరిగిన దాడి ఆయన మనస్సులో బలంగా నాటుకుపోయింది. మహద్ చెరువులోని నీళ్ల తాగడానికి అందరికీ హక్కు ఉన్నదని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు

కొత్త కోణం



ఇచ్చినప్పటికీ ఆధిపత్య కులాలు ఆనాటి మహర్‌లను చాలా క్రూరంగా కొట్టి, గాయపరిచారు. ఈ ఘటనలు కూడా అంబేడ్కర్‌ను పెద్దగా బాధించలేదు.

కానీ ఆయన 1919 నుంచి 1932 వరకు దాదాపు 13 ఏళ్లపాటూ పోరాడిన ఫలితంగా ప్రకటించిన 'కమ్యూనల్ అవార్డు' వల్ల సాధించిన ప్రత్యేక ఎన్నికల హక్కుని వదులుకోవలసి వచ్చినప్పుడు ఎంతో క్షోభ అనుభవించారు. 1932 ఆగస్టు 16వ తేదీన ఆనాటి బ్రిటిష్ ప్రధాన మంత్రి రామ్సె మెక్‌డొనాల్డ్ కమ్యూనల్ అవార్డును ప్రకటిస్తే, పూనాలోని ఎరవాడ జైలులో ఉన్న మహాత్మాగాంధీ దానిని వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌తో ఆమరణ దీక్షకు పూనుకున్నారు. 'ఇది హిందువులను విభజించడమే' అనే వాదనను గాంధీజీ ముందుకు తీసుకొచ్చారు. అణగారిన వర్గాల ప్రత్యేక ఎన్నికల విధానాన్ని అంగీకరించనని మొండి కేశారు. దీనిని అంబేడ్కర్ తీవ్రంగా ప్రతిఘటించారు. చివరకు హిందూ సంస్థలు, సంఘాలు అంబేడ్కర్ మీద ఒత్తిడి తీసుకొచ్చాయి. గాంధీజీ ప్రాణానికి ఏమైనా జరిగితే, అణగారిన కులాల భద్రత ప్రమాదంలో పడగలదని భావించిన అంబేడ్కర్ 1932, సెప్టెంబర్ 24వ తేదీన 'పూనా ఒడంబడిక'కు ఒప్పుకున్నారు. దానివల్ల దళితులు తమ ప్రతినిధులను తాము మాత్రమే ఎన్నుకునే హక్కును కోల్పోయారు. ఈ రోజు మనం చూస్తున్న రిజర్వుడు సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది.

ఈ సంఘటన అంబేడ్కర్‌ను తీవ్రంగా కదిలించింది. ఆలోచింప జేసింది. ఫలితంగా కుల నిర్మూలన ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అంటరానివారెవరు, శూద్రులెవరు వంటి అంశాలతో పాటూ ఇంకా హిందూ మతంపైన అనేక రకాలైన అధ్యయనాలూ, బౌద్ధంపైన పరిశోధనలూ చేశారు. 1956 అక్టోబర్ 14వ తేదీన బౌద్ధాన్ని స్వీకరించారు. ఇప్పుడు చెప్పండి... బాబాసాహెబ్ అంబేడ్కర్ హిందూ మతం మీదగానీ, కుల వ్యవస్థ మీదగానీ పోరాటాన్ని తీవ్రంగా పదునెక్కించడానికి ఆనాటి హిందూ పెద్దలు, ప్రత్యేకించి గాంధీ లాంటి వాళ్ళు కారణం కాదా? ఈ నేపథ్యాన్ని అర్థం చేసుకుంటేనే అంబేడ్కరిస్టుల పోకడలు అర్థం అవుతాయి.

రకరకాల కారణాలతో గత 75 సంవత్సరాల్లో 30 వేల మంది దళితులను పొట్టనపెట్టుకున్నారు. 50,000 మందికి పైగా దళిత మహిళలు అత్యాచారాలకు, హత్యలకు గురయ్యారు. ఇప్పటికైనా హిందూ మత పెద్దలు తమ మతాన్ని సంస్కరించుకోకపోతే దళితులకు, కుల అణచివేతకు గురవుతున్న ఇతర బలహీన వర్గాలకు అంబేడ్కర్ 22 ప్రతిజ్ఞలు మాత్రమే మార్గం అవుతాయనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు
మొబైల్: 81063 22077

బంగాళాఖాతంలో అల్పపీడనం

- రేపు వాయుగుండంగా మార్పు
- 24న తుపానుగా బలపడే అవకాశం
- ఆపై పశ్చిమ బెంగాల్ వైపు పయనం
- రాష్ట్రంలో తేలికపాటి వానలే



సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో గురువారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ శనివారానికి వాయుగుండంగా, 23వ తేదీకి తీవ్ర వాయుగుండంగా మారనుంది. ఆపై ఉత్తరం వైపుగా దిశ మార్చుకుని తూర్పు మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో 24న తుపానుగా బలపడనుంది. అనంతరం ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ ఒడిశా తీరాన్ని దాటి 25వ తేదీ నాటికి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరానికి చేరుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గురువారం రాత్రి ఒక బులెటిన్‌లో వెల్లడించింది. ఈ తుపాను ప్రభావం రాష్ట్రంపై ఉండదని, రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రం కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, అక్కడక్కడ పిడుగులు సంభవించవచ్చని వివరించింది. రాబోయే రెండు రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తర బంగాళాఖాతంలోని మిగిలిన భాగాలు, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు, ఏపీ, యానాం నుంచి నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు పరిస్థితులు అనుకూలంగా మారే అవకాశం ఉన్నట్టు తెలిపింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నర్సీపట్నం (అనకాపల్లి)లో 4.9 సెంటీమీటర్లు, జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు)లో 2.8, ముండ్లమూరు (ప్రకాశం)లో 2.8, ఆళ్లగడ్డ (నంద్యాల)లో 2.6, తొండూరు (వైఎస్సార్)లో 2.6, ఆస్పరి (కర్నూలు)లో 2.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సత్తా చాటిన టైగర్ ట్రయాంఫ్

హిందూ మహాసముద్ర భద్రతపై పట్టు బిగించేలా భారత్, యూఎస్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: అగ్రరాజ్యం అమెరికాతో కలిసి భారత త్రివిధ దళాలు విశాఖ వేదికగా మరోసారి వ్యూహాత్మక, విపత్తు నిర్వహణ విన్యాసాల్లో సత్తా చాటాయి. ఇండో పసిఫిక్ తీరంలో పట్టుబిగించేలా భారత్, యూఎస్ బంధం మరింత బలోపేతమయ్యేలా మూడు రోజులపాటు టైగర్ ట్రయాంఫ్ విన్యాసాలు జరిగాయి. రెండు దేశాల మధ్య భద్రతా పరమైన అంశాల్లో పరస్పర సహకారం, విపత్తు సమయాల్లో ఒకరికొకరు సాయం చేసుకునేందుకు అవసరమైన విధానాలు మొదలైన అంశాలను బలోపేతం చేసుకునేలా విన్యాసాలు నిర్వహించారు. అగ్రరాజ్యంతో కలసి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ త్రివిధ దళాల విన్యాసాలకు 'టైగర్ ట్రయాంఫ్' (పులి విజయం) అని పేరు పెట్టారు. మొదటిసారిగా 2019 నవంబర్‌లో విశాఖలోనే టైగర్ ట్రయాంఫ్ విన్యాసాలు జరిగాయి. ఈ విన్యాసాల్లో అమెరికాకు చెందిన 500 మంది మెరైన్స్, సెయిలర్స్, ఎయిర్‌మెన్‌లు, భారత్‌కు చెందిన ఆర్మీ, సెయిలర్స్, ఎయిర్‌మెన్‌లు పాల్గొన్నారు.

'భారత్ కీలక భాగస్వామి'

మూడో రోజైన గురువారం నిర్వహించిన విన్యాసాల సందర్భంగా యూఎస్ ఇండో–పసిఫిక్ కమాండ్ స్ట్రాటజిక్ ప్లానింగ్, పాలసీ డైరెక్టర్ మేజర్ జనరల్ మెక్‌ఫిలిప్స్ మాట్లాడుతూ.. దక్షిణాసియా, హిందూ మహాసముద్ర ప్రాంతంతో స్థిరత్వం, భద్రత వ్యవస్థను పటిష్టం చేసేందుకు భారత్ ఓ కీలక భాగస్వామిగా అభివర్ణించారు. ఈ ప్రాంతంలో విపత్తు సహాయంతో పాటు కంట్రోల్ మోడల్‌ను అభివృద్ధి చేస్తూ.. పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడం, ద్వైపాక్షిక ఒప్పందాలను పూర్తిస్థాయిలో అమలు చేసే విషయంలో మరింత ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ 'ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భద్రతను బలోపేతం చేసేందుకు యూఎస్, భారత్ కలసి పనిచేస్తున్నాయని ప్రపంచానికి తెలియజేసేందుకు టైగర్ ట్రయాంఫ్ సరైన ఉదాహరణ అన్నారు. ఈ సందర్భంగా ఇరుదేశాల నౌకాదళం, ఆర్మీ అధికారుల మధ్య పలు అంశాలపై చర్చలు జరిగాయి. ఈ విన్యాసాల్లో ఈఎన్‌సీ సీఎస్‌వో రియర్ అడ్మిరల్ మనీష్ శర్మ పాల్గొన్నారు.

ఏది న్యాయం.. ఎవరిది ధర్మం?

మంచికి, మోసానికి మధ్య జరుగుతున్న యుద్ధమిది





కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరిగిన సీఎం వైఎస్ జగన్ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

ఆయన గారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఇలా నాలుగేళ్లో, ఐదేళ్లో కాపురం చేసి.. ఎంతో కొంత డబ్బులిచ్చి విడాకులు ఇచ్చేసి.. మళ్లీ పెళ్లి చేసుకోవడం మొదలు పెడితే.. అలా మూడు, నాలుగు పెళ్లిళ్లు చేసుకుంటూ పోతే వ్యవస్థ పరిస్థితి ఏంటి? ఆడవాళ్ల మాన ప్రాణాలు ఏం కావాలి? అక్క చెల్లెమ్మల జీవితాలు ఏం కావాలి? ఇలాంటి నాయకులు మనకు అవసరమా.. ఆలోచించండి.

ఎవరికీ మంచి చేసిన చరిత్ర లేని వారు, వెన్నుపోటు దారులు ఎన్నికల సమయంలో రంగు రంగుల మేనిఫెస్టోలు ఇస్తారు. వాగ్దానాలు చేస్తారు. ఎన్నికల తర్వాత వాటిని చెత్తబుట్టలో వేస్తారు. మళ్లీ ప్రజలు ప్రశ్నిస్తారేమోనని కనీసం వెబ్‌సైట్లలో కూడా కనిపించకుండా చేస్తారు. ఇలాంటి వారంతా దుష్టచతుష్టయంగా ఏర్పడ్డారు. మీ బిడ్డ మీద.. మన ప్రభుత్వం మీద.. మీ ప్రభుత్వం మీద యుద్ధం చేస్తారట? ఒక్క జగన్‌ను కొట్టడానికి ఇంతమంది ఏకం అవుతుండటం ఆశ్చర్యం వేస్తోంది.

సాక్షి ప్రతినిధి, విజయవాడ:

'ప్రజలకు మనం మంచి చేస్తుండటాన్ని జీర్ణించుకోలేని ఆ పెద్ద మనిషి (చంద్రబాబు).. తన దత్తపుత్రుడి (పవన్ కళ్యాణ్)తో ఎలా తిట్టించారో అందరం చూశాం. మనం మూడు రాజధానుల వల్ల రాష్ట్రానికి మేలు జరుగుతుందని మాట్లాడుతుంటే, కాదు కాదు.. మూడు పెళ్లిళ్లు చేసుకోవచ్చంటూ ఆయన గారు సెలవివ్వడమూ విన్నాం. మంచికి, మోసానికి మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో ముసు ముందు మరెన్నో కుట్రలు కనిపిస్తాయి. వాటిన్నింటినీ తిప్పికొట్టి.. ఏది న్యాయం, ఎవరిది ధర్మమో ఆలోచించండి. న్యాయం, ధర్మం వైపు నిలబడండి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన 22(ఏ)1 నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ, కృష్ణా జిల్లా అవనిగడ్డలో రైతులకు భూ హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనందరి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి ఎంతో మేలు చేస్తుంటే దుష్టచతుష్టయం ఓర్వలేక దిగజారుడు రాజకీయాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

గ్రామం రూపు రేఖలు మారుస్తున్న ప్రభుత్వమిది..

- మీ గ్రామంలో మీ కళ్ల ఎదుటే కనిపిస్తున్న మార్పులను గమనించండి. గ్రామ సచివాలయాలు, అందులో 10 మంది ఉద్యోగులైన మన పిల్లలు మనకు సేవలు అందిస్తూ.. ఉత్సాహంగా చిరునవ్వుతో కనిపిస్తారు. ప్రతి 50 ఇళ్లకూ వలంటీర్ కనిపిస్తున్నారు. ప్రతి అడుగులోనూ మనకు మంచి చేస్తూ చేదోడు, వాదోడుగా ఉన్నాడు.
- వివక్ష చూపకుండా, లంచాలు అడగకుండా 1వ తారీఖునే సూర్యోదయం అయిన వెంటనే, అది ఆదివారమైనా, పండుగ అయినా ఇంటికి వచ్చి గుడ్‌మార్నింగ్ చెప్పి పెన్షన్ డబ్బు చేతిలో పెట్టి వెళ్తాడు.
- అదే గ్రామంలో విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ రైతులను చేయి పట్టుకుని నడిపించే ఆర్బీకే వ్యవస్థ కనిపిస్తోంది. మన కళ్లెదుటనే పారదర్శకంగా ఈ–క్రాప్ జరుగుతోంది. విత్తనాలు, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ కల్తీ లేకుండా అందిస్తున్నారు. పంట కొనుగోలు విషయంలో అండగా నిలుస్తున్నారు.
- మరో నాలుగు అడుగులు ముందుకేస్తే విలేజ్ క్లినిక్ కనిపిస్తుంది. అక్కడ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మిడ్ లెవల్ హెల్త్ ప్రాక్టీషనర్ అక్కడే ఉంటూ 24 గంటలూ అందుబాటులో ఉంటూ 67 రకాల మందులిస్తూ.. 14 రకాల డయాగ్నొస్టిక్ టెస్టులు చేస్తూ.. ఆరోగ్యశ్రీకి రిఫరెల్ పాయింట్‌గా పని చేస్తున్నారు.
- ఈ నెలలోనే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నాం. అదే గ్రామంలో నాలుగు అడుగులు వేస్తే ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు కనిపిస్తాయి. నాడు–నేడుతో స్కూళ్ల రూపు రేఖలను మార్చాం. డిజిటల్ లైబ్రరీలు కూడా కట్టబోతున్నాం. మన గ్రామాలలో మన పిల్లల కోసం వర్క్ ఫ్రం హోం కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. మన కళ్ల ఎదుటే గ్రామాల రూపు రేఖలు మారుతున్నాయి.
- కాబట్టే మనందరి ప్రభుత్వం తరఫున మన ఎమ్మెల్యేలు ప్రతి నియోజకవర్గంలో మీ ఇంటికి ఈ మేలు చేశామని, సవినయంగా చెప్పుకుంటూ గడపగడపకూ కార్యక్రమాన్ని చేస్తున్నారు. ప్రతి అక్క, చెల్లెమ్మ ఆశీర్వాదం తీసుకుంటున్నారు. ఇదే సమయంలో చెప్పుకోవడానికి ఏమీ లేనివాళ్లంతా, గతంలో ప్రజలకు ఏ మేలూ చేయని వారంతా ఈ రోజు ఏం చేస్తున్నారో గమనించండి.

అవనిగడ్డకు వరాల జల్లు..

- అవనిగడ్డకు సంబంధించి కొన్ని మంచి కార్యక్రమాలకు సహాయ సహకారాలు కావాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ అడిగారు. అవనిగడ్డ–కోడూరు ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.35 కోట్లు మంజూరు చేస్తున్నా. కృష్ణానది కుడి, ఎడమ కరకట్ట.. సముద్రపు కరకట్టను పటిష్టం చేయడానికి రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నా. పాత ఎడ్లలంక రహదారి వంతెన ఏర్పాటుకు రూ.8.50 కోట్లు మంజూరు చేస్తున్నా. అవనిగడ్డలో కంపోస్ట్ యార్డు తరలించడానికి రూ.5–10 కోట్లు.. సీసీ డ్రైన్ల ఏర్పాటుకు రూ.10–15 కోట్లు మంజూరు చేస్తున్నా. అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని మంజూరు చేస్తాం.



వీధి రౌడీలను మించి బూతులు

- వాళ్లు చేసిన మంచేమిటో చెప్పుకోలేరు. ఈ రోజు వాళ్లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. అందుకే బూతులు తిట్టడంలో వీధి రౌడీలను మించిపోయారు. నాయకులుగా చెప్పుకుంటున్న వారు చెప్పులు చూపిస్తూ దారుణమైన బూతులు మాట్లాడుతున్నారు. ఇలాంటి వారు మన నాయకులా?
- అవ్వాతాతల గురించి, అక్క చెల్లెమ్మల గురించి, ప్రతి కుటుంబంలో ఉన్న ఆడ బిడ్డల గురించి మనం ఆలోచిస్తుంటే.. దత్తపుత్రుడితో, దత్త తండ్రి ఏమేమి మాట్లాడిస్తున్నాడో అందరం చూస్తున్నాం.
- ఎవ్వరికీ, ఏ ప్రాంతానికీ అన్యాయం చేయకుండా 3 రాజధానుల వల్ల అందరికీ మేలు జరుగుతుందని మనం చెబుతుంటే.. కాదు, మూడు పెళ్లిళ్ల వల్లే మేలు జరుగుతుంది.. మీరూ చేసుకోండి.. అని చెప్పుకుంటున్న వారి గురించి ఆలోచించండి. అలాగైతే రేపు మన ఇంట్లో ఆడవాళ్ల పరిస్థితి ఏంటి? మన కూతుళ్ల పరిస్థితి ఏంటి? మన చెల్లెమ్మల పరిస్థితి ఏంటి?
- వివక్ష, లంచాలు లేకుండా నేరుగా 87 శాతం ప్రజలకు మేలు చేసిన మన ప్రభుత్వానికి, ప్రజలకు ఏనాడూ మేలు చేయని పచ్చ రంగు పెత్తందారుల మధ్య పోరాటం జరుగుతోంది. మరో 18–19 నెలల పాటు రోజూ ఇలాంటివన్నీ కనిపిస్తాయి. ఆ దుష్టచతుష్టయం మోసాలను నమ్మొద్దు. ఆ పేపర్లను చదవొద్దు. ఆ టీవీలను చూడొద్దు.

- ఈ సమావేశంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, జోగి రమేష్, ఆర్కే రోజా, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారధి, పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ, కై లే అనిల్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, కల్పలతారెడ్డి, ఎండీ రుహుల్లా, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పవన్.. ఆ చెప్పు దాచిపెట్టుకో!

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలిచ్చే తీర్పును చూసి నిన్ను నీవు కొట్టుకోవడానికి, నిన్ను పోషిస్తున్న చంద్రబాబును కొట్టడానికి నీవు చూపించిన చెప్పును దాచిపెట్టుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని పవన్‌కళ్యాణ్‌కు హితవు పలికారు. ఎన్టీఆర్ జిల్లా గుడివాడ 32వ వార్డులో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబునాయుడి దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ అన్న సంగతి తాను ఎప్పుడో చెప్పానన్నారు. ఇప్పుడు ముసుగు వీడిందని.. ప్రజలు కూడా ఈ విషయాన్ని ఎప్పుడో గమనించారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష మేరకు విశాఖ పాలనా రాజధాని కావాలని స్థానికులు, జేఏసీ ఆధ్వర్యంలో అక్కడ గర్జన కార్యక్రమం నిర్వహిస్తుంటే దానిని పక్కదారి పట్టించేందుకే పవన్‌కళ్యాణ్, చంద్రబాబు కలిసి జనవాణి పేరుతో విశాఖపట్నంలో రగడకు కుట్రపన్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలను తిట్టినందుకా పవన్‌కు బాబు పరామర్శ

ఇక విమానాశ్రయంలో స్వాగతం పలకడానికి ఉండే అవుట్ గేట్ వదిలి పవన్‌కళ్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు ఇన్‌గేటు వద్దకు చేరుకున్నారని.. ఈ సమయంలో 'విశాఖ గర్జన' ముగించుకుని విమానాశ్రయానికి వస్తున్న మంత్రులు రోజా, విడదల రజిని, జోగి రమేష్, మేరుగు నాగార్జున తదితర మంత్రులతోపాటు ఎమ్మెల్యేల వాహనాలపై జెండా కర్రలు, కార్ల వీల్ డిస్క్‌లతో దాడికి పాల్పడ్డారని కొడాలి నాని గుర్తు చేశారు. మరోవైపు.. విమానాశ్రయం నుండి బయటకొచ్చిన పవన్‌కళ్యాణ్ అనుమతిలేకపోయినా ప్రధాన రహదారుల్లో ఐదు గంటలపాటు ఊరేగడం అతని శాడిజానికి నిదర్శనమన్నారు. ఇలా విశాఖ ప్రజలను ఇబ్బందులకు గురిచేసి వైసీపీ నేతలను నోటికొచ్చినట్లు తిట్టినందుకా పవన్‌ను చంద్రబాబు పరామర్శించారని ఆయన ప్రశ్నించారు. వీరి తాజా కలయికతో ప్రజలు వారి మధ్య ఉన్న బంధాన్ని పూర్తిగా అర్థంచేసుకున్నారన్నారు. ఇక దేశంలో ఎన్నికల్లో పోటీచెయ్యని పార్టీ ఏదైనా ఉందా అంటే అది జనసేనేనన్నారు. ఇది కేవలం ప్యాకేజీ కోసం, చంద్రబాబు కోసం పెట్టిన పార్టీ అని స్పష్టంచేశారు.

నేటి నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

సాక్షి అమరావతి: బీఈడీ కోర్సులలో చేరికకు ఏపీ ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. అక్టోబర్ 22 నుంచి 27 వరకు రిజిస్ట్రేషన్లు, 26 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, నవంబర్ 1 నుంచి 3 వరకు వెబ్ ఆప్షన్లు, నవంబర్ 5 నుంచి సీట్ల కేటాయింపు, నవంబర్ 7 నుంచి 9 వరకు కాలేజీల్లో చేరిక, నవంబర్ 7 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

కృష్ణాజిల్లా అవనిగడ్డ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అత్యాధునిక సర్వే ద్వారా 22ఏ-1 భూముల సమస్య కొలిక్కి

22 వేల మంది రైతులకు హక్కు పత్రాల జారీకి శ్రీకారం

- సర్వేలో విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు, రోవర్ల వినియోగం
- గత చంద్రబాబు సర్కారు నిర్వాకంతోనే రైతులకు సమస్యలు
- ఇప్పుడు ఆ తప్పిదాలు సరిచేస్తూ డీ నోటిఫై చేసేందుకు ఆదేశాలు
- అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా నిలిచాం
- మేనిఫెస్టో అంటే ఖురాన్, బైబిల్, భగవద్గీతగా భావిస్తున్నాం
- ఇప్పటికే 98 శాతం హామీలను నెరవేర్చిన ప్రభుత్వమిది



భూ యాజమాన్య హక్కు పొందిన రైతులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా, భూములకు సంబంధించి పక్కాగా సరిహద్దులు, కచ్చితమైన రికార్డులు లేకపోవడం వల్ల రైతులు ఎటువంటి కష్టాలు పడుతున్నారో మనందరికీ తెలుసని, ఇవాళ ఆ సమస్యలన్నింటినీ రీసర్వే ద్వారా పరిష్కరిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామని సీఎం వైఎస్ జగన్ అన్నారు. భూ యాజమాన్య హక్కుల విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల ఎంతో మంది ఇన్నాళ్లు ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరుగుతూ ధర్నాలు, నిరాహార దీక్షలు సైతం చేస్తున్నప్పటికీ సమస్యలు కొలిక్కి రాలేదన్నారు. ఈ సమస్యపై గత పాలకులెవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మనందరి ప్రభుత్వం.. ఈ సమస్యపై దృష్టి సారించి.. పరిష్కార మార్గం చూపుతోందని స్పష్టం చేశారు. గురువారం ఆయన 22ఏ–1 నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ, కృష్ణా జిల్లా అవనిగడ్డలో రైతులకు భూ హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంద సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో భూముల రీ సర్వే చేపట్టి ఒక మహా యజ్ఞంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందు కోసం ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 15 వేల మంది సర్వేయర్లను నియమించామని,

కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. ఆధునిక టెక్నాలజీ.. కోర్స్(కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ సిస్టం) బేస్ సిస్టంను తీసుకొచ్చి.. విమానాలను, హెలికాప్టర్‌లను సైతం ఉపయోగిస్తున్నామని.. డ్రోన్లను, రోవర్లను కొనుగోలు చేసి వాటినీ వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఒక యజ్ఞంలా రీ సర్వే

- సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన పరికరాలను కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసి, ఉపయోగిస్తున్నాం. వంద సంవత్సరాలకు పూర్వం జరిగిన సర్వేకు మళ్లీ రీ సర్వే చేయించి, హద్దులను మళ్లీ పూర్తిగా మార్కు చేసి, రికార్డులు అన్నింటినీ పూర్తిగా అప్‌డేట్ చేయిస్తున్నాం. సబ్‌డివిజన్‌లు, మ్యుటేషన్స్ అన్నీ పక్కాగా చేపట్టి, ఇటువంటి సమస్యలున్న చోట అంటే షరతులు గల పట్టాలు, చుక్కల భూములు, అనాధీనం భూములు ఇటువంటి నిషేధిత జాబితాలో ఉన్న అనేక భూములకు ఒక పరిష్కారం చూపాలని అడుగులు ముందుకు వేస్తున్నాం.
- ఈ కార్యక్రమాన్ని దీక్షగా, ఒక యజ్ఞంలా చేస్తున్నాం. గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా రీసర్వే చేసి భూములు, స్థిరాస్తుల యజమానులకు స్పష్టంగా సరిహద్దులు చూపడంతో పాటు, ఈ మహాయజ్ఞంలో భాగంగా హక్కు పత్రాలను కూడా ఇవ్వబోతున్నాం.

నవంబర్‌లో 1,500 గ్రామాలలో..

- 17 వేల పై చిలుకు గ్రామాలకు గాను, నవంబరు నెలలో 1,500 గ్రామాలలో సర్వే పూర్తి చేసి, హద్దులు రీ మార్క్ చేసి, అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించి అందరికీ భూ హక్కు పత్రాలు ఇచ్చే కార్యక్రమం మొదలు పెడుతున్నాం. ఇవన్నీ పూర్తి చేసి, ఆయా గ్రామాల్లోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండే టట్టుగా అడుగులు వేస్తున్నాం.
- మన గ్రామంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఉంటే మన భూములు వేరే వాళ్ల పేరు మీదకు మార్చి, తిక్క తిక్క చేష్టలు చేస్తే వెంటనే మనకు తెలిసిపోతుంది. అటువంటి వాటిని మనం వెంటనే అడ్డుకోగలుగుతాం. అందువల్ల ఈ కార్యక్రమాన్ని ఒక గొప్ప యజ్ఞంగా భావించాం. నవంబరు నుంచి 1500 గ్రామాలతో మొదలు పెట్టి.. ప్రతి నెలా కొన్ని వందల గ్రామాలను యాడ్ చేసుకుంటూ వెళతాం. వచ్చే ఏడాది (2023) చివరి నాటికి మొత్తం 17 వేల పై చిలుకు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం.
- ఈ దిశలో మరో అడుగే ఈ రోజు మనం తీసుకుంటున్న నిర్ణయం. షరతులుగల పట్టా పేరుతో నిషేధిత జాబితాలో అంటే 22ఏ–1 లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరిస్తూ.. రైతులకు క్లియరెన్స్ పత్రాలను జారీ చేస్తున్నాం.

రైతు మనసు తెలిసిన ప్రభుత్వమిది

- ఇవాళ మన ప్రభుత్వంలో జరిగిన మంచి ఏంటి? గత ప్రభుత్వ హయాంలో జరిగిన చెడు ఏంటి? అన్నది ఆలోచించాలి. గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చింది గతంలో దివంగత నేత వైఎస్సార్ అయితే, ఇవాళ మీ జగనన్న ప్రభుత్వం. అసైన్డ్ గాని, ఆర్వోఎఫ్ఆర్ కానీ, ఆలయ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా రైతు భరోసా ఇస్తున్నది మన అందరి ప్రభుత్వం. అసైన్డ్ భూముల విషయంలో గత ప్రభుత్వం వంచిస్తే.. ఈరోజు మంచి చేసింది మన ప్రభుత్వం.
- గత ప్రభుత్వం రైతుల భూములను ఎలా దోచుకోవాలని ఆలోచిస్తే, అవి రైతులకు ఎలా ఇవ్వాలని ఆరాటపడుతూ, ఆలోచన చేస్తున్నది మన ప్రభుత్వం. మన ప్రభుత్వం రైతు మనసు తెలిసిన ప్రభుత్వం. పేదవాడి బాగోగులు మనసులో పెట్టుకుని అడుగులు వేస్తున్న ప్రభుత్వం. ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలను వివక్ష లేకుండా, అవినీతి లేకుండా అందిస్తున్న ప్రభుత్వం మనది. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను ఖురాన్‌గా, బైబిల్‌గా, భగవద్గీతగా భావించి 98 శాతం హామీలను 3 ఏళ్ల 4 నెలల కాలంలోనే నెరవేర్చిన ప్రభుత్వం మనది.

22 వేల మంది రైతులకు హక్కు పత్రాలు...



- ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 355 గ్రామాలలో 22ఏ–1 నిషేధిత జాబితాలో ఉన్న 18,889 సర్వే నంబర్లకు సంబంధించి మొత్తం 35,669 ఎకరాల భూముల సమస్యకు పరిష్కారం చూపినట్టవుతుంది. దీనివల్ల ఆయా భూముల్లో సాగు చేసుకుంటున్న 22,042 మంది రైతులకు, వారి భూమి మీద వారికి హక్కు కల్పించే కార్యక్రమానికి ఈ రోజు శ్రీకారం చుడుతున్నాం.
- వేలాది మంది రైతులకు ఇబ్బందిగా మారిన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ఇవాళ అడుగులు పడుతున్నాయి. ఇలాంటి వారంతా ఇక రెవెన్యూ ఆఫీసులు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. 22ఏ–1 కింద నిషేధిత భూముల జాబితాలో ఉన్న ఈ భూముల సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తూ.. వాటిని డీనోటిఫై చేసేలా ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చాం.
- ఈ నిర్ణయం వల్ల ఒక్క అవనిగడ్డ నియోజకవర్గంలో మాత్రమే 10,119 మంది రైతన్నలకు 15,791 ఎకరాలకు సంబంధించి ప్రయోజనం కలుగుతోంది. వీరందిరకీ యాజమాన్య హక్కులు అందుతాయి. ఇకపై ఆ రైతులు వాళ్ల భూములు అమ్ముకోవచ్చు. మరొకరు కొనుక్కోవచ్చు. లేదా ఆ రైతన్నలు ఆ భూములను వాళ్ల పిల్లలకు బహుమతిగా కూడా ఇవ్వవచ్చు. వారికి పక్కాగా హక్కు పత్రాలను కూడా ఇచ్చే కార్యక్రమం మొదలవుతుంది.

గత ప్రభుత్వ నిర్వాకం..



దేశంలో భూముల అమ్మకాలు, కొనుగోలు ప్రక్రియ అంతా 1908 రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారమే జరుగుతుంది. నాటి బ్రిటిష్ ప్రభుత్వం హయాంలో 1930 వరకు షరతుగల భూముల పట్టాల పేరుతో వివిధ వర్గాలకు భూ కేటాయింపులు జరిగాయి. వాటిని రకరకాల కేటగిరీ భూములు.. మెట్ట, తరి, సాగులో ఉన్న మెట్ట భూములు, డొంక, వంక, వాగు, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు.. ఇలా అనేక రకాల కేటగిరీల్లో 1932 నుంచి 1934 మధ్యలో రికార్డులన్నీ రీసెటిల్‌మెంట్ బుక్స్‌లో చేర్చారు. పట్టాదారుల భూముల వివరాలను, సర్వే నంబర్లను ఈ పుస్తకాల్లో నమోదు చేశారు. అటువంటి భూములను 1932–34 నుంచి రైతన్నలు వారి తరాలు, వారి పిల్లల తరాలు, తర్వాత వారి మనవళ్ల తరాలు అనుభవిస్తున్నారు. 2016 వరకు రిజిస్ట్రేషన్, టైటిల్ డీడ్స్ ఇలా ఈ భూములకు సంబంధించిన అన్ని లావాదేవీలు కొనసాగాయి. పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వడం వల్ల వారికి పంట రుణాలతో పాటు ఇతర రుణాలు కూడా అందేవి. కానీ 2016 మే నెలలో గత ప్రభుత్వం జిల్లాల వారీగా ఈ భూములు అన్నింటినీ నిషేధిత జాబితా 22–ఎ లో చేర్చుతూ.. రకరకాల జీవోలు జారీ చేసింది. అప్పటి నుంచి రైతన్నలకు ఇబ్బందులు మొదలయ్యాయి. అందుకే ఆ భూములు అన్నింటినీ డీ నోటిఫై చేసి, చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలను రద్దు చేసి, ఆ రైతన్నలకు మేలు చేసే కార్యక్రమం చేస్తున్నాం. వివాదాలన్నింటికీ ముగింపు పలికి.. అనాధీన భూములు, చుక్కల భూములు, ఇనాం భూముల సమస్యలన్నింటికీ గ్రామ స్థాయిలోనే పరిష్కారం చూపిస్తున్నాం. భూముల రిజిస్ట్రేషన్, ల్యాండ్ రికార్డుల నిర్వహణలో దేశానికే ఒక మోడల్‌గా నిలిచేలా రీసర్వే చేపట్టాం.


రైతుల సమస్యలు తెలిసిన మారాజు జగనన్న



మా తాత నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో 30 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నాం. 2017లో మా అమ్మాయి పెళ్లికి లోను తీసుకుందామని బ్యాంకుకు వెళితే రెండు ఎకరాలు నిషేధిత జాబితాలో ఉందని, లోను ఇవ్వం అని చెప్పారు. తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయంతో మా లాంటి రైతుల జీవితాల్లో వెలుగులు వచ్చాయి. నిజంగా ఈ రోజు మా రైతులందరికీ పండుగ రోజు.

– కొండవీటి వీర వెంకట నారాయణ, విశ్వనాథపల్లి, కోడూరు మండలం

జగనన్న రుణం తీర్చుకుంటాం



తండ్రి వారసత్వంగా నాకు వచ్చిన ఐదు ఎకరాలు నిషేధిత జాబితాలోకి వెళ్లింది. పిల్లలను చదివించుకునేందుకు లోను కావాలని బ్యాంకుల చుట్టూ తిరిగితే ఇవ్వం అని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలని గతంలో ధర్నాలు, నిరాహార దీక్షలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో భూ సమస్య తొలగిపోయింది.

– రేపల్లె రాజయ్య, వి.కొత్తపాలెం, కోడూరు మండలం

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము

జిల్లా కలెక్టరు వారి కార్యాలయము

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు.

ఆర్సీ. జి4 .1589/2019 తేది:19.10.2022

ఫారం నెం.-VI(ఎ)

(2013 వ సంవత్సరము.30వ చట్టము వలన భూసేకరణ, పునరవాసం,పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టములో సెక్షన్ 11(1)మరియు ఆంధ్ర ప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19,సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువన ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములకు ప్రజాప్రయోజనమై అనగా ఆత్మకూరు మండలము అప్పారావుపాలెం మజరా బట్టేపాడు రెవిన్యూ గ్రామ పరిధిలో కి.మి. 249.900 నుండి 253.00 వరకు నందు నూతనముగా నిర్మించు నడికుడి – శ్రీ కాళహస్తి కొత్త బ్రాడ్ గేజ్ రైల్వేలైను నిర్మాణము కొరకు భూమి కావలియునని రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజరు (కన్‌స్ట్రక్షన్) వరల్డ్ క్లాస్ స్టేషన్ ప్రాజెక్ట్, సికింద్రాబాదు వారు కోరినందున 2013వ సంవత్సరము, 30వ చట్టము వలన భూ సేకరణ, పునరవాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టములో సెక్షన్ 11(1)వ నిబంధనలనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబములు ఏమియూ లేవు. జిల్లా కలెక్టర్, నెల్లూరు వారు పైన పేర్కొనిన చట్టములోని సెక్షన్ 12 క్రింద ఇవ్వబడిన అధికారములు వినియోగించి రెవిన్యు డివిజనల్ అధికారి, ఆత్మకూరు వారికీ వారి సిబ్బంది మరియు పనివారలకు ఆ భూములు భూ సేకరణ పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది. పై చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి ఏ విధమైన అమ్మకము / కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు కలెక్టరు గారి అనుమతి లేనిదే జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టములోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు వున్నఎడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించిన తేది నుండి 60 (అరువది) దినములలోగా శ్రీయుత జిల్లా కలెక్టరు నెల్లూరు / రెవిన్యూ డివిజనల్ అధికారి, ఆత్మకూరు వారి ఎదుట దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు మండలము: ఆత్మకూరు గ్రామము: అప్పారావు పాలెం మజరా బట్టేపాడు

క్రమ సంఖ్య	సర్వే నెం.	పూర్తి విస్తీర్ణం	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామి పేరు మరియు తండ్రి/ భర్త పేరు	సరిహద్దులు				చెట్లు మరియు కట్టడములు వివరములు
					ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1	24-2	1.56	0.81	పెమ్మసాని హజరత్తయ్య తండ్రి బద్రయ్య మరియు ఇతరులు	24-2	25	24-1	26-2	మామిడి, కొబ్బరి, తాటి, చింత, సీతాఫలం, దానిమ్మ, పనస, టేకు, వేప, అరటి, మునగ, దీమచింత, సపోటా, జూరగ, పైపు లైన్
2	24-1	1.06	0.07	పయ్యావుల ఆదెమ్మ భర్త వెంకట రత్నం మరియు ఇంకొకరు	24-2	1066	24-1	26-2	సాగు భూమి
3	26-2	0.09	0.03	చంద్రా దామోదర్ తండ్రి కోటయ్య	324	25	26-1	332/1	బీడు
4	26-1	1.87	1.54	పయ్యావుల ఆదెమ్మ భర్త వెంకట రత్నం మరియు ఇంకొకరు	324	25	24,27	332/1	మామిడి, చింత, టెంకాయ, ఉసిరి, టేకు, సపోటా, పామాయిల్, సీతాఫలం, దీమచింత, పనస, మునగ, సవక, అరటి, ఎదురు, జూరగ, బోరు
5	27-1	1.33	0.14	చంద్రా దామోదర్ తండ్రి కోటయ్య మరియు ఇతరులు	27-2	27-1	27-1	26	మామిడి
6	27-2	1.06	0.05	చంద్రా కృష్ణయ్య తండ్రి కోటయ్య మరియు ఇతరులు	324,28	27-1	26-2	27-2	మామిడి
7	69-3	2.11	0.31	కిలారి ఉమామహేశ్వర రావు తండ్రి బలరామయ్య మరియు ఇతరులు	70	204	69-3	121	సాగుభూమి
8	70-3	1.06	0.43	చంద్రాకోటేశ్వరరావు తండ్రి రాగయ్య మరియు ఇతరులు	70-1	69	121	70-1	సాగుభూమి
9	82-1	4.59	0.89	రావిళ్ళ రమణయ్య తండ్రి వెంకట రమణయ్య మరియు ఇతరులు	83	70	82-1	120, 119	సాగుభూమి
10	83-2	4.82	0.72	రావిళ్ళ మోహన్ రావు తండ్రి సుబ్బరాయుడు మరియు ఇతరులు	84	82	83-2	119, 118	సాగుభూమి
11	84-1B	5.10	1.73	పయ్యావుల ప్రభాకర్ తండ్రి శివరామయ్య మరియు ఇతరులు	85	84-1A	116, 118	84-1B	సాగుభూమి
12	84-1A	1.93	1.62	పెమ్మసాని రమణయ్య తండ్రి కృష్ణయ్య	84-1B	83	118	84-1B	నల్ల తుమ్మ, తాటి, వేప
13	85	5.65	2.07	పయ్యావుల ప్రభాకర్ తండ్రి శివరామయ్య మరియు ఇతరులు	86	86	86	115	సాగుభూమి
14	86-1	2.67	0.79	గంటా లక్ష్మీ దేవమ్మ భర్త చిన చెన్నయ్య మరియు ఇతరులు	112	85	86	86-1	సాగుభూమి
15	86-2	1.83	0.70	ఏలూరు వెంకట రత్నం తండ్రి వెంకట రామానాయుడు మరియు ఇతరులు	86-1	85	86-2	86-1	సాగుభూమి
16	110-1	2.72	0.47	ఈగ లక్ష్మీ రెడ్డి తండ్రి యల్లా రెడ్డి	111	112	110-1	112	సాగుభూమి
17	112	15.21	4.61	రాటకొండ కాంతమ్మ భర్త వెంకటేశ్వర్లు మరియు ఇతరులు	112	86	110	112	తాటి, వేప
18	118	2.95	0.04	రావిళ్ళ రమణయ్య తండ్రి వెంకటసుబ్బయ్య	118	119	84	118	సాగుభూమి
19	119-2	2.57	0.31	కన్నెదారి లక్ష్మీకాంతమ్మ భర్త బలరామయ్య మరియు ఇతరులు	118	120	83,82	119-2	వేప
20	120	3.24	0.17	కిలారి చిన సుబ్బయ్య మరియు ఇతరులు	119	121	82,70	120	సాగుభూమి
21	121-1	0.51	0.23	గంగినేని రాగమ్మ భర్త లేట్ వెంకటేశ్వర్లు	120	121-2	70	121-1	సాగుభూమి
22	121-2	0.47	0.32	గంగినేని రాగమ్మ భర్త లేట్ వెంకటేశ్వర్లు	121-1	121-3	70	121-2	సాగుభూమి
23	121-3	1.04	0.45	కిలారి వెంకట రామయ్య తండ్రి బాల రామయ్య	121-2	121-3	69	121-3	సాగుభూమి
24	121-4	2.37	0.31	కిలారి వెంకట రామయ్య తండ్రి బాల రామయ్య	121-3	204	69	121-4	సాగుభూమి
25	204	2.31	0.32	కిలారి ఉమామహేశ్వర రావు తండ్రి బాల రామయ్య మరియు ఇతరులు	121	121	121	121	సాగుభూమి
26	207	2.51	0.38	అదుసుమల్లి ప్రమీలమ్మ భర్త లక్ష్మయ్య మరియు ఇంకొకరు	208	260	207	213	సాగుభూమి
27	208-2	1.49	0.71	చంద్రా సుగుణమ్మ భర్త శ్రీనివాసులు మరియు ఇంకొకరు	209	209-2	209-2	212	సాగుభూమి
28	208-1	1.15	0.63	చంద్రా సుశీలమ్మ భర్త సారంగపాణి	28-2	28-1	28-2	212	సాగుభూమి
29	209	5.48	1.47	అదుసుమల్లి కోటేశ్వరరావు తండ్రి కోటయ్య మరియు ఇంకొకరు	204	209	209	209	సాగుభూమి
30	212	1.78	0.03	చంద్రా హజరత్తయ్య తండ్రి లేట్ శ్రీనివాసులు మరియు ఇతరులు	209	208	208	212	సాగుభూమి
31	213	4.06	0.60	అదుసుమల్లి ప్రమీలమ్మ భర్త లక్ష్మయ్య మరియు ఇతరులు	213	260	213	213	సాగుభూమి
32	261	3.04	0.68	సొంపల్లి శివరామయ్య తండ్రి పెంచలయ్య మరియు ఇతరులు	260	262	261	261	సాగుభూమి
33	262-1	2.18	0.61	సొంపల్లి వేణుగోపాల్ తండ్రి పెంచలయ్య మరియు ఇతరులు	261	262	262	262	సాగుభూమి
34	262-2	0.80	0.20	సొంపల్లి శివరామయ్య తండ్రి పెంచలయ్య మరియు ఇంకొకరు	261	262	262-2	262-1	సాగుభూమి
35	263-2	0.95	0.37	సొంపల్లి వేణుగోపాల్ తండ్రి పెంచలయ్య	262	264	263-3	263-2	సాగుభూమి
36	263-3	0.59	0.48	రాటకొండ సుబ్బరాయుడు తండ్రి వెంకటయ్య	262	264	263/3	263/2	సాగుభూమి
37	265-1	0.94	0.38	సొంపల్లి వేణుగోపాల్ తండ్రి పెంచలయ్య మరియు ఇంకొకరు	264	265-2	267	265-1	సాగుభూమి
38	265-2	1.24	0.33	సొంపల్లి శివరామయ్య తండ్రి పెంచలయ్య	264-1	266	267	265-2	సాగుభూమి
39	266	1.84	0.47	సొంపల్లి వేణుగోపాల్ తండ్రి పెంచలయ్య మరియు ఇతరులు	265	266	267	266	టెంకాయ, వేప, బోరు
40	267-2	0.64	0.29	సొంపల్లి శివరామయ్య తండ్రి పెంచలయ్య	264	267-3	267-2	265	సాగుభూమి
41	267-3	0.60	0.23	సొంపల్లి అమ్మణ్ణి భర్త శివ రామయ్య	267-2	268	45	265, 266	బోరు-1
42	269-1A	0.93	0.71	కొర్రపాటి సుధాకర్ తండ్రి శంకరయ్య మరియు ఇతరులు	268	270	269-1B	269-2	టేకు, టెంకాయ, వేప, బోరు
43	269-2	0.38	0.14	కొర్రపాటి సుధాకర్ తండ్రి శంకరయ్య మరియు ఇంకొకరు	268	270	269-1A	269-2	
44	271-2	3.77	1.26	వట్టిగుంట విద్య తండ్రి వెంకట ప్రసాద్ మరియు ఇతరులు	270	324	271-2	271-2	తాటి, చిరిత, వేప
45	321	1.74	1.29	రావిళ్ళ మురళి తండ్రి రమణయ్య మరియు ఇంకొకరు	324	327-A	321	321	చింత , టెంకాయ, వేప, తాటి
46	322	0.83	0.09	మాముదూరు నారాయణమ్మ భర్త రమణయ్య	322	326	322	321	చింత, మామిడి, నేరేడు, తాటి, వేప
47	325-1	0.09	0.09	కొర్రపాటి వెంచమ్మ భర్త బలరామయ్య	325-2	324	324	326	టెంకాయ, బత్తాయ, జామ, టేకు, చింత, నేరేడు, తాటి, కుంకుడు, పనస, మామిడి, బోరు
48	325-2	0.61	0.53	పెమ్మసాని శివరామయ్య తండ్రి రమణయ్య	323	325-1	325-2	326	టెంకాయ, బత్తాయ, జామ, టేకు, చింత, నేరేడు, తాటి, కుంకుడు, పనస, మామిడి,బోరు
49	323/B-2	2.93	0.71	షేక్ మహబూబ్ జాన్ భర్త హసేన్ సాహెబ్ మరియు ఇతరులు	323/B-2	323/B-2	323/B-2	326	సాగుభూమి
50	323/B-3	0.14	0.02	నాలినేని ఆదిశేషయ్య తండ్రి నరసనాయుడు మరియు ఇతరులు	323/B-2	323/B-2	323/B-2	326	సాగుభూమి
51	326/A	0.14	0.10	మాముదూరు శ్రీనివాసులు తండ్రి రమణయ్య	322	1079	1079	327	బీడు
52	326/B1	0.53	0.01	రావిళ్ళ మోహన్ రావు తండ్రి సుబ్బరాయుడు	322	1079	1079	327	బీడు
53	326/B2	2.19	1.61	షేక్ మహబూబ్ జాన్ భర్త హసేన్ సాహెబ్ మరియు ఇతరులు	1079	323-2	324	327	టెంకాయ, మామిడి, దీమచింత, వేప
54	327/A1	0.27	0.27	రావిళ్ళ మోహన్ రావు తండ్రి సుబ్బరాయుడు	321	1078	326/A	327/A	సాగుభూమి
55	327/A2	0.34	0.17	రావిళ్ళ రమణయ్య తండ్రి వెంకటసుబ్బయ్య	321	1078	326/A	327/A	సాగుభూమి
56	327/B1	0.84	0.60	రావిళ్ళ రాజేంద్ర బాబు తండ్రి రమణయ్య	1078	327/B	327/B	327/B	సాగుభూమి
57	327/B2	2.01	0.03	రావిళ్ళ మురళీ తండ్రి రమణయ్య మరియు ఇంకొకరు	1078	326/B	326/B	327/B	మామిడి
58	332-1	11.56	0.09	పెమ్మసాని సుబ్బయ్య తండ్రి పెంచలయ్య మరియు ఇతరులు	331	26	26	332/1	మామిడి
మొత్తము :-		128.71	34.71						

సం/- కె.వి.యస్. చక్రధర్ బాబు, జిల్లా కలెక్టర్
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు.

● ఐఐటీ తిరుపతి షిప్‌యార్డు బిల్డింగ్ సమస్యల పరిష్కారానికి హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సీఎండీ హేమంత్ ఖత్రీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్య నారాయణ గురువారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకు గుజరాత్‌లో భారీ సదస్సు నిర్వహించారన్నారు.

బీసీలను విస్మరిస్తే తిరుగుబాటే

- 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి
- ఢిల్లీ మహాధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల డిమాండ్లను విస్మరిస్తే దేశంలో తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఇప్పటికైనా పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని, జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మహాధర్నాలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్ల గడిచినప్పటికీ బీసీలకు నేటికీ రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించలేదని మండిపడ్డారు. ఇప్పటివరకు బీసీలకోసం చిన్న, చిన్న అంశాలపై బిల్లులు పెడుతున్నారని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుతోనే సరైన న్యాయం జరుగుతుందని కృష్ణయ్య అన్నారు. బీసీ ప్రధానమంత్రి ఉన్న ప్రస్తుత సమయంలో పోరాడితేనే చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించేందుకు అవకాశం ఉన్నందున బీసీలు అందరూ రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమాలు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలి..

కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, బీసీల పురోగతి, అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో ఉన్న క్రీమీలేయర్‌ను తొలగించాలని కోరారు. కేంద్ర విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ భద్రత కల్పించేందుకు ప్రత్యేక బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న ఉద్యోగఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు అంగప్రదక్షిణం, ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: నవంబర్‌కు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. డిసెంబర్‌కు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్ల కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. అలాగే డిసెంబర్‌కు సంబంధించిన మరికొన్ని ఆర్జిత సేవలను ఆన్‌లైన్ లక్కీడిప్‌లో 22న ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంచుతుంది.

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 16 కంపార్ట్‌మెంట్‌ల్లో భక్తులు ఉన్నారు. సర్వదర్శనానికి 10 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు పడుతోంది. బుధవారం అర్ధరాత్రి వరకు 72,243 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 32,652 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.41 కోట్లు వేశారు.

లగేజీ డిపాజిట్ కేంద్రంపై అవాస్తవ ప్రచారం

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి అలిపిరి: అలిపిరి వద్ద ఉన్న టీటీడీ యాత్రికుల లగేజీ డిపాజిట్ కేంద్రాన్ని గురువారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తనిఖీ చేశారు. భక్తుల బ్యాగులను సిబ్బంది ఇష్టానుసారంగా వ్యాన్‌లోకి విసిరేస్తున్నారని ఇటీవల సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియోపై చైర్మన్ స్పందించారు. లగేజీ కేంద్రం వద్ద భక్తులతో మాట్లాడారు. బ్యాగులు తీసుకుని వాటిని వ్యాన్‌లో ఎక్కించి తిరుమలకు తరలించే విధానాన్ని పరిశీలించారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు, ప్రతిపక్ష పార్టీలు చేసిన ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని చెప్పారు. భక్తుల లగేజీ కేంద్రాలు చక్కగా పనిచేస్తున్నాయని చెప్పారు.

మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి

నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల మహాదీక్ష



గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాదీక్షలో మాదిగల నేతలు

గుంటూరు వెస్ట్/ గూడూరు: అణగారిన కులాల అభ్యున్నతితో పాటు అందరికీ సమాన అవకాశాలు రావాలంటే మూడు రాజధానులు చరిత్రాత్మక అవసరమని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గురువారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట మాదిగల మహాదీక్ష పేరుతో భారీ సభ జరిగింది. కార్యక్రమంలో పరిశపోగు శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ వికేంద్రీకరణ నిర్ణయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాలు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయం.. అన్ని ప్రాంతాల సమానత్వమని, వికేంద్రీకరణ ద్వారానే అది సాధ్యమన్నారు. మహాదీక్షలో రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు బత్తుల దేవానంద్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రత్నం, లీగల్ అడ్వైజర్ చిగురుపాటి పవన్ పాల్గొన్నారు.

22న విజయవాడలో ధర్నా

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ సాయిబాబా తదితరుల నిర్దోషిత్వంపై సుప్రీంకోర్టు ఇచ్చిన అన్యాయమైన ఉత్తర్వులను ప్రశ్నించాలని ఉపా (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) రద్దు పోరాట కమిటీ ఆంధ్రప్రదేశ్ విభాగం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఈనెల 22న ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ప్రొఫెసర్ సాయిబాబాతో పాటు మరో ఐదుగురికి బెయిల్ మంజూరు చేస్తూ మహారాష్ట్ర హైకోర్టు ఈనెల 14న ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేసింది.

బస్ పాస్, మెడికల్ ఐడీల చెల్లుబాటు కాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: పదవీ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత ప్రయాణ (బస్‌పాస్), వైద్య గుర్తింపు కార్డుల (మెడికల్ ఐడీ) చెల్లుబాటు కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ప్రస్తుతం ఉన్న రెండేళ్ల వ్యవధిని ఐదేళ్లకు పెంచుతూ ఏపీ రోడ్డు రవాణా సంస్థ గురువారం సర్క్యులర్ జారీ చేసింది. సవరించిన మార్గదర్శకాలు వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొంది. రెన్యువల్ ఫీజును రూ.100 నుంచి రూ.250కి పెంచినట్లు వివరించింది.

బీజేపీ, టీడీపీలు ఒక తాను ముక్కలే..

- పవన్‌కు ఆత్మాభిమానం ఉంటే బీజేపీని వీడాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి : గతంలో పాచిపోయిన లడ్డూ అని విమర్శలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఇంకా బీజేపీతో దోస్తీని ఎందుకు కొనసాగిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన పార్టీ కార్యదర్శివర్గ సమావేశాల నిర్ణయాలను గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. బీజేపీ టీడీపీలు ఒక తాను ముక్కలేనన్నారు. ఏపీకి బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తున్నా.. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేనలు ఆ పార్టీతోనే తైతక్కలాడుతునక్నారంటూ ఆరోపించారు. రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొడుతన్న బీజేపీపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశంలో రాష్ట్రంలోని పరిస్థితులు, రాజకీయ పరిణామాలను చర్చించినట్టు చెప్పారు.

రాహుల్ యాత్రకు సీపీఐ మద్దతు

ప్రత్యేక హోదా, అమరావతి రాజధాని, విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో సానుకూలంగా స్పందించిన రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు సీపీఐ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

పోలీస్ కస్టడీలో జనసేన నాయకులు

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న జనసేన నాయకులను నగర పోలీసులు గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. రిమాండ్‌లో ఉన్న తొమ్మిదిమందిని కోర్టు అనుమతితో పోలీసులు విచారణ కోసం తీసుకెళ్లినట్లు జైలు అధికారులు తెలిపారు. రెండురోజులు విచారించి అనంతరం జైలుకు తీసుకొస్తారన్నారు. వీరిని పోలీసులు కస్టడీకి తీసుకుంటున్నట్లు తెలిసిన జనసేన కార్యకర్తలు ఉదయం 8 గంటలకే జైలు వద్దకు చేరుకుని హడావిడి చేశారు. ఆరిలోవ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు జైలు వద్ద బందోబస్తు నిర్వహించారు.

మరోసారి వైద్యపరీక్షలు

పోలీస్ కస్టడీలో ఉన్న జనసేన నాయకులకు గురువారం కేజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో కొందరికి అనారోగ్య సమస్యలున్నాయని, వారికి వైద్యం కోసం అనుమతి ఇవ్వాలని జనసేన నాయకులు పట్టుబట్టారు. కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వై.జి.సుందరరాజు వారికి సర్ది చెప్పారు. జైలు అధికారులు సిఫారసు చేస్తే వైద్యం చేస్తామని పేర్కొన్నారు.



వడివడిగా.. బడి దిశగా..

పిల్లలను బడి బాట పట్టిస్తున్న సర్కారు

- ఈ సంవత్సరం ఇప్పటికే 1.43 లక్షల డ్రాపవుట్స్ తిరిగి బడికి
- ఇంటింటి సర్వేలో బడి వయస్సు పిల్లల గుర్తింపు
- బడికి రాని కారణాలపై ఆరా.. సమస్య పరిష్కరించి, బడికి
- తల్లిదండ్రులకు నచ్చజెప్పి పిల్లల్ని బడికి తెస్తున్న విద్యా అసిస్టెంట్లు, వలంటీర్లు
- ఈ కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్
- యాప్‌లో పిల్లల వివరాల నమోదు, పర్యవేక్షణ
- వరుసగా మూడు రోజులు పిల్లలు హాజరు కాకపోతే తల్లిదండ్రులకు మెసేజ్
- ప్రతి వారం కలెక్టర్లతో సీఎస్ సమీక్ష

రాష్ట్రంలో పిల్లలందరూ మంచి చదువులు చదవాలని, ప్రపంచస్థాయిలో పోటీ పడాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం. అందుకే వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమాన్ని చేపట్టి బడుల రూపురేఖల్ని మారుస్తోంది. పిల్లలు ఆహ్లాదకర వాతావరణంలో మంచి చదువులు చదివేలా పలు సంస్కరణలు చేపట్టింది. బడి మానేసిన పిల్లల్ని తిరిగి బడి బాట పట్టించేలా పలు చర్యలు చేపట్టింది. తల్లిదండ్రుల సమస్యలను పరిష్కరించి మరీ బడి మానేసిన పిల్లల్ని తిరిగి బడుల్లో చేర్పిస్తోంది. ఈ విద్యా సంవత్సరంలోనే 4 నుంచి 14 ఏళ్లలోపు బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారిలో 1,43,573 మందిని తిరిగి స్కూళ్లలో చేర్పించింది. - సాక్షి, అమరావతి

26 జిల్లాల్లో తిరిగి బడి బాట పట్టించిన పిల్లల సంఖ్య

జిల్లా	తిరిగి బడిబాట పట్టిన పిల్లలు	జిల్లా	తిరిగి బడిబాట పట్టిన పిల్లలు
		బాపట్ల	5,225
		కృష్ణా	4,780
కర్నూలు	12,177	శ్రీ సత్యసాయి	4,734
పల్నాడు	10,143	తూర్పుగోదావరి	4,639
నెల్లూరు	9,132	విశాఖపట్నం	4,482
ప్రకాశం	8,758	అన్నమయ్య	4,216
ఎన్టీఆర్	8,086	కోనసీమ	3,819
అనంతపురం	7,479	శ్రీకాకుళం	3,627
వైఎస్సార్	7,206	పశ్చిమ గోదావరి	3,527
నంద్యాల	7,079	అల్లూరి సీతారామరాజు	2,692
తిరుపతి	6,434	అనకాపల్లి	2,254
గుంటూరు	5,550	చిత్తూరు	2,206
ఏలూరు	5,549	విజయనగరం	2,146
కాకినాడ	5,500	పార్వతీపురం మన్యం	2,133

సచివాలయాలు కేంద్రంగా

డ్రాపవుట్స్‌ను తిరిగి బడిలో చేర్పించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా స్కూళ్ల నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేకంగా కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్‌ను రూపొందించింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి పాఠశాల వయస్సుగల పిల్లలందరూ స్కూళ్లలో చేరారో లేదో పరిశీలిస్తోంది. ఈ సర్వే, పాఠశాల విద్యా శాఖ అందించిన సమాచారం మేరకు బడి మానేసిన పిల్లల ఇళ్లకు సంక్షేమ, విద్యా అసిస్టెంట్, వార్డు విద్య డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వలంటీర్ వెళ్తున్నారు. పిల్లల్ని బడికి పంపించాలని తల్లిదండ్రులను ఒప్పిస్తున్నారు. ఎక్కువ కాలం బడికి రాకపోతే అందుకు కారణాలను ఇంటింటి సర్వేలో వలంటీర్లు సేకరిస్తున్నారు. పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారా, బాల్య వివాహాలు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు ఉన్నాయా అనే వివరాలను సేకరిస్తున్నారు. వాటికి పరిష్కారాలను చూపి, తల్లిదండ్రులకు నచ్చ చెప్పి మరీ పిల్లల్ని తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఆ వివరాలను, తల్లిదండ్రులతో సిబ్బంది మాట్లాడుతున్న ఫొటోలను ఎప్పటికప్పుడు కన్సిస్టెంట్ రిథమ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

పిల్లలు పాఠశాలలకు వస్తున్న తీరును సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎవరైనా పిల్లలు వరుసగా మూడు రోజులు బడికి హాజరు కాకపోతే తల్లిదండ్రులకు వలంటీర్లు ఫోన్ ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. తిరిగి వారు బడికి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే ఉపాధ్యాయులు హాజరవుతున్నారా లేదా అనే వివరాలను కూడా రిథమ్స్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సంక్షేమ విద్యా అసిస్టెంట్ వారంలో ఒక రోజు తన పరిధిలోని స్కూళ్లను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, స్కూలు సౌకర్యాలను పరిశీలిస్తున్నారు. నెలలో ఒక రోజు ఏఎన్ఎం స్కూళ్లను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి, వ్యాక్సినేషన్ వివరాలు సేకరిస్తున్నారు. వారంలో ఒక రోజు మహిళా పోలీసు స్కూళ్లను సందర్శించి పిల్లల హక్కులు, బాలికల భద్రత తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. వీరందరూ తమ పరిశీలనలో వెల్లడైన వివరాలను రిథమ్స్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆ వివరాలకు అనుగుణంగా ఎక్కడైనా సమస్యలు, లోపాలుంటే వెంటనే పరిష్కరిస్తున్నారు.

ప్రతి గురువారం సీఎస్ సమీక్ష

గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి పిల్లల విద్యపై రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మస్థాయిలో పర్యవేక్షణ చేస్తోంది. ప్రతి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్కూళ్లలో పిల్లలు హాజరు, బడి మానేసిన వారిని తిరిగి బడుల్లో చేర్పించడంపై సమీక్షిస్తున్నారు. తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ పరిశీలన సత్ఫలితాలనిస్తోంది. పిల్లల్ని బడి బాట పట్టించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది చురుగ్గా వ్యవహరిస్తున్నారు. దీంతో డ్రాపవుట్స్ తగ్గి, స్కూళ్లలో పిల్లల సంఖ్య పెరుగుతోంది.

వ్యాపారవేత్తలకు ఏపీ అనుకూలం

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మనం నంబర్ వన్
- వ్యాపార సంస్థల ప్రోత్సాహానికి ఏపీ ట్రేడ్ అడ్వైజరీ కమిటీ
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడి



మాట్లాడుతున్న ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పక్కన ఎంపీ గురుమూర్తి

తిరుపతి ఎడ్యుకేషన్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వ్యాపార, వాణిజ్య రంగాలు వేగంగా పురోగమిస్తున్నాయని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. వ్యాపారాలకు అనువైన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని, దీనిలో భాగంగా వాణిజ్య కారిడార్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాలులో గురువారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఏపీ ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో కలిసి వాణిజ్యశాఖ అధికారులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులు, వ్యాపార వేత్తలతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వాణిజ్య వ్యవస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వ్యాపార సంస్థలు, వ్యాపార వేత్తలను ప్రోత్సహించేలా ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేందుకు ఏపీ ట్రేడ్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ జరిగిన ఏపీ ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించామన్నారు. ఎగుమతుల్లో మన రాష్ట్రం 2019లో 7వ స్థానంలో ఉండగా ప్రస్తుతం నాల్గవ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రానికి 2014–19 మధ్య రూ. 12 వేల కోట్లు పెట్టుబడులు రాగా, గడిచిన మూడేళ్లలో రూ. 13.50 కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్ర అప్పుల పరిస్థితిని ఏనాడు దాచలేదని, ఎల్లో మీడియా కథనాలను కాకుండా కాగ్, ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ నివేదికలను పరిశీలించాలని ప్రజలను కోరారు.

చంద్రబాబుకు ప్రజాస్వామ్య విలువల్లేవు

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తన పార్టీలోకి తీసుకొని ఏకంగా మంత్రులను చేసిన చంద్రబాబు.. ప్రజాస్వామ్య విలువలు గురించి మాట్లాడడం, ప్రజాస్వామ్య పరిరక్షణ అని చెప్పడం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లేనని బుగ్గన విమర్శించారు. చంద్రబాబు, జనసేన మధ్య ఎన్నో మార్లు పెళ్లిళ్లు అయ్యాయని, విడాకులు కూడా అయ్యాయంటూ ఎద్దేవా చేశారు.

పట్టణ పేదలకు ఇళ్ల నిర్మాణంలో సామర్లకోటకు అవార్డు

సాక్షి, అమరావతి: కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 'అర్బన్ హౌసింగ్ కాన్‌క్లేవ్'లో పట్టణ పేదలకు ఇళ్ల నిర్మాణాల్లో బెస్ట్ పెర్ఫార్మింగ్ మునిసిపల్ కౌన్సిల్‌గా సామర్లకోటకు జాతీయ స్థాయిలో ఐదో ర్యాంక్ లభించింది. ఈ అవార్డును కేంద్ర మంత్రి హరదీప్‌సింగ్ పురీ చేతుల మీదుగా ఏపీ టిడ్కో చైర్మన్ జె.ప్రసన్నకుమార్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, గృహ నిర్మాణ సంస్థ జేఎండీ శివప్రసాద్ గురువారం అందుకున్నారు.



గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కాన్‌క్లేవ్‌లో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిర్మిస్తోన్న ఇళ్లు, వైఎస్సార్, జగనన్న కాలనీల స్టాల్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కర్నూలులో రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ

- శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు
- అనుమతి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రస్తుతానికి మంగళగిరిలో ఏర్పాటు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని న్యాయాధికారులకు శిక్షణ ఇచ్చే రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీని శాశ్వత ప్రాతిపదికన కర్నూలులో ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అకాడమీని ప్రస్తుతానికి మంగళగిరిలో అద్దె భవనంలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చింది. రాష్ట్ర విభజన తరువాత ఇప్పటివరకు రాష్ట్రంలో జ్యుడిషియల్ అకాడమీ లేదు. దీంతో రాష్ట్రంలో జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటుకు హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ సిఫారసులు పంపింది. ఈ సిఫారసులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో అకాడమీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి జి.సత్యప్రభాకర్ పేరు మీద జీవో జారీ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడమీలో ఉన్న సిబ్బందిలో 58.32 శాతం మించకుండా సిబ్బందిని మంజూరు చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. సిబ్బంది మంజూరు, మౌలిక సదుపాయాల కల్పన వివరాలతో తగిన ఉత్తర్వులను వేరుగా జారీ చేస్తామంది. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కోరింది. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పటికే అక్కడ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర లోకాయుక్త కార్యాలయాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

అక్రమ బయో డీజిల్ నిల్వ కేంద్రంపై దాడులు

వెంకటాచలం: అనుమతుల్లేకుండా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో జాతీయ రహదారికి ఆనుకుని నిర్వహిస్తోన్న అక్రమ బయో డీజిల్ నిల్వ కేంద్రంపై నెల్లూరు డివిజన్ సివిల్ సప్లయిస్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో సుమారు 1,500 లీటర్లకు పైగా బయో డీజిల్ నిల్వలు, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని బరి తెగించి నిత్యం వేల లీటర్ల బయో డీజిల్ అమ్మకాలు చేపడుతున్నారని సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో ఏఎస్‌వో జె.రవిబాబు గురువారం అక్కడకు చేరుకుని తనిఖీలు చేశారు. గోడౌన్ తాళాలు తీయాలని, అక్కడ పనిచేసే సిబ్బందికి సూచించగా, తాళాలు లేవని, నిర్వాహకులు లేరని చెప్పడంతో తాళాలు తీయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడంతో, రెండు గంటల తరువాత నిర్వాహకుడు వచ్చి తాళాలు తీశారు. గోడౌన్‌లో 3,000 లీటర్ల సామర్థ్యం కలిగిన 6 ట్యాంకులు ఉన్నట్లు గుర్తించారు. అన్ని ట్యాంకుల్లో కలిపి సుమారు 1,500 లీటర్ల ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఏఎస్‌వో రవిబాబు మాట్లాడుతూ అక్రమ బయో డీజిల్ నిల్వ కేంద్రం నడుపుతున్న వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేశామని తెలిపారు.



దాడులు చేస్తున్న ఏఎస్‌ఓ రవిబాబు

16, 17 తేదీల్లో సీనియర్ సిటిజన్స్ జాతీయ మహాసభలు


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారత వరిష్ఠ పౌరుల సంఘాల సమాఖ్య (సీనియర్ సిటిజన్స్) జాతీయ మహాసభలు నవంబర్ 16,17 తేదీల్లో మైసూరులో జరుగనున్నాయని ఉమ్మడి కృష్ణాజిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్య్ర సమరయోధుల భవనంలో గురువారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మైసూరులో జరిగే సమావేశాల్లో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. సమావేశం అనంతరం వైద్య శిబిరం జరిగింది. దంత వైద్యురాలు శ్రీసుధ మాట్లాడుతూ వృద్ధాప్యంలో దంత సమస్యలపై అప్రమత్తత అవసరం అన్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. బ్రష్ చేసుకునే పద్ధతిని వివరించారు. సమావేశంలో వేమూరి బాబూరావు, సంఘం ప్రతినిధులు డి.సాంబశివరావు, అరుణాచలం, జీవీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోతుకూరి వెంకటేశ్వరరావు

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రెవెన్యూ శాఖలోని గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్‌ఏల సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశామని, వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని సజ్జల హామీ ఇచ్చినట్లుగా దివాకర్ తెలియజేశారు. సంఘం కో–చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు, కె.లక్ష్మారెడ్డి, జోసఫ్, పెంచలయ్య, శ్రీనివాస్, గణపతి ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారని పేర్కొన్నారు.



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

స్వర్ణం...లక్ష్మీ కటాక్షం

- నగల దుకాణాల్లో ప్రారంభమైన సందడి
- ధన త్రయోదశికి నగరంలో భారీ వ్యాపారం
- జిల్లాలో సుమారు వెయ్యి దుకాణాలు
- రూ.200 కోట్ల మేర జరగనున్న వ్యాపారం

పటమట(విజయవాడ పశ్చిమ): జిల్లాలో ధనత్రయోదశి సందడి మొదలైంది. ధనత్రయోదశి అనగానే అందరికీ గుర్తుకువచ్చేది బంగారం అమ్మకాలే. నగరంలోనే కాకుండా జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో సైతం జ్యూయలరీ దుకాణాల్లో ధనత్రయోదశి హడావుడి ప్రారంభమైంది. ఐశ్వర్య ప్రదాయిని లక్ష్మీదేవి కటాక్షాన్ని అందించే శుభదినం ధనత్రయోదశి అని హిందువుల విశ్వాసం. వెలుగు దివ్వెల పర్వదినమైన దీపావళి పర్వదినానికి రెండు రోజుల ముందు జరుపుకొనే ఉత్సవమే ధనత్రయోదశి. ఆ రోజున లక్ష్మీదేవిని పూజిస్తే, ఆమెకు ప్రీతికరమైన కార్యక్రమాలను నిర్వహిస్తే లక్ష్మీ అమ్మవారి దీవెనలు పుష్కలంగా అందుతాయని పండితులు చెబుతారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశిని ధనత్రయోదశిగా, యమత్రయోదశిగా మనం జరుపుకొంటాం. ఉత్తర భారతదేశంలో ధనత్రయోదశిని ధన్‌తేరస్‌గా జరుపుకొంటారు. ఈ ఏడాది అక్టోబర్ 22 వ తేదీ సాయంత్రం నుంచి 23 వ తేదీ సాయంత్రం వరకూ త్రయోదశి ఘడియలు కొనసాగుతున్నాయి.



విజయవాడలోని ఒక నగల దుకాణంలో నగలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు(ఫైల్)

ధనత్రయోదశి రోజున బంగారానికి డిమాండ్

ధనత్రయోదశి రోజున బంగారం కొనుగోలు చేయాలనే ప్రచారం ఉత్తర భారతదేశంలో చాలా బలంగా ఉంది. అయితే గడిచిన రెండు దశాబ్దాలుగా ఆ సంప్రదాయాన్ని దక్షిణాది రాష్ట్రాలకు కూడా అలవాటు చేశారు. అందులో భాగంగా ధనత్రయోదశి రోజున ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత మేలు జరుగుతుందనే భావనను కార్పొరేట్ సంస్థలు విస్తృతంగా ప్రచారం చేశాయి. దాంతో ప్రతి ధనత్రయోదశి రోజున జ్యూయలరీ దుకాణాలు విస్తృతమైన అమ్మకాలు జరుపుకొంటున్నాయి. ధనత్రయోదశి రోజు కోసం నెల రోజుల ముందు నుంచే వినియోగదారులను ఆకర్షించే విధంగా ప్రకటనలు ఇస్తూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. భారతదేశంలో జరిగే మొత్తం బంగారు ఆభరణాల అమ్మకాల్లో ధనత్రయోదశి పర్వదినం సందర్భంగా జరిగే అమ్మకాలు 15 నుంచి 20 శాతం ఉంటాయంటే దీని ప్రభావం ఎంతగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితం

నగరంలో నాలుగు రోజుల క్రితం నుంచే జ్యూయలరీ దుకాణాల్లో సందడి ప్రారంభమైంది. పలు దుకాణాలు ఇప్పటికే ధనత్రయోదశికి ఆఫర్లు ప్రకటించాయి. మేకింగ్ చార్జీల్లో, తరుగుల్లో ప్రత్యేకంగా రాయితీని ప్రకటించాయి. ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితమని ప్రకటించాయి. గ్రాముకు వంద నుంచి రెండు, మూడు వందలంటూ వారివారి స్థాయిల్లో ప్రకటనలు గుప్పిస్తున్నాయి. వాటితో పాటుగా పాతబంగారం ఇస్తే ప్రత్యేకంగా క్యాష్‌బ్యాక్ అధికంగా ఇస్తామని కూడా ప్రచారం చేస్తున్నాయి. ఇంకా పలు ప్రత్యేక రాయితీలంటూ ఊదరగొడుతున్నాయి.

దాదాపు రూ.150 నుంచి రూ.200 కోట్ల వరకు వ్యాపారం

ధనత్రయోదశి రోజున రూ.150 నుంచి రూ.200 కోట్ల మేరకు జిల్లాలో వ్యాపారం జరుగుతుందని అంచనా. దుకాణాలు కాకుండా సంప్రదాయబద్ధంగా ఆభరణాలు తయారు చేసే వృత్తిదారులు సైతం ధనత్రయోదశి రోజున బిజీబిజీగా ఉంటారు. అయితే కరోనాతో రెండేళ్ల పాటు ఈ వ్యాపారానికి భారీగా గండి పడింది. గత ఏడాది ఒకింత మంచి వ్యాపారం జరిగినా అనుకున్న స్థాయిలో జరగలేదు. ఇప్పుడిప్పుడే వాతావరణం మారుతుండటంతో ఈ ఏడాది వ్యాపారం బాగుంటుందని భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వెయ్యికి పైగా దుకాణాలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వెయ్యికి పైగా జ్యూయలరీ దుకాణాలు కొనసాగుతున్నాయి. సుమారు 30 వరకూ ప్రముఖ కార్పొరేట్ సంస్థలు తమ శాఖలను నగరంలో నిర్వహిస్తున్నాయి. విజయవాడ పాతబస్తీలో సుమారు ఎనిమిది దశాబ్దాలుగా నడుస్తున్న జ్యూయలరీ దుకాణాలు ఉన్నాయి. సుమారు మూడు వందలకు పైగా ఇక్కడ దుకాణాలు ఉన్నాయి. బందరు రోడ్డు, రాజగోపాలచారి రోడ్డు, గవర్నరుపేట, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో మరో మూడు వందల వరకూ దుకాణాలు ఉన్నాయి. వాటితో పాటు జిల్లా వ్యాప్తంగా మరో నాలుగు వందలకు పైగా జ్యూయలరీ దుకాణాలు కొనసాగుతున్నాయి. మొత్తం మీద వెయ్యి దుకాణాలు జిల్లాలో బంగారం ఆభరణాల విక్రయాలను నిర్వహిస్తున్నాయి.

అలవికాని వేదన

- సముద్రంలో నలుగురి గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లో ఘటన

చీరాల టౌన్/తెనాలి రూరల్/గుంటూరు రూరల్: ఎన్నో ఆశలతో బిడ్డలను ఇంజినీరింగ్ చదివిస్తున్న ఆ తల్లిదండ్రుల ఆశలు గల్లంతయ్యాయి. చేతికి అందివచ్చిన కొడుకులను రాకాసి అలలు కబళించాయి. ఫలితంగా నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. ఈ హృదయవిదారక ఘటన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం సముద్ర తీరంలో గురువారం జరిగింది. చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన జీవీఆర్‌ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు కాలేజీకి గైర్హాజరై సముద్ర స్నానాల కోసం రామాపురం బీచ్‌కు వచ్చారు. తీరం ఒడ్డున ఉండే సీ బ్రీజ్ రిసార్ట్స్ సమీపంలో గురువారం మధ్యాహ్నం సముద్రంలోకి దిగారు. ఒక్కసారిగా అలల ఉధృతి పెరగడంతో తెనాలికి చెందిన యడవల్లి వెంకటరమణ (19), పులివర్తి గౌతమ్ (20), అమరావతి సమీపంలోని పరిమి గ్రామానికి చెందిన తాళ్లూరి రోహిత్ (20), హైదరాబాద్‌కు చెందిన తిరునగిరి మహదేవ్ (18) గల్లంతయ్యారు. కొద్దిసేపటికి మహదేవ్ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన తీరానికి చేరుకుని గుండెలవిసేలా రోదిస్తున్నారు. తమ పిల్లల ఆచూకీ కోసం నిరీక్షిస్తున్నారు.



ఘటనా స్థలంలో తోటి విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, డీఎస్పీ శ్రీకాంత్

గజ ఈతగాళ్లతో గాలింపు

గల్లంతైన విద్యార్థుల కోసం మెరైన్, సివిల్ పోలీసులతోపాటు గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం రాత్రి పొద్దుపోయేవరకు గాలించినా మృతదేహాల ఆచూకీ లభించలేదని చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి ఆచూకీ లభిస్తుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఘటనా స్థలాన్ని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. ఘటన బాధాకరమని పేర్కొన్నారు. గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని పోలీసులను ఆదేశించారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఘటన స్థలాన్ని వేటపాలెం తహసీల్దార్ సంధ్యశ్రీ, చీరాల రూరల్, వేటపాలెం ఎస్సైలు జనార్దన్, సురేష్, మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, రెవెన్యూ అధికారులు సందర్శించి వివరాలు సేకరించారు.

కాలేజీ బస్సు మరమ్మతుల వల్లేనా!

విద్యార్థుల గల్లంతుతో తెనాలి బాలాజీపేటలో విషాదం నెలకొంది. తెనాలి నుంచి రోజూ గుంటూరు జీవీఆర్‌ఎస్ కాలేజీకి రెండు బస్సులు నడుస్తాయి. వీటిలో ఒకటి మరమ్మతులకు గురైంది. దీంతో ఆ బస్సులో రావాల్సిన విద్యార్థులు కొందరు ఇంటి నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరి స్నేహితులతో కలిసి రామాపురం బీచ్‌కు వెళ్లారని సమాచారం. విషయం తెలిసిన కళాశాల యాజమాన్య ప్రతినిధులు కరిమున్నీసా, లింకన్ తదితరులు చీరాల బయలుదేరి వెళ్లారు.

కాలేజీకి అని వెళ్లి..

బాపట్లకు చెందిన పులివర్తి సురేష్‌బాబు, రమాజయశ్రీ దంపతులు వృత్తి, ఉద్యోగరీత్యా తెనాలి వచ్చారు. వీరికి కొడుకు గౌతమ్‌తో పాటు ఓ కుమార్తె కూడా ఉంది. సురేష్‌బాబు తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో బార్బర్ షాపు నడుపుతున్నారు. రమాజయశ్రీ తెనాలి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా చేస్తున్నారు. బాలాజీరావుపేటలో అద్దె ఇంట్లో ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. గౌతమ్ కాలేజీకని వెళ్లాడు. అంతలోనే సముద్రంలో గల్లంతయ్యాడని తెలియడంతో వానే రోదిస్తూ రామాపురం వెళ్లారు.

ఉన్న ఒక్క కొడుకుపైనే ఆశలు

వెంకటరమణ తండ్రి శ్రీనివాసరావు టింబర్ డిపో నిర్వహిస్తున్నారు. తల్లి నాంచారమ్మ ప్రైవేటు స్కూలులో టీచర్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా చిన్న కుమారుడిని గతంలోనే దత్తత ఇచ్చారు. పెద్దవాడైన వెంకటరమణను అల్లారుముద్దుగా పెంచారు. అతని పైనా ఆశలు పెట్టుకున్నారు. వెంకటరమణ గల్లంతుతో ఆ ఆశలన్నీ గల్లంతయ్యాయి.

పంజాబ్ అసిస్టెంట్ కోచ్‌గా హాడిన్



ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ బ్రాడ్ హాడిన్ 2023 ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుతో కలిసి పని చేయనున్నాడు. రాబోయే సీజన్‌లో అతను ఈ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఆసీస్ తరఫున హాడిన్ 66 టెస్టులు, 126 వన్డేలు, 34 టి20ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా తరఫున ఆడిన అతను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కూడా అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించాడు.

ఇన్‌గ్లిస్ స్థానంలో గ్రీన్



ఆస్ట్రేలియా టి20 వరల్డ్ కప్ జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. గోల్ఫ్ ఆడుతూ గాయపడిన వికెట్ కీపర్ జోష్ ఇన్‌గ్లిస్ స్థానంలో ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌కు చోటు లభించింది. టోర్నీ టెక్నికల్ కమిటీ ఈ మార్పుకు ఆమోద ముద్ర వేసినట్లు ఐసీసీ పేర్కొంది. భారత పర్యటనలో గ్రీన్ రెండు మెరుపు అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నాడు. మీడియం పేస్ బౌలింగ్ చేస్తూ ఏ స్థానంలోనైనా గ్రీన్ బ్యాటింగ్ చేయగలడు.ఆస్ట్రేలియా తరఫున గ్రీన్ ఇప్పటి వరకు 7 టి20 మ్యాచ్‌లు ఆడాడు.

గెలిచి శ్రీలంక.. ఓడి నెదర్లాండ్స్...

- సూపర్–12కు అర్హత
- నమీబియా ఆశల్ని తుంచిన యూఏఈ
- టి20 ప్రపంచకప్



కుశాల్ మెండిస్

టి20 ప్రపంచకప్ తొలిరౌండ్ నుంచి శ్రీలంక, నెదర్లాండ్స్ 'సూపర్–12'కు ప్రధాన టోర్నీకి అర్హత సంపాదించాయి. గ్రూప్ 'ఎ' తొలి మ్యాచ్‌లో ఆసియా చాంపియన్ లంకను కంగు తినిపించిన నమీబియా సంచలన ప్రదర్శన చివరకు పేలవంగా ముగిసింది. యూఏఈపై గెలవాల్సిన మ్యాచ్‌ను చేజేతులా ఓడిన నమీబియా... నెదర్లాండ్స్ ముందుకెళ్లే అవకాశాన్నిచ్చింది. ఉదయం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 16 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై గెలిచింది. సాయంత్రం ముగిసిన పోరులో యూఏఈ 7 పరుగుల తేడాతో నమీబియాను ఓడించింది. లంక గెలిచి అర్హత సాధించగా, ఓడిన నెదర్లాండ్స్ కూడా ఇదివరకే రెండు విజయాలతో ముందంజ వేసింది. నమీబియా గెలిస్తే నెదర్లాండ్స్ కథ ముగిసేది.

గీలాంగ్: నెదర్లాండ్స్‌తో జరిగిన పోరులో మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుశాల్ మెండిస్ (44 బంతుల్లో 79; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగాడు. తర్వాత నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులు చేసింది. మ్యాక్స్ ఓ డౌడ్ (53 బంతుల్లో 71 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరిపోరాటం చేశాడు. లంక ఇన్నింగ్స్ నిదానంగా మొదలైంది. పవర్‌ప్లేలో నిసాంక (14; 1 ఫోర్), మెండిస్ జోడీ చేసింది 36 పరుగులే! అదే స్కోరుపై నిసాంక, ధనంజయ డిసిల్వా (0)... మీకెరెన్ వేసిన ఏడో ఓవర్లో పెవిలియన్ చేరారు. ఈ దశలో కుశాల్, చరిత్ అసలంక (30 బంతుల్లో 31; 3 ఫోర్లు) స్కోరు పెంచే బాధ్యత తీసుకున్నారు. ఇద్దరు వేగంగా పరుగులు జత చేశారు. 9వ ఓవర్లో 50 పరుగులు చేసిన లంక, కుశాల్ సిక్సర్లతో విరుచుకుపడటంతో 14.3 ఓవర్లలోనే 100 స్కోరు దాటింది. కుశాల్ 34 బంతుల్లో (3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. భానుక రాజపక్స (13 బంతుల్లో 19; 2 ఫోర్లు) వచ్చాక స్కోరు వేగం మరింత పుంజుకుంది. డెత్ ఓవర్లలో కెప్టెన్ షనక (8), కుశాల్ మెండిస్‌లు వెనుదిరగడంతో ఆశించిన స్కోరు చేయలేకపోయింది. నెదర్లాండ్స్ బౌలర్లలో మీకెరెన్, బస్ డి లీడె చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం నెదర్లాండ్స్ జట్టులోనూ ఓపెనర్ మ్యాక్స్ ఓ డౌడ్ కడదాకా పోరాటం చేసినా లంక బ్యాటర్స్‌లా అండగా నిలిచే సహచరులు కరువయ్యారు. అతని తర్వాత రెండో అత్యధిక స్కోరు కెప్టెన్ ఎడ్వర్డ్స్ (21)దే! మిగతావారిలో ముగ్గురు డకౌటయ్యారు. లెగ్ స్పిన్నర్ హసరంగ (3/28) ప్రత్యర్థిని పడగొట్టగా, తీక్షణ 2, లహిరు, ఫెర్నాండో చెరో వికెట్ తీశారు.

వీస్ పోరాడినా...

టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో గట్టి ప్రత్యర్థి, ఆసియా చాంపియన్ శ్రీలంకపై నమీబియా 163/7 స్కోరు చేసింది. 55 పరుగులతో సంచలన విజయం సాధించింది. కానీ సూపర్–12కు అర్హత సాధించే ఆఖరి మ్యాచ్‌లో క్రికెట్‌కూన యూఏఈ నిర్దేశించిన 149 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. లక్ష్యాన్ని కాపాడుకునేందుకు ఆఖరిదాకా పట్టుదల కనబరిచిన యూఏఈ చివరకు 7 పరుగుల తేడాతో గెలిచి ఈ గ్రూప్‌లో ఒక విజయంతో నిష్క్రమించింది. నమీబియాకు కీలకమైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 148 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముహమ్మద్ వసీమ్ (41 బంతుల్లో 50; 1 ఫోర్, 3 సిక్సర్లు), వ్రిత్యా అరవింద్ (32 బంతుల్లో 21; 2 ఫోర్లు) నమీబియా బౌలర్లను ఎదుర్కొనేందుకు ఆరంభంలో కష్టపడ్డారు. దీంతో 8 ఓవర్లు ముగిసినా జట్టు స్కోరు 39 పరుగులను దాటలేదు. అరవింద్ అవుటయ్యాక... కెప్టెన్ రిజ్వాన్ (29 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) వచ్చాకే యూఏఈ స్కోరు పుంజుకుంది. వసీమ్, రిజ్వాన్ రెండో వికెట్‌కు 6.5 ఓవర్లలో 58 పరుగులు జోడించారు. ఆఖర్లో బాసిల్ హమీద్ (14 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) భారీషాట్లతో మెరిపించడంతో యూఏఈ పోరాడే స్కోరు చేయగలిగింది. నమీబియా బౌలర్లు డేవిడ్ వీస్, బెర్నార్డ్, షికొంగో తలా ఒక వికెట్ తీశారు. అనంతరం నమీబియా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసి ఓడిపోయింది. లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన నమీబియా ఆరంభం నుంచే అగచాట్లు పడింది. ఓపెనర్లు మైకేల్ లింగెన్ (10), స్టీఫన్ (4) సహా ఆరో వరుస బ్యాటర్ స్మిత్ (3) దాకా అంతా నిరాశ పరిచారు. దీంతో 69 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన నమీబియాకు ఓటమి ఖాయమైంది. అయితే డేవిడ్ వీస్ (36 బంతుల్లో 55; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టులో ఆశలు రేపాయి. ఎనిమిదో వికెట్‌కు రుబెన్ ట్రంపుల్‌మన్ (24 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), వీస్ ఇద్దరు 7 ఓవర్లలో 70 పరుగులు జోడించడంతో నమీబియా గెలుపు వాకిట నిలిచింది. 6 బంతుల్లో 14 పరుగులు చేయాల్సిన సమీకరణం నమీబియాను ఊరించింది. తొలి 3 బంతుల్లో 4 పరుగులు వచ్చాయి. నాలుగో బంతిని సిక్సర్‌గా మలిచేందుకు వీస్ ప్రయత్నించగా బౌండరీ వద్ద షరఫు అందుకోవడంతో యూఏఈకి గెలుపు ఖాయమైంది. ఈ ఫలితం నెదర్లాండ్స్‌కు లక్కీచాన్స్ అయ్యింది. మధ్యాహ్నం ఓటమి తాలుకు నిరాశ సాయంత్రమయ్యేసరికి సంతోషంగా మారింది. యూఏఈ మ్యాచ్ అయిపోగానే నెదర్లాండ్స్ సంబరాల్లో మునిగితేలింది.



నెదర్లాండ్స్ జట్టు

స్కాన్ చేయండి
ఈ రోజు హైలైట్ కొరకు

గ్రూప్'బి' తేలేది నేడే

గ్రూప్ 'ఎ' లెక్క తేలింది. మిగిలింది 'బి' గ్రూపు లెక్కే! ఇక్కడ నాలుగు జట్లకు సమాన అవకాశాలున్నాయి. స్కాట్లాండ్, జింబాబ్వే, వెస్టిండీస్, ఐర్లాండ్ జట్లన్నీ రెండు మ్యాచ్‌ల్లో ఒక్కో గెలుపోటములతో రేసులో ఉన్నాయి. నేడు ఆఖరి లీగ్ మ్యాచ్‌ల్లో రెండు సార్లు చాంపియన్ వెస్టిండీస్‌తో ఐర్లాండ్... స్కాట్లాండ్‌తో జింబాబ్వే తలపడతాయి. గెలిస్తే చాలు... ఎలాంటి సమీకరణలతో సంబంధం లేకుండా గెలిచిన రెండు జట్లు 'సూపర్–12' దశకు అర్హత సాధిస్తాయి.

వెస్టిండీస్ X ఐర్లాండ్ (ఉ.గం. 9:30 నుంచి)
స్కాట్లాండ్ X జింబాబ్వే. (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం



వసీమ్

బంగ్లాలో భారత్ పర్యటన ఖరారు

2 టెస్టులు, 3 వన్డేల్లో పోరు

ఢాకా: వచ్చే డిసెంబర్‌లో భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా ఇరు జట్ల మధ్య 2 టెస్టులు, 3 వన్డే మ్యాచ్‌లు జరుగుతాయి. టూర్ వివరాలను గురువారం బంగ్లా క్రికెట్ బోర్డు ప్రకటించింది. డిసెంబర్ 1న భారత జట్టు బంగ్లాదేశ్‌కు వెళుతుంది. ముందుగా ఢాకాలో మూడు వన్డేలు డిసెంబర్ 4, 7, 10 తేదీల్లో జరుగుతాయి. డిసెంబర్ 14నుంచి 18వరకు చిట్టోగ్రామ్‌లో తొలి టెస్టు, 22నుంచి 26 వరకు ఢాకాలో రెండో టెస్టు మ్యాచ్ నిర్వహిస్తారు. భారత జట్టుకు సంబంధించి ఈ రెండు టెస్టులు కీలకం కానున్నాయి. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించే ప్రయత్నంలో భారత్ మరో 6 టెస్టులు ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల్లో తలపడాల్సి ఉంది. ఆ కోణంలో చూస్తే బంగ్లాపై రెండు మ్యాచుల్లోనూ గెలిచి సాధ్యమైనన్ని ఎక్కువ పాయింట్లు సాధించాలని టీమిండియా భావిస్తోంది.

హైదరాబాద్, ఆంధ్ర జట్ల ఓటమి

ముస్తాక్ అలీ టి20 టోర్నీ

జైపూర్: దేశవాళీ టి20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ 'బి'లో హైదరాబాద్‌కు మూడో పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 7 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. ఠాకూర్ తిలక్ వర్మ (37 బంతుల్లో 48; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరో సారి జట్టు టాప్ స్కోరర్‌గా నిలవగా, భవేశ్ సేఠ్ (27), రవితేజ (18) రెండంకెల స్కోరు చేశారు. కరణ్ శర్మ 3, కార్తీక్ త్యాగి 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం యూపీ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 133 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఆర్యన్ జుయాల్ (58 బంతుల్లో 71 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో చెలరేగగా, కరణ్ శర్మ (31 బంతుల్లో 33; 4 ఫోర్లు) రాణించాడు.

సమష్టి వైఫల్యం...

ఇండోర్: గ్రూప్ 'డి' మ్యాచ్‌లో గుజరాత్ 5 వికెట్ల తేడాతో ఆంధ్రను ఓడించింది. ముందుగా ఆంధ్ర 20 ఓవర్లలో 9 వికెట్లకు 129 పరుగులు చేసింది. శ్రీకర్ భరత్ (20)దే అత్యధిక స్కోరు. చింతన్ గాజాకు 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత గుజరాత్ 18 ఓవర్లలో 5 వికెట్లకు 132 పరుగులు సాధించింది. కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ (45 బంతుల్లో 59; 1 ఫోర్, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో జట్టును గెలిపించాడు.

సందీప్ పాటిల్ పరాజయం

ఎంసీఏ ఎన్నికలు



ముంబై: ప్రతిష్టాత్మక ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ఎన్నికల్లో భారత మాజీ క్రికెటర్ సందీప్ పాటిల్‌కు అనూహ్య ఓటమి ఎదురైంది. అమోల్ కాలే 25 ఓట్ల తేడాతో పాటిల్‌పై గెలుపొందారు. బీసీసీఐ కోశాధికారి ఆశిష్ షెలార్ మద్దతుతో బరిలో నిలిచిన కాలేకు 183 ఓట్లు రాగా, పాటిల్‌కు 158 ఓట్లు వచ్చాయి. భారత జట్టు తరఫున 29 టెస్టులు, 45 వన్డేలు ఆడిన 66 ఏళ్ల పాటిల్ జాతీయ క్రికెటర్ అకాడమీ డైరెక్టర్‌గా, బీసీసీఐ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. భారత్, కెన్యా, ఒమన్ జట్లకు కోచ్‌గా కూడా పని చేసిన ఆయన కొద్ది రోజుల క్రితమే ఎంసీఏ ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు.

అనీశ్ - సిమ్రన్‌లకు సిల్వర్



కైరో: వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ మరో రజత పతకాన్ని గెలుచుకుంది. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత ద్వయం రెండో స్థానంలో నిలిచింది. ఫైనల్లో అనీశ్ – సిమ్రన్‌ప్రీత్ కౌర్ ద్వయం 14–16 స్కోరుతో ఉక్రెయిన్‌కు చెందిన యులియా కొరొస్టెలోవా – మాక్సీమ్ హొరడైనెట్స్ చేతిలో పరాజయంపాలైంది. తాజా వెండి పతకంతో వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 26కు చేరగా, జట్టు రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇందులో 10 స్వర్ణాలు, 6 రజతాలు, 10 కాంస్యాలు ఉన్నాయి.

అంకుశ్‌కు రజతం



పాంటివెడ్రా (స్పెయిన్): ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. మహిళల 50 కేజీల విభాగంలో అంకుశ్ ఫైనల్లో ఓటమిపాలై రజతాన్ని అందుకుంది. ఫైనల్లో యుయి సుసాకి (జపాన్) చేతిలో 2 నిమిషాల్లోనే 'ఫాల్'గా అంకుశ్ ఓటమి ఖాయమైంది. 59 కేజీల విభాగంలో రమినా మామెడొవా (లాత్వి యా) గాయంతో తప్పుకోవడంతో మాన్సికి కూడా కాంస్యం దక్కింది. పురుషుల విభాగంలో వికాస్, నితీశ్ కూడా రజతాలు గెలుచుకున్నారు. 70 కేజీల కేటగిరీలో వికాస్ 6–0 తేడాతో డైగో కొబయాషి (జపాన్)ను, 97 కేజీల విభాగంలో నితీశ్ 10–0తో ఐగర్ ఫెర్నాండో (బ్రెజిల్)ను ఓడించి కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్

- సాత్విక్–చిరాగ్ జోడి ముందంజ
- శ్రీకాంత్, ప్రణయ్ ఓటమి
- డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ టూర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌కు ప్రిక్వార్టర్ ఫైనల్లో పరాజయంపాలయ్యాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో సింగపూర్‌కు చెందిన ఏడో సీడ్ లో కీన్ యూ 21–13, 21–15 స్కోరుతో శ్రీకాంత్‌ను ఓడించాడు. 35 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో ఏపీ షట్లర్ శ్రీకాంత్ తగిన పోటీ ఇవ్వడంలో విఫలమయ్యాడు. అయితే మరో భారత ప్లేయర్ లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్య 21–9, 21–18 స్కోరుతో భారత్‌కే చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్‌ను చిత్తు చేశాడు. గత రెండు మ్యాచ్‌లలో ప్రణయ్ చేతిలో ఓడిన సేన్ ఈ సారి పదునైన ఆటతో చెలరేగి 39 నిమిషాల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు.

గాయత్రి–ట్రిసా జోడి ఓటమి...

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జంట క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో ఈ భారత షట్లర్లు 21–14, 2–16తో ఇండోనేసియాకు చెందిన ముహమ్మద్ షోహిబుల్ – బగాస్ మౌలానాలను ఓడించారు. అయితే మహిళల డబుల్స్‌లో భారత జోడి పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రిసా జాలీకి చుక్కెదురైంది. థాయిలాండ్‌కు చెందిన జొంగ్‌కొల్ఫాన్ కిటిథారకుల్ – రవీంద ప్రజొంగ్‌జాయ్ ద్వయం 23–21, 21–13 స్కోరుతో గాయత్రి–ట్రిసాపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు చెందిన ఇషాన్ భట్నాగర్ – తనీషా క్రాస్టో 16–21, 10–21 తేడాతో యుటా వతనబె – అరిసా హిగాషినో (జపాన్) చేతిలో ఓటమిపాలయ్యారు.

సామియా ఓటమి

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ సూపర్ -100 టోర్నమెంట్‌లో భారత షట్లర్ సామియా ఇమాద్ ఫారూఖీకి పరాజయం ఎదురైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో మలేసియా చెందిన కిసోనా సెల్వదురై 21–10, 21–17 తేడాతో హైదరాబాద్‌కు చెందిన సామియాపై గెలుపొందింది.

'నిర్ణయించాల్సింది ప్రభుత్వమే'

- పాక్ పయనం మా చేతుల్లో లేదు
- బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ



బెంగళూరు: వచ్చే ఏడాది ఆసియా కప్ టోర్నమెంట్ కోసం పాకిస్తాన్‌కు జట్టును పంపే అంశం బోర్డు చేతుల్లో లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ తెలిపారు. గురువారం కర్ణాటక క్రికెట్ సంఘం ఆయనకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బిన్నీ పలు విషయాలపై స్పష్టత ఇచ్చారు. 'పాక్‌లో పర్యటించడం, ఆడటమనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. దీనిపై బోర్డు చేసేదేమీ లేదు. సొంతంగా నిర్ణయించునే అవకాశం లేదు. భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే జట్టు వేరే దేశానికి బయల్దేరుతుంది. ఇతర దేశాలు మన దేశానికి రావాలన్నా కూడా ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి. కేంద్రం అనుమతిస్తేనే టీమిండియా పాక్‌కు వెళుతుంది. ఇందులో మేం పూర్తిగా ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారపడాలి. ఇప్పటివరకైతే పాక్‌లో జరిగే ఆసియాకప్ కోసం ప్రభుత్వాన్ని సంప్రదించలేదు' అని రోజర్ బిన్నీ తెలిపారు. దేశంలోని పిచ్‌లపై ప్రత్యేక దృష్టి పెడతామని, ఫాస్ట్ బౌలర్లకు అనుకూలమైన పిచ్‌లు భారత్‌లో చాలా తక్కువని, ఈ విషయంలో మెరుగవ్వాలని అన్నారు. రంజీ ట్రోఫీ, ఇరానీ కప్ స్థాయిని పెంచేందుకు కూడా ప్రయత్నిస్తామని ఆయన చెప్పారు. దేశవాళీ క్రికెటర్లకు బోర్డు నుంచి అన్ని రకాల సదుపాయాలు, ఆర్థిక అండదండలు లభిస్తున్నాయని, కొత్తగా దేశవాళీ క్రికెటర్లకు సెంట్రల్ కాంట్రాక్టులు ఇవ్వాల్సిన అవసరం లేదని బిన్నీ తెలిపారు. 2008లో ముంబైలో పాక్ ఉగ్రమూక దాడి తర్వాత భారత జట్టు పాక్‌లో పర్యటించలేదు. ద్వైపాక్షిక సిరీస్ కూడా ఆడలేదు. కేవలం ఐసీసీ, ఆసియా టోర్నీల్లో మాత్రమే ఇరు జట్లు ఆడుతున్నాయి.

ఇప్పుడే చెప్పలేం...

పాకిస్తాన్ పర్యటనపై కేంద్ర హోంశాఖే నిర్ణయిస్తుందని క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ శాఖ నుంచి ఆమోదం కష్టమేనన్నారు. 'ఇది భద్రతాపరమైన అంశం. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించిన జట్లన్నీ భారత్‌కు వచ్చి ఆడతాయి. పాకిస్తాన్ కూడా వస్తుంది. ఈ అంశంలో భారత్‌కు ఎవరి మాట వినే అవసరం లేదు. ఎవరి నిర్దేశనలు అక్కర్లేదు. అయితే వన్డే వరల్డ్ కప్ ఇంకా చాలా దూరంలో ఉంది. తగిన సమయం వచ్చినప్పుడు నిర్ణయం వస్తుంది' అని అన్నారు.

ఈస్ట్ బెంగాల్ బోణీ

ఐఎస్ఎల్ ఫుట్‌బాల్ టోర్నీ

గువాహటి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈస్ట్ బెంగాల్ మూడో మ్యాచ్‌లో బోణీ కొట్టింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ 3–1 స్కోరుతో నార్త్ ఈస్ట్ యునైటెడ్‌పై గెలుపొందింది. ఆట మొదలైన 11 నిమిషాలకే క్లెయిటన్ సిల్వా చేసి గోల్‌తో ఈస్ట్ బెంగాల్ క్లబ్ 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇదే స్కోరుతో తొలి అర్ధభాగం ముగిసింది. రెండో అర్ధభాగంలో బెంగాల్ స్ట్రయికర్లు తమ దాడులకు పదును పెట్టడంతో ఆధిక్యం పెరిగింది. 53వ నిమిషంలో చరిస్ కిరియకో, ఆట ముగిసే దశలో జోర్డాన్ డోహెర్టీ (84వ ని.) గోల్ చేయడంతో ఈస్ట్ బెంగాల్ క్లబ్ 3–0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. నార్త్ ఈస్ట్ తరఫున నమోదైన గోల్‌ను ఇంజ్యూరి టైమ్ (90+2వ ని.)లో మ్యాట్ డోహెర్టీ సాధించాడు. నేటి మ్యాచ్‌లో చెన్నైయిన్‌తో గోవా ఎఫ్‌సీ తలపడుతుంది.



ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా జగదేవిపేటలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



కాకినాడ జిల్లా సర్పవరంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్దా ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ గురువారం నాయకులు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజలు చెప్పారు.



నంద్యాల జిల్లా కలుగొట్ల గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



అన్నమయ్య జిల్లా గోరంట్లపల్లెలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

క్లుప్తంగా

సీఆర్‌డీఏ చట్ట సవరణ హర్షణీయం

753వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: రాజధానిలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 753వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో పలువురు మాట్లాడారు. కులవాదుల కుట్రలకు వత్తాసు పలుకుతున్న చంద్రబాబు అండ్‌కో, ఎల్లో మీడియాకు ఇది చెంపపెట్టని తెలిపారు. 753 రోజులుగా శ్రమే పెట్టుబడిగా బహుజనులు చేస్తున్న ఉద్యమానికి.. ఇది పాక్షిక విజయమని, త్వరలోనే మూడు రాజధానులు కూడా సాధించి తీరతామని ధీమా వ్యక్తం చేశారు. విశాఖలో జరుగనున్న రౌండ్ టేబుల్ సమావేశం సింహగర్జన పోస్టర్‌ను దీక్షా శిబిరంలో ఆవిష్కరించారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోసి, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, రాజ్‌కుమార్, బీవీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనతోనే మా పొత్తు

- పవన్, చంద్రబాబు కలయికకు.. పొత్తుతో సంబంధం లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



ఒంగోలు: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబుల కలయికకు, రాజకీయ పొత్తులకు ఎలాంటి సంబంధం లేదని, తమ పార్టీ పొత్తు జనసేనతోనేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టం చేశారు. ఒంగోలులో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ జనసేనతో పొత్తుతోనే బీజేపీ 2024 ఎన్నికలకు వెళుతుందని చెప్పారు. ఏపీ, అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఉత్తరాంధ్రలో అమరావతి రైతుల పాదయాత్రకు ఏమాత్రం ఆటంకాలు కలిగించినా సహించేదిలేదన్నారు. వికేంద్రీకరణ అని సీఎం జగన్ చెబుతున్న అంశం బూటకమన్నారు. యూపీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని విభజించి తీరని అన్యాయం చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీకి ఏపీలో జోడో యాత్ర చేసే నైతిక హక్కులేదన్నారు. పవన్‌కళ్యాణ్–టీడీపీ పొత్తు ఖరారైనట్లు, తాను ఢిల్లీ వెళ్లినట్టు, కన్నా లక్ష్మీనారాయణ పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారమంతా మీడియా సృష్టేనని సోము వీర్రాజు స్పష్టంచేశారు.

నేటి నుంచి ట్రయల్ రన్‌తో ఫ్యామిలీ డాక్టర్

పల్లె ప్రజలకు ఇంటివద్దే వైద్య సేవలు

- వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి సాంత్వన
- మధ్యాహ్నం వరకు ఓపీ.. ఆ తరువాత ఇళ్ల సందర్శన
- నెలకు రెండు సార్లు గ్రామాలకు పీహెచ్‌సీ డాక్టర్లు
- ఇద్దరు వైద్యులకు సచివాలయాల విభజన
- చిన్న చిన్న సమస్యలుంటే సంక్రాంతి లేదా ఉగాదిలోగా పరిష్కరించేలా చర్యలు
- ఆ తరువాత సీఎం చేతులమీదుగా ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రారంభించేలా సన్నాహాలు

సాక్షి, అమరావతి: ప్రజలు, ప్రభుత్వ వైద్యుల మధ్య బంధాన్ని బలపరచడం ద్వారా మరింత మెరుగ్గా ఆరోగ్య సంరక్షణపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రజలు చిన్న అనారోగ్యాలకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, పెద్దాస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంతూరిలోనే వైద్య సేవలు పొందేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మకంగా 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని శుక్రవారం నుంచి ట్రయల్ రన్ ప్రాతిపదికన మొదలు పెడుతోంది. ఇందుకోసం వైద్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ట్రయల్ రన్ ప్రక్రియలో ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలుంటే సంక్రాంతి లేదా ఉగాది నాటికి సరిదిద్ది ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తారు. ఈ విధానం లక్ష్యం, ఎవరి పాత్ర ఏమిటి? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్ల నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా పలుమార్లు శిక్షణ ఇచ్చారు. ప్రత్యేకంగా యాప్ కూడా సిద్ధం చేశారు.



ఏమిటీ ఫ్యామిలీ డాక్టర్?

సాధారణంగా ఆర్థిక స్థితి మెరుగ్గా ఉన్న కుటుంబాలు స్వల్ప అనారోగ్య సమస్య తలెత్తినా తమకు బాగా పరిచయం ఉన్న ఒక వైద్యుడిని ఫ్యామిలీ డాక్టర్‌గా ఎంచుకుని సంప్రదిస్తాయి. లక్షణాల ఆధారంగా జబ్బును గుర్తించి చిన్న సమస్యలైతే ప్రాథమిక వైద్యం అందించి స్పెషలిస్ట్ వైద్యం అవసరమైతే ఆయన రిఫర్ చేస్తారు. ఇలా వారి ఆరోగ్యం పట్ల కుటుంబ వైద్యుడు నిరంతరం శ్రద్ధ తీసుకుంటారు. ఆ కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్యంపై ఆయనకు సమగ్ర అవగాహన ఉంటుంది. తద్వారా ఒక చక్కటి అనుబంధం ఏర్పడుతుంది. ఇదే తరహాలో గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ అందించాలనేది ఫ్యామిలీ డాక్టర్ విధానం లక్ష్యం.

ఎలా నిర్వహిస్తారు..?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది కలిపి 14 మంది ఉండేలా చర్యలు తీసుకుంది. పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులకు ఆ పరిధిలోని గ్రామ సచివాలయాలను విభజిస్తారు. వైద్యులు తమకు కేటాయించిన సచివాలయాలను నెలలో రెండు సార్లు సందర్శిస్తారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)తో పాటు గ్రామానికి వెళ్లి రోజంతా అక్కడే ఉండి ప్రజలకు వైద్య సేవలు అందచేస్తారు. మధ్యాహ్నం వరకూ 104 ఎంఎంయూ వద్ద ఓపీలు నిర్వహిస్తారు. ఆ తరువాత నిర్దేశిత గృహాలను సందర్శిస్తారు. అంగన్‌వాడీ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తారు.

67 రకాల మందులు.. 14 రకాల పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)తో పాటు సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వీటిలో అందుబాటులో ఉంటారు. ప్రతి క్లినిక్‌లో 67 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలకు సంబంధించిన కిట్‌లు ఉంటాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో విలేజ్ క్లినిక్స్ కీలక పాత్ర పోషిస్తాయి. సీహెచ్‌వో, ఏఎన్‌ఎం, ఆశాలు వైద్యుడు గ్రామానికి వచ్చే ముందు రోజే ప్రజలకు సమాచారం అందజేస్తారు. బాలింతలు, గర్భిణులు, సాంక్రమిక, అసాంక్రమిక సమస్యలతో బాధపడే వారికి వైద్య సేవలు అందేలా చూస్తారు.

వైద్యులకు ఫోన్లు

వైద్యుడు గ్రామానికి రాని రోజుల్లో ప్రజలకు ఏవైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే సంప్రదించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పీహెచ్‌సీ వైద్యుడికి మొబైల్ ఫోన్‌ను ప్రభుత్వం సమకూర్చింది. రాష్ట్రవ్యాప్తంగా 1,142 పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులకు సుమారు రూ.3 కోట్లతో 2,300 ఫోన్లను అందజేశారు. వైద్యుడు మారినా ఫోన్ నంబర్ మారకుండా శాశ్వత నంబర్ కేటాయించారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్/సచివాలయంలో ఆ గ్రామానికి కేటాయించిన వైద్యుడు, ఫోన్ నంబర్, ఇతర వివరాలను ప్రదర్శిస్తారు.

వైద్యుల విధులు

- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఔట్‌పేషెంట్ సేవలు. బీపీ, షుగర్, ఇతర జీవన శైలి జబ్బుల రోగులకు రెగ్యులర్ చెకప్.
- గర్భిణులు, బాలింతలకు యాంటీ నేటల్, పోస్ట్ నేటల్ హెల్త్ చెకప్స్. నవజాత, శిశు సంరక్షణ. అంగన్‌వాడీలను సందర్శించి రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి పరిశీలన.
- పిల్లల్లో ఎదుగుదల, పౌష్టికాహార లోపాలను గుర్తించేందుకు పరీక్షలు.
- మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు హోమ్ విజిట్స్. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఫాలో అప్ సేవలు.
- మంచానికి పరిమితం అయిన వృద్ధులు, వికలాంగులు, ఇతర రోగులకు ఇళ్ల వద్దే వైద్య సేవలు. క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పాలియేటివ్ కేర్ సేవలు.
- పాఠశాల విద్యార్థులకు జనరల్ చెకప్. రక్తహీనత నివారణకు ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీపై పర్యవేక్షణ.

సీహెచ్‌వో

- టెలీ మెడిసిన్ ద్వారా గైనిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, స్పెషలిస్ట్ సేవలు ప్రజలకు అందించడం. 30 ఏళ్లు పైబడిన వారిలో బీపీ, షుగర్, క్యాన్సర్ లాంటి జబ్బులను గుర్తించేందుకు స్క్రీనింగ్. మొత్తంగా గ్రామ స్థాయిలో 12 రకాల వైద్య సేవలను ప్రజలకు అందిస్తారు.

ఏఎన్‌ఎం

- గ్రామ ఆరోగ్య మిత్రగా వ్యవహరిస్తారు. మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు రిఫర్ చేసిన ఆరోగ్యశ్రీ కేసులను ఫాలోఅప్ చేస్తారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన రోగులకు సీఎం వైఎస్ జగన్ సందేశంతో కూడిన లేఖలను అందజేస్తారు. ఆరోగ్యశ్రీ సేవలపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. 104 ఎంఎంయూ వద్ద వైద్య సేవలు అందించాల్సిన యాంటీనేటల్, పోస్ట్ నేటల్ కేసులను నిర్ధారిస్తారు.
- ఆశా వర్కర్ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు పొందడానికి ప్రజలను సమీకరిస్తారు. బాలింతలు, గర్భిణులు, పిల్లలకు వైద్యసేవలు అందేలా చూస్తారు. వైద్యుడు ఇళ్లను సందర్శించేందుకు మంచానికే పరిమితమైనవారు, వృద్ధుల వివరాలు సేకరిస్తారు.

సమర్థంగా అమలుకు ట్రయల్ రన్

ఫ్యామిలీ డాక్టర్ విధానం సీఎం వైఎస్ జగన్ మానస పుత్రిక. దీన్ని సమర్థంగా అమలు చేసేందుకు తొలుత ట్రయల్ రన్ చేపట్టాలని నిర్ణయించాం. క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకుని మెరుగ్గా తీర్చిదిద్దుతాం. ఈ ఏడాది ఆఖరు వరకూ ట్రయల్ రన్ ఉంటుంది. ఎక్కడైనా సమస్యలుంటే పరిష్కరించి కొత్త సంవత్సరంలో సమర్థంగా కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు. ఈ లోగా కొత్తగా కొనుగోలు చేస్తున్న అదనపు 104 ఎంఎంయూలు అందుబాటులోకి వస్తాయి. న్యాయపరమైన ఇబ్బందులతో ఆగిన సీహెచ్‌వోల నియామకం పూర్తవుతుంది. ట్రయల్ రన్ కోసం ప్రతి జిల్లాకు అడిషనల్ డీఎంహెచ్‌వో స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా ఎంపిక చేశాం. ఎక్కడైనా పీహెచ్‌సీ వైద్యుడు సెలవు పెడితే ఆ రోజు సేవలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. నియోజకవర్గానికి ఒకరు చొప్పున 175 మంది వైద్యులను ఆయా సీహెచ్‌సీల్లో ఉంచుతున్నాం. జిల్లాకు నలుగురు చొప్పున వైద్యులను డీఎంహెచ్‌వోల కార్యాలయాలకు కేటాయించాం. వీరి సేవలను పీహెచ్‌సీల్లో వైద్యులు సెలవులు పెట్టినప్పుడు ప్రత్యామ్నాయం కింద వినియోగించుకుంటాం.

– ఎం.టి.కృష్ణబాబు, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో కార్యక్రమం
- పాల్గొననున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్నారు. ఏటా అక్టోబర్ 21న నిర్వహించే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు పోలీసు అమరవీరుల స్మృతి పరేడ్‌ను నిర్వహిస్తారు. ఈ పరేడ్‌కు సీఎం వైఎస్ జగన్ హాజరవుతారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి తోపాటు పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొంటారు. గతేడాది కాలంలో అమరులైన పోలీసు, కేంద్ర పారామిలటరీ బలగాలకు చెందిన అమరవీరులను స్మరించుకుంటారు. శుక్రవారం ప్రారంభమయ్యే అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ఈ నెల 31న నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవంతో ముగుస్తాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లా పోలీస్, కమిషనరేట్ కార్యాలయాల్లో ఈ సంస్మరణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అమరవీరుల త్యాగాలను తెలియజేస్తూ అక్టోబర్ 22 నుంచి 31 వరకు విజయవాడలో 'ఓపెన్ హౌస్' పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. జిల్లా కేంద్రాల్లో ఈ నెల 26, 27 తేదీల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ నెల 24 నుంచి 27 వరకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 28న రక్తదాన శిబిరాలను నిర్వహిస్తారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట..

రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పోలీసు కుటుంబాల ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ భద్రతకు ప్రాధాన్యమిస్తూ పలు పథకాలను అమలు చేస్తోంది. పోలీసు ఆరోగ్య పథకం ద్వారా ఏపీలోని 244 నెట్‌వర్క్ మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతోపాటు హైదరాబాద్‌లోని 16 కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలను అందిస్తోంది. 2021–22లో మొత్తం 11,120 మందికి ఈ పథకం కింద మొత్తం రూ.37.12 కోట్ల విలువైన వైద్య సేవలను ఉచితంగా అందించింది. ఇందులో పోలీసులు 3,788 మంది, వారి జీవిత భాగస్వాములు 2,934 మంది, పిల్లలు 1,364 మంది, తల్లిదండ్రులు 3,034 మంది ఉన్నారు. వారితోపాటు మరో 27 మంది రోగులకు ప్రత్యేక అనుమతుల ద్వారా రూ.53 లక్షలు కార్పస్ ఫండ్ కింద ప్రభుత్వం ఖర్చు చేసింది. ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకులతో పోలీసు శాఖ ఎంవోయూలు కుదుర్చుకుంది. విధి నిర్వహణలో ఉంటూ మృతి చెందిన పోలీసు కుటుంబాల్లోని వారసులకు కారుణ్య నియామకాలు కింద పోలీసు శాఖ సత్వరం ఉద్యోగాలు కల్పిస్తోంది. హోంగార్డులు మరణిస్తే రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియాను ఇస్తున్నారు.

రెండో రోజు ఇంటర్వ్యూలకు 462 మంది హాజరు

- కొనసాగుతున్న స్పెషలిస్ట్, సూపర్ స్పెషాలిటీ వైద్య పోస్టుల భర్తీ
- తొలి రోజు 161 పోస్టులు భర్తీ

సాక్షి, అమరావతి: వైద్య శాఖలోని డీఎంఈ, ఏపీవీవీపీ విభాగాల్లో స్పెషలిస్ట్, సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకానికి నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు గురువారం రెండో రోజు 462 మంది వైద్యులు హాజరయ్యారు. డీఎంఈలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏపీవీవీపీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల నియామకానికి బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రెండో రోజు డీఎంఈలో 61 పోస్టులు నోటిఫై చేయగా 304 మంది, ఏపీవీవీపీలో 137 పోస్టులు నోటిఫై చేయగా 158 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించి మెరిట్ జాబితాలు ప్రదర్శించి, వీటిపై అభ్యంతరాల స్వీకరణ అనంతరం రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల ఆధారంగా పోస్టింగ్‌లు ఇచ్చారు.



వైద్యురాలికి నియామక పత్రం అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు

తొలి రోజు 161 పోస్టులు భర్తీ

తొలి రోజైన బుధవారం అర్ధరాత్రి వరకు ఇంటర్వ్యూలు కొనసాగాయి. పలువురు అభ్యర్థులకు గురువారం పోస్టింగ్‌లు ఇచ్చారు. తొలి రోజు 161 పోస్టులు భర్తీ అయినట్టు ఏపీవీవీపీ కమిషనర్, ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. తొలి రోజు డీఎంఈలో 96 పోస్టులు నోటిఫై చేయగా 45, ఏపీవీవీపీలో 173 పోస్టులు నోటిఫై చేయగా 116 భర్తీ చేశామన్నారు. శుక్రవారం కూడా ఇంటర్వ్యూలు కొనసాగుతాయి.

రాష్ట్రంలో పార్టీలన్నీ బీజేపీ ఆధీనంలోనే..

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వెల్లడి

మంత్రాలయం/ఎమ్మిగనూరు: రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ భారతీయ జనతా పార్టీ ఆధీనంలో ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆ పార్టీల గురించి తాను మాట్లాడదలచుకోలేదన్నారు. రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న జోడోయాత్ర గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ స్కూల్ నుంచి మంత్రాలయం మండలం కల్లుదేవకుంట వరకు సాగింది. కల్లుదేవకుంటలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో మతతత్వ శక్తులపై కాంగ్రెస్ పోరాటం చేస్తోందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, ప్రజల గొంతును వినడం లేదని విమర్శించారు. అంతకుముందు ముగతి గ్రామంలో తనను కలసిన విశాఖ ఉక్కు కార్మికులతో రాహుల్‌గాంధీ మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని, ఆ బిల్లును పార్లమెంట్‌లో అడ్డుకుంటామని చెప్పారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనేది తమ విధానం కూడా అని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ) ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరుతూ రాహుల్‌గాంధీకి లైఫ్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ ఏజెన్సీ ఆఫ్ ఇండియా సభ్యులు శ్రీనివాసాచారి, వెంకటేశ్వరరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. సర్పంచ్‌ల సంఘం నాయకులు వీరప్రతాప్‌రెడ్డి ,రంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, దండు వీరయ్యమాదిగ కూడా రాహుల్‌కు వినతిపత్రాలిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదాకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని రాహుల్ స్పష్టం చేశారని ప్రత్యేక హోదా సాధనసమితి నాయకుడు చలసాని శ్రీనివాస్ తెలిపారు. కాగా, రాహుల్‌గాంధీ గురువారం రాత్రి రాఘవేంద్రస్వామి మఠానికి వెళ్లారు. గ్రామదేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.



కర్నూలు జిల్లా కల్లుదేవకుంట సభలో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

కాఫీ ఇలా చేయడం నేర్చుకోండి

ఎమ్మిగనూరు బస్టాండ్ ఎదురుగా ఉన్న రాజేశ్వరి హోటల్‌లో ఉదయం అల్పాహారం (ఉప్మా, వడ) తిని కాఫీ తాగిన రాహుల్.. 'ఇక్కడ కాఫీ బాగా చేశారు.. ఇలా చేయడం నేర్చుకోండి..' అని తన వ్యక్తిగత వంట మనిషికి సూచించారు. హోటల్ యజమాని కొండయ్య కుటుంబసభ్యులు, వర్కర్స్‌తో ఫొటోలు దిగారు. పార్టీ నేతలు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేష్, పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్, నాయకులు కె.వి.పి.రామచంద్రరావు, పళ్లంరాజు, సుబ్బరామిరెడ్డి, జె.డి.శీలం, కనుమూరి బాపిరాజు, గిడుగు రుద్రరాజు, తులసీరెడ్డి, రాహుల్ వ్యక్తిగత కార్యదర్శి కొప్పుల రాజు, పార్టీ జిల్లా నేతలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగార్థులకు.. సీఎం దీపావళి కానుక

- 6,511 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- ఇందులో ఎస్సై పోస్టులు 411, కానిస్టేబుల్ పోస్టులు 6,100
- హోంశాఖ ఉత్తర్వులు జారీ

భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు..

ఎస్సై (సివిల్)	కానిస్టేబుల్ (సివిల్)
315	3,580
ఆర్‌ఎస్సై	కానిస్టేబుల్ (ఏపీఎస్పీ)
96	2,520
మొత్తం 6,511	

సాక్షి, అమరావతి: పోలీసు కావాలని నిరీక్షిస్తున్న నిరుద్యోగ యువతకు సీఎం వైఎస్ జగన్ దీపావళి కానుక ఇచ్చారు. పోలీసు శాఖలో ఏకంగా 6,511 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అనుమతించిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలు జారీచేశారు. ఇక పోలీస్ శాఖలో ఏటా 6,500 పోస్టులు భర్తీచేయాలని కొద్దినెలల క్రితం జరిగిన సమీక్ష సమావేశంలో హోంశాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో మొదటి దశలో 6,511 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

మూడేళ్లలో 6.16 లక్షల పోస్టుల భర్తీ

ఇక 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటుచేసి దేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా ఏకంగా 1.25 లక్షల శాశ్వత ప్రభుత్వోద్యోగాలను భర్తీచేసింది. అలాగే, 2.60 లక్షల వలంటీర్లనూ నియమించింది. ఇలా అన్ని ప్రభుత్వ శాఖల్లో కలిపి శాశ్వత, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియామకాల ద్వారా మొత్తం 6,16,323 పోస్టులను భర్తీచేసింది. వీటిలో శాశ్వత ఉద్యోగాలు 2,06,638, కాంట్రాక్టు ఉద్యోగాలు 37,908, ఔట్‌సోర్సింగ్/ఇతర ఉద్యోగాలు 3,71,777 ఉన్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఏకంగా 58,388 మందిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించింది. వైద్యశాఖలో 40,676, ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా 95,212, విద్యుత్ శాఖలో 8,333, విద్యా శాఖలో 6,361, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో 3,500 పోస్టులు భర్తీ చేయగా మిగిలిన పోస్టులను ఇతర శాఖల్లో భర్తీచేశారు.

కోట్లాది చెప్పులు పైకిలేస్తాయ్

పవన్.. తట్టుకోలేవ్!

మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: 'సినిమాల మాదిరే రాజకీయాలు అనుకుంటే పొరపాటు. అక్కడ నీ డైలాగులు పేలవచ్చు. అలా అని బయట వాడితే కుదరదు. నోరు అదుపులో పెట్టుకోకపోతే కోట్లాది నోర్లు లేస్తాయ్' అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మానకృష్ణదాస్ హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంతామరాపల్లిలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాము శాంతియుతంగా ఉంటున్నాం తప్ప చేతకాని వాళ్లం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. 'మొన్న ఒక చెప్పు తీశావు.. అదే మేం సైగ చేస్తే.. కొన్ని కోట్లాది చెప్పులు పైకి లేస్తాయి. నువ్వు తట్టుకోలేవు పవన్‌కళ్యాణ్' అని హెచ్చరించారు. తాము విశాఖ పాలనా రాజధాని కావాలంటూ ఉద్యమిస్తున్నామని, అదే సమయంలో ఉద్యమం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలన్న కుట్రపూరిత ఆలోచనతో ఇక్కడికొచ్చి దాదాగిరి, మంత్రులపై దాడులు చేస్తే.. మేం ఊరుకోవాలా.. అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రుల ఆకాంక్షలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే.. ప్రజలే బుద్ధి చెబుతారు పవన్‌కళ్యాణ్.. అంటూ ధర్మాన కృష్ణదాస్ హెచ్చరించారు.



విద్యార్థి గర్జన

వికేంద్రీకరణకు మద్దతుగా విద్యార్థి లోకం జై కొట్టింది. విజయనగరం జిల్లా గజపతినగరం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై గురువారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి మూడు రాజధానులకు మద్దతుగా నినదించారు. ఉత్తరాంధ్రకు మేలుచేసేలా విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రకటించారు. అడ్డుకుంటే వారి భరతం పడతామని హెచ్చరించారు.

– గజపతినగరం

మూడు పెళ్లిళ్లు చేసుకోమనడం సిగ్గుచేటు

మంత్రి ఉషశ్రీ చరణ్



సాక్షి, అమరావతి: డబ్బులిచ్చి విడాకులిచ్చి మరీ పెళ్లిళ్లు చేసుకున్నానని, మీరు కూడా మూడు పెళ్లిళ్లు చేసుకోండని పవన్ కళ్యాణ్ చెప్పడం సిగ్గు చేటు అని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మండిపడ్డారు. ఆమె గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. పవన్ వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని, యువతను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. మహిళలు ఆయనకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలతో జనం మదిలో సుస్థిర స్థానం దక్కుతుండటాన్ని చూసి పవన్, బాబు ఓర్వలేకపోతున్నారని అన్నారు. చెప్పు చూపిస్తూ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులను దుర్భాషలాడటం పవన్ దిగజారుడుతనానికి పరాకాష్ట అని అన్నారు. పవన్ గ్లాసు గుర్తు నుంచి చెప్పు గుర్తుకు మార్చుకున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు.

సాఫ్ట్‌వేర్ కొలువుల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సత్తా

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ నుంచి 23 మంది ఎంపిక



అత్యధిక స్టైఫండ్‌తో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మునిచిత్రను అభినందిస్తున్న ఇడుపులపాయ డైరెక్టర్ ఆచార్య కె.సంధ్యారాణి

నూజివీడు: వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో కొలువులు సాధించారు. ఇడుపులపాయ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ విద్యార్థి సాదు మునిచిత్ర అమెజాన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైంది. ఈమెకు నెలకు రూ.1.10 లక్షల స్టైఫండ్‌ను కంపెనీ ఇవ్వనున్నట్లు ఇడుపులపాయ డైరెక్టర్ ఆచార్య కె.సంధ్యారాణి తెలిపారు. ఈ విద్యార్థిని స్వగ్రామం తిరుపతి జిల్లా నారాయణవనం. తండ్రి మునిబాబు రోజువారీ మగ్గం కూలీగా పని చేస్తుండగా.. తల్లి శంకరమ్మ గృహిణి.

నెలకు రూ.40 వేల స్టైఫండ్‌తో 22 మంది

కాగా, ఇడుపులపాయ క్యాంపస్‌కు చెందిన మరో 22 మంది విద్యార్థులు నెలకు రూ.40 వేల స్టైఫండ్‌తో పలు కంపెనీలకు ఎంపికయ్యారు. ఇంటెల్ కంపెనీ 11 మంది విద్యార్థులను, సినాప్సిస్ కంపెనీ ఏడుగురు విద్యార్థులను, థాట్ వర్క్స్ కంపెనీ నలుగురు విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి. ఆయా విద్యార్థులను ఆర్జీయూకేటీ చాన్సలర్ కేసీ రెడ్డి, వైస్ చాన్సలర్ కె.హేమచంద్రారెడ్డి, డైరెక్టర్ కె.సంధ్యారాణి అభినందించారు.

రైతులకు 'మద్దతు' లక్ష్యంగా ధాన్యం సేకరణ

- రైతు సహాయకులుగా వలంటీర్లు
- పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ వీరపాండియన్

సాక్షి, అమరావతి: ధాన్యం సేకరణలో ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రైతులకు మద్దతు ధర కల్పించేలా అధికారులు పనిచేయాలని పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ వీరపాండియన్ కోరారు. ధాన్యం కొనుగోళ్లలో వలంటీర్ల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతులు సులభంగా తమ పంట ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వలంటీర్లు రైతు సహాయకులుగా సేవలందిస్తారని చెప్పారు. ఆర్బీకేల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, సేకరణ ఏజెన్సీకి చెందిన టెక్నికల్ అసిస్టెంట్‌తోపాటు వలంటీర్లు ధాన్యం సేకరణ అసిస్టెంట్, రూట్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తారని తెలిపారు. ఇప్పటికే వారి విధివిధానాలను ఖరారు చేశామన్నారు. ధాన్యం సేకరణ అసిస్టెంట్‌గా పనిచేసే వలంటీర్ కల్లాల్లోని శాంపిళ్లను తీసుకొచ్చి తేమ శాతం వంటి ఐదురకాల పరీక్షలు నిర్వహించడంతోపాటు ముందుగానే ధాన్యం నింపేందుకు అవసరమైన గోతాలు, లోడింగ్ చేసేందుకు హమాలీలు, రవాణా వాహనాన్ని అందుబాటులో ఉంచుతారన్నారు. రూట్ అసిస్టెంట్ ధాన్యం బస్తాలను తూకం వేసి డ్రైవర్‌తోపాటే వాహనంలో మిల్లులకు వెళ్లి కస్టోడియన్ అధికారికి అప్పగిస్తారని చెప్పారు. ఇక్కడ మిల్లరు ధాన్యాన్ని పరీక్షించుకున్న సమయంలో ఏదైనా తేడావస్తే రైతుకు ఎటువంటి సంబంధం లేకుండా ఆర్బీకే, కస్టోడియన్ అధికారులే సరిచేస్తారని తెలిపారు. ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి ప్రక్రియను ఫొటోతీసి అప్‌లోడ్ చేస్తారని చెప్పారు. ధాన్యాన్ని సమాన పరిమాణంలో బస్తాల్లో నింపి తూకం వేయనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో బస్తాల లెక్కలు చెప్పి మిల్లర్లు మోసానికి పాల్పడే అవకాశం ఉండదని ఆయన పేర్కొన్నారు.

2022-23 ఇయర్ ఆఫ్ బనానా..

ప్రకటించిన వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



మంత్రి కాకాణి

తాడేపల్లిగూడెం: 2022-23 సంవత్సరాన్ని ఇయర్ ఆఫ్ బనానాగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రకటించింది. పశ్చిమగోదావరి జిల్లాలోని వెంకట్రామన్న గూడెంలోని వర్సిటీలో గురువారం ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. కొవ్వూరులోని అరటి పరిశోధన స్థానం రూపొందించిన లోగో, ప్రత్యేక కరపత్రిక, ఆర్బీకేల్లో ప్రదర్శించే సమాచార పత్రికలను మంత్రి ఆవిష్కరించారు. ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాల్లో, సామాజిక, ఆర్థికాభివృద్ధిలో అరటికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. అరటి ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. 97,250 హెక్టార్ల సాగు విస్తీర్ణంతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మూడోస్థానంలో నిలిచిందన్నారు. అరటి సాగులో ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టేలా అంతా కలిసి పనిచేయాలని కోరారు. రాష్ట్ర ఉద్యాన కమిషనర్ డాక్టర్ ఎస్.ఎస్.శ్రీధర్, ఐసీఏఆర్ ఎన్‌సీఆర్బీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ హత్యకేసులో ముగ్గురి అరెస్టు



నిందితులతో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది

రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా శాంతినగర్‌లో ఈ నెల 15వ తేదీన జరిగిన మాజీ సర్పంచ్ దివిటి రామ్మోహన్ హత్యకేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. తన తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో మోడి శివతేజ అనే యువకుడు మంకు చంగల్‌రాయుడు, మంకు బాలసుబ్రమణ్యంతో కలిసి దివిటి రామ్మోహన్‌ను పథకం ప్రకారం హత్య చేశాడన్నారు. ముందుగా శివతేజ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడని, అనంతరం మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ముగ్గురినీ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు.

హయగ్రీవ సంస్థకు హైకోర్టు నోటీసులు

ప్రస్తుతానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమన్న సీజే ధర్మాసనం


సాక్షి, అమరావతి: విశాఖ జిల్లా ఎండాడ గ్రామ పరిధిలోని 12.50 ఎకరాల భూమిలో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ చేస్తున్న నిర్మాణాల విషయంలో ప్రస్తుతం ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు విషయంలో పూర్తి వివరాలు తెలుసుకున్న తరువాతే స్పందిస్తామని తెలిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ యాజమాన్యానికి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, విశాఖ కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఎండాడ గ్రామ పరిధిలోని 12.5 ఎకరాల భూమిలో అనాథ శరణాలయం, వృద్ధుల ఆశ్రమం నిర్మించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఆ భూమిని హయగ్రీవ ఫారమ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించారని.. ఈ కేటాయింపులను రద్దు చేసి భూమిని వెనక్కి తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎస్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం ఆ 12.5 ఎకరాల్లో 10 శాతం భూమిని అనాథ శరణాలయం, వృద్ధాశ్రమం నిర్మాణం కోసం ఉపయోగించాలని, మిగిలిన భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టి వాటిని వయోవృద్ధులకు మాత్రమే విక్రయించాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా ఆ భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ భూమిని హయగ్రీవకు కేటాయించడాన్ని జిల్లా కలెక్టర్ తప్పుపడుతూ.. ఆ కేటాయింపులను రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది.

23న తిరుపతి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు

● తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తిరుపతి-సికింద్రాబాద్ (07481/07482) ప్రత్యేక రైలు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 7.50 గంటలకు బయలుదేరి మర్నాడు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 24వ తేదీ సాయంత్రం 7.05 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మర్నాడు ఉదయం 8.10 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.





Cheil-13654/22

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 21 । అక్టోబర్ । 2022



అభి'రుచుల' సంగమం

ప్రపంచ చెఫ్ డే సందర్భంగా విజయవాడలోని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్‌లో గురువారం వంటల పోటీలు జరిగాయి.

-IIలో▸



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 40.0706 టీఎంసీలు. ఎగువ నుంచి 63,641 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 55,241 క్యూసెక్కులు వదులుతున్నారు.

తిరుపతమ్మ ఆలయ ఈఓగా శోభారాణి



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ ఆలయ ఈఓగా కె.శోభారాణి నియమితుల య్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఈఓగా అన్నవరం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ ఈఓ మూర్తి కొనసాగుతున్నారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు 1.25 లక్షల గాజుల విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడకు చెందిన భక్తులు గురువారం 1.25 లక్షల మట్టి గాజులను విరాళంగా సమర్పించారు. విజయవాడ కనకదుర్గ లలితా పారాయణ బృందం సభ్యులు గురువారం ఈఓ భ్రమరాంబను కలిసి ఈ గాజులను అందజేశారు. అమ్మవారి గాజుల అలంకరణకు వీటిని వినియోగించాలని కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ ఏఈఓ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు రూ.1.45 కోట్ల హుండీ ఆదాయం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): భక్తులు దుర్గమ్మకు హుండీల ద్వారా రూ.1.45 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. హుండీ కానుకల లెక్కింపు గురువారం మహా మండపం ఆరో అంతస్తులో జరిగింది. ఎనిమిది రోజులకు రూ.1,45,47,811 నగదు, 371 గ్రాముల బంగారం, 5.055 కిలోల వెండి లభించిందని ఆలయ ఈఓ భ్రమరాంబ తెలిపారు. కానుకల లెక్కింపులో ఆలయ అధికారులతో పాటు ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొన్నారు.


బాలల సైన్స్ కాంగ్రెస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం: బాలల సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కృష్ణాజిల్లా డీఈఓ తాహెరా సుల్తానా గురువారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యార్థులను సైన్సు పరిశోధనల వైపు ప్రోత్సహించేలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది భాగస్వాములయ్యేలా పాఠశాల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి మంచి ప్రాజెక్టులను రూపొందించి, ఆ వివరాలను అందజేయాలని పేర్కొన్నారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

రేపు ఉమ్మడి కృష్ణాజిల్లా ఖో-ఖో జట్ల ఎంపిక

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 22వ తేదీన ఉమ్మడి కృష్ణాజిల్లా స్త్రీ, పురుషుల ఖోఖో జట్లను ఎంపిక చేస్తామని ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల్లోపు క్రీడా ప్రాంగణానికి హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జట్లు ప్రకాశం జిల్లా ఈదర జెడ్పీ హైస్కూల్‌లో నవంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

పోలీస్ సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన



పటమట(విజయవాడ తూర్పు): స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించే పోలీసు అమరవీరుల సంస్మరణ సభ ఏర్పాట్లను మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని, ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేడియంలో వాకింగ్ ట్రాక్, వర్షం పడితే ఎక్కడా నీరు నిలబడకుండా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ విధానం, సైడ్ డ్రెయిన్స్‌లో మురుగునీటి పారుదల పర్యవేక్షించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సాధికాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, ఈఈ శ్రీనివాసు, ఏడీహెచ్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, పలువురు పోలీసులు అధికారులు కూడా ఏర్పాట్లను పరిశీలించారు.



బహిరంగ సభలో నిషేధిత భూముల సమస్య పరిష్కారంతో ప్లకార్డులు చూపి హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు (ఇన్‌సెట్) సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మురిసిన దివిసీమ

- పండుగ వాతావరణంలో సీఎం వైఎస్ జగన్ పర్యటన
- ముఖ్యమంత్రి సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- రైతులకు నిషేధిత భూముల విముక్తి పత్రాల పంపిణీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన దివిసీమకు సంతోషాలను తీసుకొచ్చింది. నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం చూపింది. ఆ భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ యాజమాన్య హక్కు పత్రాలు అందించింది. ముఖ్యమంత్రి ప్రకటించిన వరాలతో దివిసీమ పులకించింది. జననేత జగన్‌కు జేజేలు పలికింది.



నిషేధిత భూములకు క్లియరెన్స్ ఇస్తూ బటన్ నొక్కి జాబితా విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కలెక్టర్ రంజిత్‌బాషా. చిత్రంలో మంత్రులు ధర్మాన, రోజా, జోగి రమేష్, ఎంపీలు మోపిదేవి, బాలశౌరి, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఎమ్మెల్యేలు ఉదయభాను, సింహాద్రి రమేష్, పార్థసారథి, కైలే అనిల్, డీఎన్నార్

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివి సీమ పర్యటన వేడుకగా జరిగింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో నిషేధిత భూముల జాబితా నుంచి షరతులు గల పట్టా భూముల తొలగింపు కార్యక్రమం, సీఎం బహిరంగ సభ గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు నిషేధిత భూముల సమస్య పరిష్కార పత్రాలను అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,669 ఎకరాల నిషేధిత భూముల సమస్య పరిష్కారమవగా, కృష్ణా జిల్లాలో 18,384 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 2,840 ఎకరాలకు విముక్తి కలిగింది. ఒక్క అవనిగడ్డ నియోజకవర్గంలోనే 15,791 ఎకరాలకు సంబంధించి 10,119 మంది రైతులకు యాజమాన్య హక్కులు వచ్చాయి.

భూ సమస్యలకు స్వస్తి

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంస్కరణల వల్ల రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఎలాంటి భూ సమస్యలూ ఉండవని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి కొత్తేమీ కాదన్నారు. 2004 నుంచి 2009 వరకూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు ఏడు లక్షల ఎకరాలు పంపిణీ చేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిషేధిత భూముల సమస్య పరిష్కారం ద్వారా రాష్ట్రంలో 35,669 ఎకరాలకు విముక్తి కలిగించి 22,042 మంది రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపారని వివరించారు. తన మూడేళ్ల పాలనలో ఒక్క రూపాయి కూడా పక్కదారి పట్టకుండా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల కుటుంబాలకు రూ.1.60 లక్షల కోట్లు చేరాయని చెప్పారు. రెవెన్యూ శాఖలో సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలందరితో శహభాష్ అనిపించుకుంటామని మంత్రి ధర్మాన అన్నారు.

చంద్రబాబు వల్లే నిషేధిత భూముల సమస్య

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో చంద్రబాబు తన నియోజకవర్గంలో 15,791 ఎకరాలను నిషేధిత భూముల జాబితాలో చేర్చి రైతులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. అడిగిన వెంటనే నిషేధిత భూముల సమస్యను పరిష్కరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో దీవుల సమస్యల గురించి చెప్పగా ఎదురుమొండి వారధికి రూ.120 కోట్లు మంజూరు చేశారని, దివి సీమ భౌగోళిక పరిస్థితులు వివరించి సాగు, తాగు నీటి సమస్యలను చెప్పగా బండికోళ్లంక వద్ద బ్యారేజీ నిర్మాణానికి అంగీకారం తెలిపారని పేర్కొన్నారు. పవన్‌కల్యాణ్ సినిమాల్లో అత్తారింటికి దారేది అని వెతుక్కోగా, రాజకీయాల్లో చంద్రబాబు ఇంటికి దారేది అని గాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. వంగవీటి మోహనరంగాకు కాపులు సరైన రక్షణగా నిలవక పోవడం వల్లనే హత్యకు గురయ్యాడని చెప్పిన పవన్‌కల్యాణ్, రంగాను హత్య చేయించిన చంద్రబాబు పంచన ఎందుకు చేరాలనుకుంటున్నారని సూటిగా ప్రశ్నించారు.

పాల్గొన్న ప్రముఖులు వీరే..

సీఎం పర్యటనలో కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్.కె.రోజా, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం ఎంపీ వి.బాలశౌరి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్ కుమార్, రుహుల్లా, కల్పలత, ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని, కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు, వల్లభనేని వంశీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, కమ్మ, కాపు కార్పొరేషన్ల చైర్మన్లు చంద్రశేఖర్ (బుడ్డి), అడపా శేషు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, భూ పరిపాలన శాఖ ముఖ్య కమిషనర్ సాయిప్రసాద్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్, ఎస్పీ పి.జాషువా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పాల రాము, కడవకొల్లు నరసింహారావు, సింహాద్రి వికాస్ తదితరులు పాల్గొన్నారు.

18,384 ఎకరాలకు ప్రయోజనం

కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ.. నిషేధిత భూముల సమస్య పరిష్కారం వల్ల జిల్లాలో 18,384 ఎకరాలకు విముక్తి కలిగిందన్నారు. జిల్లాలో వంద శాతం ఈ-క్రాపింగ్ పూర్తి చేశామని తెలిపారు. ఈ మూడేళ్లలో రైతు సంక్షేమం కోసం రూ.620 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. జిల్లాలో 94 గ్రామాల్లో రీ సర్వే పూర్తికాగా, ఆరు గ్రామాల్లో జరుగుతోందని వివరించారు.



స్టాల్‌లో చిన్నారులను పలకరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రి రాక కోసం రోడ్డువెంబడి బారులుతీరిన ప్రజలు

సమస్య పరిష్కారం



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. 2002లో కొన్నాను. అప్పటికే ఆరుగురు రైతుల చేతులు మారింది. నా కుమార్తె వివాహ సమయంలో ఎకరం పొలం ఇచ్చాను. నిషేధిత భూముల జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్ జరగలేదు. నాకుమారుడి ఇంజినీరింగ్ చదువుల కోసం పొలం తనఖాపెట్టి లోను తీసుకుందామనుకుంటే ఇవ్వలేదు. సీఎం జగన్ నిర్ణయంతో నా లాంటి ఎందరో సమస్యలు పరిష్కారమయ్యాయి.

- కోలా నాగబాబు, విశ్వనాథపల్లి, కోడూరు మండలం

భూమిపై హక్కు వస్తుందనుకోలేదు



ఎప్పటి నుంచో ఉన్న నా మూడు ఎకరాల పొలాన్ని నిషేధిత జాబితాలో పెట్టేశారు. పొలం ఉన్నా అవసరాలకు ఉపయోగ పడలేదు. బ్యాంకులో లోన్లు ఇవ్వలేదు. 50 సంవత్సరాల నుంచి రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు ఈ తిప్పలు ఎందుకు తెచ్చారో తెలియదు. మేము బతికుండగా భూమిపై హక్కు వస్తుందని అనుకోలేదు. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

- జొన్నా రఘురామయ్య, పోటుమీద, కోడూరు మండలం

ముఖ్యమంత్రి పుణ్యం



మానాన్న నాకు రెండు ఎకరాల పొలం ఇచ్చారు. ఆరు సంవత్సరాల క్రితం లోను తీసుకోవడానికి బ్యాంక్‌కు వెళ్తే నిషేధిత జాబితాలో ఉండటంతో ఇవ్వలేదు. అప్పటి నుంచి సమస్య పరిష్కరించాలని వచ్చిన నాయకులందరినీ కోరాం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని మా భూముల సమస్య పరిష్కారమైంది.

- భావిశెట్టి రాజకుమారి, భావిశెట్టివారిపాలెం, కోడూరు మండలం

మనవరాలిని చదివించుకుంటా



మాకున్న అరెకరం పొలం నిషేధిత భూముల జాబితాలోకి వెళ్లింది. మా అల్లుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో మేము చెరువుల వద్ద పనిచేసి మనవరాలిని చదివిస్తున్నాం. చదువు కోసం పొలం అమ్ముదామంటే కొనడానికి ఎవరూ రాలేదు. సీఎం జగన్ నిర్ణయం వల్ల ఇప్పుడు పొలం అమ్మేందుకు అవకాశం కలిగింది. పొలం అమ్మి మనవరాలిని పెద్ద చదువులు చదివిస్తాం.

- అలపర్తి నాగమణి, భావదేవరపల్లి, నాగాయలంక మండలం

త్వరలో నక్కల కుటుంబాలకు కులధ్రువీకరణ పత్రాలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



నక్కల కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, డీఆర్వో మోహన్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో పూసలు, బొమ్మలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న నక్కల వారి కుటుంబాలకు త్వరలో కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. నక్కల కుటుంబాలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ గురువారం నక్కల కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో నక్కల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు నేరుగా బాధితులతో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నక్కల వారు పేదలన్నారు. సహజంగా కుటుంబ వ్యవస్థలో తండ్రికి ప్రధాన స్థానం ఉంటుందని, నక్కల కుటుంబాల్లో తల్లిని గౌరవించే సంస్కృతి తనకు నచ్చిందని పేర్కొన్నారు. తమిళనాడులో వారిని కురికారణ్ కులంగా పిలుస్తారని, నక్కల కుటుంబాల వారందరూ కలసి ఒక పేరు సూచిస్తే అదే పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు. తొలుత నక్కల కుటుంబ సభ్యులు తమ జీవన విధానాన్ని వివరించారు. తమ పూర్వీకులు నక్కలను వేటాడటం వల్ల తమకు నక్కల వారనే పేరు స్థిరపడిందని తెలిపారు. ప్రస్తుతం పూసలు అమ్మి జీవిచడంతో పూసలవాళ్లు అని పిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డులు జారీ చేసిందన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేక సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నామని వివరించారు. విజయవాడ రాజరాజేశ్వరిపేట, మైలవరం ప్రాంతాల్లో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయని, వైఎస్సార్ హయాంలో 52 కుటుంబాలకు పక్కా గృహాలను మంజూరు చేశారని కలెక్టర్ తెలిపారు. వివాహాల అనంతరం కుటుంబాలు పెరిగిన నేపథ్యంలో త్వరలో మరో 20 కుటుంబాలకు జగనన్న కాలనీల్లో పక్కాగృహాలు మంజూరు చేస్తామన్నారు. నక్కల కుటుంబాలు చేస్తున్న చిరువ్యాపారాలకు జగనన్న తోడు పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. నక్కల కుటుంబాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని అధికారులకు సూచించారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రుక్మాంగదయ్య, డీఈఓ సి.వి.రేణుక, డీఎస్ఓ కోమలిపద్మ, డీఎంహెచ్ఓ సుహాసిని, హౌసింగ్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

ఆదేశాలు జారీచేసిన దేవదాయ శాఖ కమిషనర్

- గత ఏడాది ఇంద్రకీలాద్రిపై ఏసీబీ దాడులు
- పట్టుబడిన 15 మంది ఉద్యోగులు, సిబ్బంది

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గగుడిలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (దుర్గగుడి)లో గత ఏడాది మార్చి 18 నుంచి 22వ తేదీ వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుర్గగుడిలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, ప్రసాదాలు, ప్రొవిజన్స్, పారిశుద్ధ్యం, టికెట్ల విక్రయాలు, అన్నదానం తదితర విభాగాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు వివిధ కేడర్లలో మొత్తం 15 మంది అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు ప్రాథమిక నివేదికను అందజేశారు. అప్పట్లో ఈ 15 మందిని రాష్ట్రంలోని పలు దేవస్థానాలకు బదిలీ చేశారు. నిబంధనల ప్రకారం ఈ ఉద్యోగులు కనీసం ఏడాది పాటు బదిలీ అయిన ఆలయాల్లో విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే వారు తమ పలుకుబడిని ఉపయోగించుకుని పది నెలలకే తిరిగి దుర్గగుడికి వచ్చేశారు. ఇటీవల ప్రభుత్వం పదేళ్ల పైబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేసిన విషయం విదితమే. విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడి ఇతర ఆలయాలకు వెళ్లి తిరిగి దుర్గగుడికి వచ్చిన వారికి ఈ బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వడం చర్చనీయాంశమైంది. వారిలో కొందరికి ఆలయ ఈఓ ఇటీవల ఉద్యోగోన్నతి కల్పించడం వివాదానికి కారణమైంది. అవినీతికి పాల్పడిన ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు గురువారం దుర్గగుడికి అందాయి. ఏసీబీ తనిఖీల్లో పట్టుబడిన 15 మందిలో ఒకరు ఉద్యోగ విరమణ చేశారు. మిగిలిన 14 మంది దుర్గగుడిలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఏసీబీ అధికారుల నివేదికల మేరకు ఉద్యోగులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కమిషనర్ తన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

క్లుప్తంగా

నేటి ట్రయల్ రన్‌పై సమీక్ష



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంపై శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ ట్రయల్ రన్ నిర్వహణపై గురువారం ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 23 పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించే ఈ ట్రయల్ రన్‌ను విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ట్రయల్‌రన్‌లో విధులను సమర్థంగా నిర్వహించి సామాన్యులకు సేవలు అందించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, జిల్లా మాతా, శిశు సంరక్షణ నోడల్ అధికారి డాక్టర్ పద్మావతి, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శృతి మౌనిక తదితరులు పాల్గొన్నారు. అనతరం పలు గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు గ్రామం కమ్మిలి వెంకటస్వామి వీధి బాలాజీ అపార్టుమెంట్స్‌లో వెనిగళ్ల సుబ్బారావు(58) ఉంటున్నాడు. అతను ఆటోనగర్‌లో పేయింటింగ్ పని చేస్తాడు. అయితే బుధవారం రాత్రి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సుబ్బారావు చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింటి వారు కిటికీలో నుంచి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తన తండ్రికి ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయని కుమారుడు నాగేంద్ర పోలీసులకు తెలిపాడు. ఈమేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనంలో దూరిన పాము

పామర్రు: బైక్‌లో విషపూరితమైన పసిరిక పాము దూరిన సంఘటన పామర్రులో గురువారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పామర్రు చాట్లవానిపురానికి చెందిన కనగాల సురేష్ తన బైక్‌పై పామర్రుసెంటర్‌కు వస్తున్నాడు. ఈ సమయంలో కాలుపైకి ఓ పాము పాకి.. బైక్ సీటు కిందకు వెళ్లి పోయింది. దీనిని గమనించిన సురేష్ తన బైక్‌ను పక్కనే ఆపి, సీటుని ఊడదీసి చూడగా విషపూరితమైన పసిరిక పాముగా గుర్తించాడు. స్పందించిన స్థానికులు అక్కడకు చేరుకుని దానిని హతమార్చారు.

బాలికపై అసభ్య ప్రవర్తన

- ఆటో డ్రైవర్, ఓ మైనర్ బాలుడు అరెస్ట్
- ఆటోలో బాలికను తరలిస్తుండగా స్పందించి కాపాడిన ఇరువురు ద్విచక్రవాహనదారులు
- గంట వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విజయపాల్

గన్నవరం: ఓ మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి ఆటోలో బలవంతంగా తీసుకువెళ్లడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్, అతడి స్నేహితుడైన మైనర్ బాలుడిని గన్నవరం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు డీఎస్పీ కె. విజయపాల్ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. గన్నవరం మండలంలోని కేసరపల్లికి చెందిన 17 ఏళ్ల బాలిక స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కళాశాలకు వెళ్లేందుకు గ్రామంలో సునీల్ ఆటో ఎక్కింది.

బస్టాండ్‌లో దించకుండా..

అయితే ఆటో డ్రైవర్ సునీల్, అతని స్నేహితుడైన మైనర్ బాలుడు ఆ బాలికను బస్టాండ్ వద్ద దించకుండా మాయమాటలు చెప్పి తేలప్రోలు మీదుగా ఉంగుటూరు వైపు తీసుకువెళ్లారు. మైనర్ బాలుడు ఆటోలో నడుపుతుండగా సునీల్ ఆ బాలిక పక్కనే కూర్చొని అతి చనువు ప్రదర్శించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయాందోళనకు గురైన ఆ బాలిక తనను కళాశాలకు తీసుకువెళ్లాలని ఎంత ప్రాధేయపడినప్పటికీ వారు వినిపించుకోలేదు.

స్పందించిన వాహనదారులు..

ఆటోలో ఆ బాలిక గట్టిగా కేకలు వేయడం గమనించిన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇరువురు ఆటోను వెంబడించారు. ఆటోను అడ్డగించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురికావడంతో పాటు ఆ బాలిక ఆటో నుంచి కిందకు దూకడంతో గాయపడింది. అనంతరం సునీల్‌తో పాటు మైనర్ బాలుడు ఆటోను వదిలివేసి అక్కడి నుంచి పరారయ్యారు.

జల్లెడ పట్టిన పోలీసులు..

ఈ ఘటనపై అప్రమత్తమైన కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు డీఎస్పీ కె. విజయపాల్ నాలుగు పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేసి సునీల్‌ను, మైనర్ బాలుడిని గంట వ్యవధిలోనే పట్టుకున్నారు. విచారణలో నిందితుడు సునీల్ ఆటోలో తరచుగా ఆ మైనర్ బాలిక కళాశాలకు వెళ్లివస్తుండడంతో పాటు ఆమెతో ఇన్‌స్టాగామ్‌లో స్నేహాన్ని కొనసాగిస్తున్నట్లు తేలింది. ఈ చనువుతోనే సునీల్ ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సునీల్‌ను అరెస్ట్ చూపించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఎస్ఐ రమేష్‌బాబు, ఉంగుటూరు స్టేషన్ కానిస్టేబుల్ భాస్కర్‌ను డీఎస్పీ అభినందించారు.

నమ్మించి.. వంచించాడు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ప్రేమించానన్నాడు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు.. దీంతో ఓ యువతి చేసుకున్న పెళ్లిని కూడా పెటాకులు చేసుకుని అతని కోసం వచ్చేసింది. కొంతకాలం పాటు మంచిగా ఉన్నట్లు నటించిన యువకుడు.. ఆమెను గర్భవతిని చేశాడు. తీరా ఇప్పుడు వేరే అమ్మాయిని పెళ్లి చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

చిట్టినగర్ వీరయ్య వీధికి చెందిన ఓ యువతి(19)ను అదే ప్రాంతానికి చెందిన జనమల రాజ్ కుమార్ ప్రేమిస్తున్నానని వెంట పడేవాడు. తర్వాత కొంత కాలానికి ఆమె కూడా అతనిపై ఇష్టాన్ని పెంచుకుంది. అయితే తల్లిదండ్రులు దీనికి అంగీకరించకపోవడంతో గత ఏడాది ఆగస్టులో ఆమెను వేరే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. అయితే ఆ యువతి తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని భర్తకు చెప్పడంతో ఇరు కుటుంబాల మధ్య అంగీకారంతో విడాకులు తీసుకున్నారు.

మళ్లీ ప్రేమించిన యువకుడితో..


విడాకుల అనంతరం గతంలో ప్రేమించిన రాజ్‌కుమార్ ఆమెకు మాయమాటలు చెప్పి లైంగికంగా కలవసాగాడు. గత మూడు నెలలుగా ఆమెకు అనారోగ్యంగా ఉండటంతో వైద్య పరీక్షలు చేయించుకోగా, గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. దీంతో తనను పెళ్లి చేసుకోవాలని రాజ్‌కుమార్‌ను ఆ యువతి ఒత్తిడి చేయగా తన ఇంట్లో వారికి ఒప్పించి పెళ్లి చేసుకుంటానని భరోసా ఇచ్చాడు. ఈ లోగా ఇంకో యువతిని పెళ్లి చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పు చెల్లించమన్నాడని.. చంపబోయారు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): తీసుకున్న అప్పు చెల్లించమన్నాడని ఓ వ్యక్తిని ఆటోతో గుద్ది చంపబోయిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన మోపుదేవి వెంకటరాజుకు విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన పీతా శివ నాగరాజు పరిచయం. శివనాగరాజుకు బంధువైన దుర్గ(35) అనే మహిళ కొంత కాలంగా వెంకటరాజుతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేది. ఈ క్రమంలో ఏడాది కిందట దుర్గ.. వెంకటరాజుకు ఫోన్ చేసి తనకు డబ్బులు అవసరమని, అప్పుగా డబ్బులు కావాలని కోరగా, రూ. 30 వేలు ఇచ్చాడు. కొన్ని నెలలుగా ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని వెంకటరాజు, దుర్గను అడుగుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం దుర్గ వెంకటరాజుకు ఫోన్ చేసి తాను రేపల్లెలో ఉన్నానని, విజయవాడ తీసుకెళ్లితే డబ్బులు ఇచ్చేస్తానని చెప్పింది. దీంతో వెంకటరాజు తన బైక్‌పై దుర్గను విజయవాడ తీసుకురాగా, కాళేశ్వరరావు మార్కెట్ వద్దకు వచ్చే సరికి దుర్గ తన బంధువులకు ఫోన్ చేసి డబ్బులు తీసుకురావాలని చెప్పింది.

ఆటోలో వచ్చి.. ఇష్టమొచ్చినట్లు కొట్టి..

కొంత సమయం తర్వాత ఓ నలుగురు ఆటోలో వచ్చారు. వారు వెంకటరాజును కొడుతూ ఆటోలోకి ఎక్కించుకున్నారు. దీంతో భయపడిన వెంకటరాజు తన వద్ద బైక్ తాళాలు, సెల్‌ఫోన్‌ను ఇచ్చేశాడు. అప్పటికీ ఆగని ఆ నలుగురు వెంకట రాజును ఇష్టం వచ్చినట్లు కొట్టసాగారు. అనంతరం చీకటి పడిన సమయంలో వన్‌టౌన్‌లోని పాడి వీధిలో వెంకటరాజును దింపి ఆటోతో బలంగా ఢీ కొట్టారు. దీంతో కుడికాలుకి తీవ్రగాయం కాగా బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. ఘటనలో కుడి కాలు విరిగి పోవడంతో బాధితుడికి వైద్యం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి జోగి రమేష్, జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక దంపతులు చిత్రంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బందరు ఎంపీ బాలశౌరి

• ఆత్మీయ ఆహ్వానం

కృష్ణా జిల్లాలోని అవనిగడ్డలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పర్యటించారు. 22ఏ(1) కింద ఉన్న నిషేధిత జాబితా నుంచి డీనోటిఫై చేసిన భూముల క్లియరెన్స్ పత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వానం పలుకుతున్న కృష్ణా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజల్లో పెరిగిన ఆరోగ్య స్పృహ

- కరోనా తర్వాత వ్యాయామం, ఆహార నియమాలపై దృష్టి
- నడకపై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- వ్యాధులను అదుపులో ఉంచుకునే యత్నం
- ఇంట్లోనే పరీక్షలు చేసుకుంటున్న వైనం



విజయవాడ బందర్ రోడ్డులో వాకింగ్ చేస్తున్న నగరవాసులు(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవనశైలి వ్యాధులపై నగర వాసులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు యాభై ఏళ్లు దాటిన వారికి వచ్చేవి. కానీ ఇప్పుడు మూడు పదుల వయస్సులోనే వాటి బారిన పడుతున్నారు. అయితే కరోనా తర్వాత ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. వ్యాధులు సోకిన వారు అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేస్తుండగా, సోకే అవకాశం ఉన్న వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ప్రతిరోజూ వ్యాయామంతో పాటు, ఆహార నియమాలు పాటిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని ఏ రోడ్డులో చూసినా వాకర్స్ కనిపిస్తున్నారు. సైక్లింగ్ చేసే వారి సంఖ్య కూడా ఇటీవల బాగా పెరిగింది. వాకింగ్, సైక్లింగ్, యోగా వంటివి చేయడం ద్వారా వ్యాయామంతో పాటు, మానసిక ఉల్లాసం, వత్తిళ్ల నుంచి ఉపశమనం కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు సిరి ధాన్యాల వినియోగం బాగా పెరిగింది. డ్రై ఫ్రూట్స్, పండ్లు కూడా ఎక్కువగా తీసుకుంటున్నారు. ఒబెసిటీ బారిన పడకుండా తక్కువ కొవ్వు పదార్థాలు ఉన్న ఆహారం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన వాకింగ్ ట్రాక్‌లు..

నగర ప్రజలు వాకింగ్‌పై దృష్టి పెట్టారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఏ రోడ్డులో చూసినా వాకింగ్ చేస్తూ కనిపిస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా, మగవారితో పాటు, మహిళలు సైతం వాకింగ్ చేస్తున్నారు. ప్రజల ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా కార్పొరేషన్ సైతం పలు పార్కులు, కాల్వగట్లపై వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసింది.

జీవనశైలిలో మార్పునకు యత్నం..

ప్రభుత్వ గణాంకాల ప్రకారం వయస్సు 35 ఏళ్లు దాటిన వారిలో 14 శాతం మంది మధుమేహం, 12.5 శాతం మంది రక్తపోటు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వాస్తవంగా మరింత మంది ఉంటారనేది అంచనా. అంతేకాకుండా ప్రీ డయాబెటీస్, రక్తపోటు వచ్చే అవకాశం ఉన్న వారు రెట్టింపు సంఖ్యలో ఉన్నారు. వీరంతా ఇప్పుడు వ్యాధులు అదుపులో ఉంచుకునే యత్నం చేస్తున్నారు. అందులో భాగంగా జీవనశైలిలో మార్పుతో పాటు, ఆహార నియమాలు, వ్యాయామంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తున్నారు.

ఇంట్లోనే పరీక్షలు

ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా గ్లూకోజ్ మీటర్, డిజిటల్ బీపీ మిషన్‌లు ఉంటున్నాయి. ఇంట్లో ఎవరో ఒకరు వాటి బారిన పడిన వారు ఉండటమే అందుకు కారణం. తమకు ఉన్న వ్యాధులు అదుపులో ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు ఇంట్లోనే చెక్ చేసుకుంటున్నారు. ఏదైనా స్థాయి పెరిగితే వైద్యులను సంప్రదిస్తున్నారు. కరోనా తర్వాత థర్మామీటర్, పల్స్‌ఆక్సీమీటర్‌లు కూడా ప్రతి ఇంట్లో ఉంటున్నాయి. తమ బరువును ఎప్పటికప్పుడు చూసుకునేందుకు వెయిట్ మిషన్‌లు కూడా కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెరిగింది



కరోనా తర్వాత ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన బాగా పెరిగింది. ముందస్తుగానే పరీక్షలు చేయించుకుని, అవసరమైతే మందులు వాడుతున్నారు. ఆహార నియమాలు, వాకింగ్ వంటి వాటిపై దృష్టి సారిస్తున్నారు. మా వద్దకు మధుమేహం, రక్తపోటు ప్రీ స్టేజ్‌లో ఉన్న వారు వస్తున్నారు. వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చి పంపుతున్నాం.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, జీజీహెచ్, విజయవాడ

రెగ్యులర్ పరీక్షలు అవసరమే



ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేస్తూనే రెగ్యులర్‌గా పరీక్షలు చేసుకోవడం అవసరమే. ముఖ్యంగా యువత మధుమేహం ఉన్నా తమకేమీ కావడం లేదనే భావనతో ఉన్నారు. దీంతో క్రియాటిన్ పెరిగి తమ వద్దకు వస్తున్నారు. వ్యాధిని అదుపులో ఉంచుకునేందుకు మందులు వాడుతూ, వ్యాయామం, ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు.

–డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి, మధుమేహ నిపుణుడు

సాక్షి క్లాసిఫైడ్స్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లూరు జిల్లా వలేటివారిపాలెంకు చెందిన పేరుబోయిన విష్ణువర్ధన్(30) వన్‌టౌన్ కేబీఎన్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ.. గొల్లపాలెంగట్టు రోడ్డులోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. విష్ణువర్ధన్ తాను ఉద్యోగం చేసే కాలేజీలోనే పని చేసే ఓ యువతిని ప్రేమించాడు. ఇటీవల పండుగ సెలవులకు స్వగ్రామానికి వెళ్లిన విష్ణువర్ధన్ తాను ప్రేమించిన సంగతి తండ్రి వెంకటరత్నంకి చెప్పాడు. ప్రేమ వివాహం వద్దు.. మంచి సంబంధం తెచ్చి పెళ్లి చేస్తామని తండ్రి నచ్చజెప్పి పంపించాడు. విజయవాడ తిరిగి వచ్చిన విష్ణువర్ధన్ తాను ఉండే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున ఆ ఇంటి యజమాని లోపల ఫ్యాన్ హుక్‌కు విష్ణువర్ధన్ వేలాడుతూ ఉండటంతో అతని తమ్ముడు సీతరామరాజుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన విజయవాడ బయలుదేరి వచ్చారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించగా, తండ్రి వెంకటరత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

ఏఎన్‌యూ: ఇంజినీరింగ్ విభాగంలోని ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీఈడబ్ల్యూఐడీసీ(ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్ ఎం.విజయప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఏపీఈడబ్ల్యూఐడీసీ రాష్ట్రస్థాయి ఇంజినీర్ల సమావేశానికి హాజరైన విజయప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. సంస్థ చీఫ్ ఇంజినీర్ బి.గోపి, ఏపీఈడబ్ల్యూఐడీసీ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె.రామారావు, ఉపాధ్యక్షుడు కె.వెంకటరావు, కార్యదర్శి రామచంద్రారావు, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

• అభిరుచుల సంగమం


ప్రపంచ చెఫ్స్ డేను పురస్కరించుకుని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. వంటకాల తయారీ పోటీల్లో నగరంలోని ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు 40 మంది పాల్గొని నిపుణులైన చెఫ్‌లు చేసిన విధంగా నోరూరించే వివిధ రకాల సలాడ్స్, స్టాటర్స్ తయారు చేశారు. నగరంలోని ప్రముఖ హోటళ్లలోని చెఫ్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు కళాశాల కన్వీనర్ వి.నాగమల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ యు.అరవింద్‌బాబు బహుమతులు అందజేశారు.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)



విద్యార్థులు తయారుచేసిన వంటకాలను రుచి చూసి మార్కులు వేస్తున్న చెఫ్స్







విద్యార్థులు తయారు చేసిన వంటకాలను వివిధ ఆకృతుల్లో డిజైన్ చేసిన దృశ్యం

క్లుప్తంగా

విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని నేషనల్ స్టాటిస్టిక్స్ పూర్వపు అధికారి జి.శ్రీలక్ష్మి తెలిపారు. ఆంధ్ర లయోల కళాశాలలో వరల్డ్ స్టాటిస్టిక్స్ డే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాల పై పట్టు సాధించాలన్నారు. స్టాటిస్టిక్స్ పై అవగాహన పెంచుకుని ఉత్తమ విద్యార్థులుగా పేరుతెచ్చుకోవాలని సూచించారు. ఉన్నత ఫలితాలు సాధించి ప్రతిభావంతులు కావాలని ఆకాంక్షించారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా కరెంట్ అఫైర్స్ పై సైతం అవగాహన పెంచుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ లూర్ధురాజు, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి శ్రీనివాసరావు, అధ్యాపకురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తా చాటిన సుచిత్ర



లబ్బీపేట(విజయవాడతూర్పు): రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2022లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.సుచిత్ర సత్తా చాటింది. సిల్వర్ ఇన్ రోడ్ విభాగంలో మొదటి స్థానం పొందగా, సిల్వర్ ఇన్ రింక్‌లో ద్వితీయ బహుమతి, గోల్డ్ ఇన్ రింక్‌లో మూడో బహుమతి గెలుపొందింది. స్కేటింగ్‌లో సత్తా చాటిన సుచిత్రను గురువారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ పద్మజ, ఇతర అధ్యాపకులు, సహచర విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

నేడు ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టంపై సదస్సు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం–2013, బడ్జెట్ వినియోగంపై శుక్రవారం గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు దళిత, గిరిజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2013లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టానికి నిర్దేశించిన 10 సంవత్సరాల కాలపరిమితి జనవరి 2023న ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో చట్టప్రకారం రూపొందించిన పథకాలు, కేటాయించి ఖర్చుపెట్టిన నిధులు, వాటి వలన ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిలో వచ్చిన మార్పులపై చర్చించేందుకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించి ప్రతిపాదనలను రూపొందించేందుకు రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, విద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ



పటమట(విజయవాడ తూర్పు): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని జాతీయ గణాంక విభాగం డీడీవో ఎంజే శామ్యూల్ అన్నారు. గురువారం ఆటోనగర్‌లోని కేంద్ర గణాంక ప్రాంతీయ కార్యాలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యాలయాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉద్దేశంతో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో పాత రికార్డులు, పాత ఫర్నిచర్ తొలగించామన్నారు. కేంద్ర గణాంక ప్రాంతీయ కార్యాలయం విజయవాడ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బ్యానర్, ప్లకార్డులు స్లోగన్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

వరి పొలాల పరిశీలన

విజయవాడరూరల్: మండలంలో వరిపొలాలు ఆరోగ్యకరంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రంగనాథ్‌బాబు అన్నారు. గురువారం నున్న, పాతపాడు, అంబాపురం, పైడూరుపాడు, జక్కంపూడి, కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లో వరిపొలాలను ఆయన గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులతో వెళ్లి పరిశీలించారు. ప్రస్తుతం వరిపొలాలు పొట్టదశలో ఉన్నాయని, ఇప్పుడు వీటికి నీరు అవసరమేనని ఆయన రైతులకు తెలిపారు. 1,423 మంది రైతులు ఈక్రాప్ నమోదు చేశారన్నారు.

వేగంగా పనులు

విజయవాడరూరల్: రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల ఏర్పాటు పనులు చురుగ్గా చేస్తున్నారు. 2020–21వ విద్యాసంవత్సరంలో 20 ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 4.5 కోట్లతో సౌకర్యాలు అమర్చారు. రెండో ఫేజ్‌లో రూ.5.5 కోట్లతో 48 అదనపు తరగతిగదులు నిర్మిస్తున్నారు. మరో రూ.1.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఏఈ వెంకటేశ్వరావు తెలిపారు.

కాకాని విగ్రహం ఏర్పాటుకు కృషి





కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందిస్తున్న దేవినేని అవినాష్, కాకాని కుటుంబ సభ్యులు, పనులను శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్, చిత్రంలో బెల్లం దుర్గ

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జై ఆంధ్రా ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఉక్కు కాకానిగా పేరొందిన కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని విజయవాడలో తిరిగి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. ఈ మేరకు గురువారం కాకాని కుటుంబ సభ్యులతో కలిసి అవినాష్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును కలిసి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ కాకాని వెంకటరత్నం లాంటి మహనీయుల గురించి, వారు చేసిన పోరాటాలు భవిష్యత్ తరాలకు తెలియాలని బెంజిసర్కిల్ వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగేటప్పుడు విగ్రహాన్ని తొలగించి మరలా ఏర్పాటు చేయకుండా అవమానించారన్నారు. విగ్రహ ఏర్పాటు గురించి అడిగిన వారి కుటుంబ సభ్యులపై పోలీసు కేసులు పెట్టి, దాడి చేసి అవమానించారని తెలిపారు. నాడు తొలగించి అవమానించిన టీడీపీ నాయకులు నేడు మొసలి కన్నీరు కారుస్తూ ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి కుటుంబ సభ్యులు విగ్రహం ఏర్పాటు గురించి చెప్పగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందుకు అవసరమైన స్థల పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు గుర్తు చేశారు. వీలైనంత త్వరగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చినట్లు అవినాష్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాకాని వెంకట రత్నం కుటుంబ సభ్యులు కాకాని విజయ్‌కుమార్, కాకాని తరుణ్, కోనేరు మధు తదితరులు న్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. శంకుస్థాపన చేసిన పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రామలింగేశ్వరనగర్ 15వ డివిజన్‌లో రూ.17 లక్షలు ప్రభుత్వ నిధులతో రుద్రభూమి కాంపౌండ్‌వాల్, మంచినీటి బోరు పంపు వంటి అభివృద్ధి పనులకు గురువారం ఆయన డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ ఈ డివిజన్‌ను దత్తత తీసుకుని బూటకపు మాటలు చెప్పి, ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో దేవినేని నెహ్రూ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు, డ్రైనేజీలు తప్ప, గద్దే రామ్మోహన్ చేసిందేమీ లేదన్నారు. రిటైనింగ్ వాల్‌తో వరద ముప్పు తొలగినట్లు తెలిపారు. ఈ ప్రాంతం వారి కోసం రూ.5 కోట్లతో మంచినీటి ట్యాంక్ నిర్మాణం, ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక నేతలు ఆళ్ల చెల్లారావు, కాము వెంకటరెడ్డి, ఆకుల బాలాజీ, వెంకయ్యనాయుడు, వాలిశెట్టి సుబ్రహ్మణ్యం, బోయిన శ్రీను, డాక్టర్ ఎం ఎం రాజు, ఇంటి రవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ప్లాస్టిక్ నిషేధం అమలు

కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, ఈఈ ప్రసాదరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే అధికారులు, ప్లాస్టిక్ ఫ్లెక్స్ బ్యానర్స్ తయారీ దారులతో సమావేశాలను నిర్వహించారని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సత్యవతి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ప్రసాద్ రావు, డీపీఓ జె.సునీత, ఎస్ఎల్‌బీసీ అధ్యక్షులు ఎస్. హెచ్. నవనీత్ కుమార్ పాల్గొన్నారు.

ఒత్తిడికి దూరంగా ఉంటేనే లక్ష్యాలు సాధన



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విద్యార్థులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉన్నప్పుడే అనుకున లక్ష్యాలను సాధిస్తారని మానసిక వైద్య నిపుణురాలు పి.రమాదేవి అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫ్రెషమెన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మానసిక వికాసం- వ్యక్తిత్వం అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన రమాదేవి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి విద్యార్థుల్లోని ప్రతిభను దిగజారుస్తుందని చెప్పారు. అనుకున్న లక్ష్యాలను సాధించకుండా అడ్డుకుంటుందన్నారు. విద్యార్థి జీవితం చాలా కీలకమైనదని వివరించారు. ఈ దిశలో విద్యార్థులు జీవితాన్ని సమర్థవంతంగా కొనసాగించినప్పుడు మంచి భవిష్యత్‌ను సొంతం చేసుకుంటారన్నారు.

మరో నిపుణురాలు డాక్టర్ తేజోవతి మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ఏ విధమైన జీవన విధానాన్ని కొనసాగించాలో వివరించారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలిశాస్త్రి, విభాగ కన్వీనర్ డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

హాస్యపు జల్లులు కురిపించిన నటుడు రాజబాబు



మాట్లాడుతున్న నటుడు ఆనంద్ వేదికమీద పరచూరి విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి తదితరులు

విజయవాడ కల్చరల్: హాస్యపు జల్లులు కురిపించిన నటుడు రాజబాబు అని సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ అన్నారు. శారదా కళా సమితి, మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటుడు రాజబాబు 85వ జయంతి, సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు శత జయంతి కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్ మాట్లాడుతూ రాజబాబు సినీ నటుడు మాత్రమే కాదని గొప్ప మానవతా విలువలున్న వ్యక్తి అని కొనియాడారు. రాజమండ్రిలో పెద్ద కాలనీ కట్టించి ఎందరో పేద నటులను ఆదుకున్నాడని గుర్తుచేశారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సినీ వినీకలాశంలో ధ్రువతార సాలూరి రాజేశ్వరరావు అన్నారు. ఆయన సినీ జీవితంలో మలుపు తిప్పిన చిత్రం మల్లీశ్వరి అని తెలిపారు. సంగీత దర్శకుడు రాజేశ్వరరావు కుమారులు వాసూరావు, కోటి తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారని తెలిపారు. జ్యోతిష్య శాస్త్రవేత్త తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, సంస్థ సభ్యులు ప్రభల శ్రీనివాస్, బాలాజీకుమార్ ఎంఎస్. నారాయయణ పాల్గొన్నారు. గాయనీ గాయకులు దండు చంద్రశేఖర్, రామభద్రకుమార్, వడ్డాది కామేశ్వరి, అమలారాణి, విష్ణుప్రియ, సువర్ణలక్ష్మి, విజయశ్రీ గుప్తా తదితరులు పలు గీతాలు ఆలపించారు.

బోయ, బింటో, ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు



మాట్లాడుతున్న ఎన్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్

రామవరప్పాడు : బోయ, బింటో, ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని మరోసారి పునరాలోచించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కరెన్సీనగర్‌లోని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ బోయ, బింటో ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం మాజీ ఐఏఎస్ శామ్యూల్ ఆనంద్‌తో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. గత టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న నిర్ణయాన్ని అన్ని గిరిజన, ప్రజా సంఘాలు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. గిరిజనులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై విశ్వాసంతో ఉన్నారన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనక్కి తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కడమల రామచంద్రయ్య మాట్లాడుతూ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలని విన్నవించారు. శామ్యూల్ ఆనంద్ ఏకసభ్య కమిషన్‌కు చట్టబద్ధత లేదన్నారు. రాష్ట్ర నాయకులు కుంభ ఉదయ్ కుమార్,, తోకల చిన్న వీరోజి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జగన్నాథం చంటి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మీయ కరచాలనం..



కృష్ణా జిల్లాలోని అవనిగడ్డలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆత్మీయ కరచాలనం చేస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జీవన విధానంలో ఆయుర్వేదం భాగం

ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధాకర్



ఆయుర్వేద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆయుర్వేదం భారతీయ సంస్కృతి సంప్రదాయాలతో ముడిపడి జీవన విధానంలో ఒకభాగమై ఉందని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధాకర్ అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి, కళాశాలల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్‌శాఖ ఆదేశాల మేరకు ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. హర్ దిన్ హర్ ఘర్ ఆయుర్వేద, (ప్రతి దినం ప్రతి ఇంట్లో ఆయుర్వేదం) అనే నినాదంతో అవగాహన, ప్రచార కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతీయ సంప్రదాయ ఆహారపు అలవాట్లు, జీవనశైలి ఆచరించడం వలన అనేక వ్యాధులను రాకుండా అరికట్టవచ్చునన్నారు. ఆయుర్వేద ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యులతో కీళ్లవాతం, గ్యాస్ట్రిక్ సంబంధిత వ్యాధులు, స్త్రీ ప్రసూతి వ్యాధులు, ఓపీ, ఐపీ రోగులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయుర్వేద ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ప్రభుత్వాసుపత్రిలో గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... నున్న గ్రామానికి చెందిన కె.మోహనరావు(50) బుధవారం వికాస్ కాలేజీలో ఫంక్షన్‌కు వెళ్లి బైక్ పై తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. గాయపడిన మోహనరావును చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమార్తె పెనుమత్స శిరీషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): కర్రతో దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్టినగర్‌కు చెందిన బంకి జయప్రకాష్ స్థానికంగా హరిహర మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో జయప్రకాష్ అన్నయ్య శ్రీను, విక్కిలు షాపులో ఉండగా, మహంతి వాసు, అతని స్నేహితుడు గట్టిగా బూతులు తిట్టుకోసాగారు. దీంతో జయప్రకాష్ కల్పించుకుని మహంతి వాసును పక్కకు వెళ్లి మాట్లాడుకోవాల్సిందిగా కోరాడు. దీంతో మహంతివాసు ఏంట్రా నువ్వు మాకు చెప్పేది అంటూ పక్కనే ఉన్న కర్రతో జయప్రకాష్ తలపై కొట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు క్లాత్ బ్యాగులను అందిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వన్ టౌన్, సర్కిల్–1 పరిధిలోని 51వ డివిజన్‌లోని తెలప్రోలు రాజా హైస్కూలు ప్రాంగణంలో గురువారం సచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రహదార్లపై, డ్రెయిన్లలో వేయవద్దని సూచించారు. చెత్తను విభజించి పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని కోరారు. తడి, పొడి చెత్తను ఏవిధంగా విభజించాలో చూపించారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై విజయవాడను స్వచ్ఛ నగరంగా మార్చడానికి విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగ్‌లను వాడాలన్నారు. విద్యార్థులకు విజయవాడ నగర పాలక సంస్థ క్లాత్ బ్యాగులను అందించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్ ఓబేస్వర రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవ సభకు సంపూర్ణ మద్దతు

మేయర్ రాయన్న భాగ్యలక్ష్మి



బీసీల ఆత్మగౌరవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డాక్టర్ ఎన్.మారేష్

పటమట(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే బీసీల ఆత్మగౌరవ సభకు తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తానని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యలయంలోని చాంబర్లో గురువారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ప్రతినిధులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బీసీలందరూ ఐక్యంగా ఉంటూ రాజ్యాంగపరంగా రావాల్సిన ఫలాలను దక్కించుకోవాలని తెలిపారు. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలను చూసుకోవాలని, ఎన్నికల అనంతరం 139 బీసీ కులాలన్నీ ఏకతాటిపై కొచ్చి ఐక్యతకు చిహ్నంగా పనిచేయాలని కోరారు. పార్లమెంట్లో బీసీ బిల్లు కోసం జరుగుతున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడలో బీసీల ఆత్మగౌరవ సభకు అన్ని డివిజన్లో ఉన్నటువంటి బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ మాట్లాడుతూ బీసీలందరూ ఐక్యంగా పోరాడితేనే పార్లమెంట్లో బీసీ బిల్లు సాధించుకోగలమని చెప్పారు. బీసీల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి మాట్లాడుతూ బీసీ మహిళల్లో చైతన్యం పెరగాలని తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ రాయన బీసీ ఆత్మగౌరవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రచార కమిటీ చైర్మన్ జక్కా శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు రామాంజనేయులు, డేరంగుల నాని పలువురు బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిగా బేబీరాణి



న్యాయమూర్తి బేబీరాణితో న్యాయవాదులు

ఉయ్యూరు: ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.బేబిరాణికి పదోన్నతి లభించింది. శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతిపై నియమితులయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వీడ్కోలు సభ నిర్వహించి న్యాయమూర్తి బేబీరాణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగేశ్వరరావు, రాంబాబు, చంటిబాబు, సుదర్శన్, సూర్యనారాయణ, గోపిచంద్ పాల్గొన్నారు.

డీఆర్సీ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ



ఉంగుటూరు: వాతావరణానికి అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తే సత్ఫలితాలు ఇస్తాయని డీడీఏ జ్యోతిరమణి అన్నారు. నాగవరప్పాడులో జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ) ఆధ్వర్యంలో గురువారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ మాట్లాడుతూ రైతులు అందరు పచ్చిరొట్ట పైరు వేసుకుని భూమిలో కలియదున్నాలన్నారు. దీంతో సారవంతమవుతుందని ఫలితంగా ఎరువుల వినియోగం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సుధారాణి, సర్పంచ్ పెద నాగూర్, డీఆర్సీ ఏడీఏ శ్రీనివాస్, ఏఈవో దుర్గానాగేశ్వరరావు, వీఏఏ ఫాతిమా, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు కాయిన్స్ మేళా

మధురానగర్(విజయవాడ సెంట్రల్): బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ కరెన్సీ చెస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి కాశేశ్వరరావు మార్కెట్ గద్ద బొమ్మ సెంటర్ వద్ద కాయిన్స్ మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సీనియర్ మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాయిన్స్ మేళాలో రూ. 20, 10, 5, 2, 1 కాయిన్స్‌తో పాటు ఫ్రెష్ కరెన్సీను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. చినిగిన నోట్లు తీసుకోవడంతో పాటు అవసరమైన వారికి చిల్లర కూడా ఇస్తామన్నారు.

క్లుప్తంగా..

26న ఖర్గే బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన మల్లికార్జున ఖర్గే(80) ఈ నెల 26వ తేదీన బాధ్యతలు చేపట్టనున్నారు. 26న ఉదయం 10.30 గంటలకు ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగే వేడుకలో ఖర్గే ఏఐసీసీ చీఫ్‌గా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందుకుంటారు. అనంతరం పార్టీ కొత్త చీఫ్ బాధ్యతలను చేపడతారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. ఈ కార్యక్రమానికి సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ లెజిస్లేటివ్ కౌన్సిళ్ల నేతలు, ఏఐసీసీ ఆఫీస్ బేరర్లు, అనుబంధ సంస్థలు, వివిధ విభాగాల చీఫ్‌లు తదితరులు హాజరవుతారన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఇటీవల జరిగిన ఎన్నికలో శశిథరూర్‌పై ఖర్గే గెలిచిన విషయం తెలిసిందే.

43.82 లక్షల టన్నుల పప్పుదినుసుల బఫర్ స్టాక్

సాక్షి, న్యూఢిల్లీ: నిరంతర పర్యవేక్షణ, విధానపరమైన నిర్ణయాల ఫలితంగా పప్పు దినుసులు 43.82 లక్షల టన్నులు బఫర్ స్టాక్ సాధించినట్లు కేంద్ర వినియోగదారులు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ పేర్కొంది. అదేవిధంగా, ఉల్లి ధరల్లోనూ స్థిరత్వం వచ్చిందని తెలిపింది. నిత్యావసరాల ఉత్పత్తి, దిగుమతులు, ఎగుమతుల లభ్యతపై కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని ఆ శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ తెలిపారు. స్టాక్ హోల్డర్లు వెల్లడించే నిల్వల సమాచారాన్ని పర్యవేక్షించడానికి నోడల్ అధికారులను నామినేట్ చేయాలని రాష్ట్రాలను కోరారు. పప్పులు, ఉల్లిగడ్డలు, బంగాళాదుంపలు తదితర నిత్యావసర వస్తువుల ధరల్లో ఒడిదొడుకులను నివారించేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామన్నారు.

గత ఏడాదే కోవిషీల్డ్ ఉత్పత్తి ఆపేశాం

పుణె: కోవిడ్ ఉధృతికాలంలో భారత్‌లో సంజీవనిగా పేరొందిన కోవిడ్ టీకాల్లో ఒకటైన కోవిషీల్డ్ కరోనా టీకా ఉత్పత్తిని గత ఏడాది డిసెంబర్‌లోనే నిలిపివేశామని టీకా తయారీసంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన కార్య నిర్వహణాధికారి(సీఈవో) అధర్ పూనేవాలా గురువారం వెల్లడించారు. పుణెలో జరుగుతున్న అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని టీకా తయారీసంస్థల నెట్‌వర్క్(డీసీవీఎంఎన్) వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో అధర్ మాట్లాడారు. 'భారతీయ వయోజనుల్లో కోవిడ్ వ్యాక్సిన్‌పై నిరాసక్తి, కోవిడ్‌తో జనం 'విసిగిపోయిన' నేపథ్యంలో బూస్టర్ డోస్‌లకు సైతం డిమాండ్ లేదు. ఉత్పత్తి నిలిపేసేనాటికే దాదాపు 10 కోట్ల డోస్‌ల కోవిషీల్డ్ టీకాలు తేదీ(ఎక్స్‌పైరీ) దాటిపోయాయి. ఇకపై ప్రతీఏటా కొత్తగా తీసుకునే వారు యాంటీ–కరోనావైరస్ టీకాలు, ఇతర టీకాల కలిపి తీసుకుంటారేమో' అని అధర్ వ్యాఖ్యానించారు.

ఆప్ నిర్భర్ కావాలా.. ఆత్మ నిర్భర్ కావాలా

న్యూఢిల్లీ: బీజేపీ ఢిల్లీని ఆత్మనిర్భర్‌గా మార్చాలని భావిస్తుండగా కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీ ఢిల్లీని ఆప్ నిర్భర్‌గా చేయాలనుకుంటోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు ఆత్మ నిర్భర్..ఆప్ నిర్భర్ రెండింటిలో ఏది కావాలో తేల్చుకోవాలని ఆయన కోరారు. తేహ్‌ఖండ్‌లో వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఢిల్లీలోని మూడు మున్సిపాలిటీల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరిచిన కేజ్రీవాల్ ప్రభుత్వం రూ.40 వేల కోట్ల మేర బకాయి పడిందని చెప్పారు. ఆప్ ప్రభుత్వం ప్రచారం కోసం ప్రజాధనాన్ని భారీగా ఖర్చు చేస్తోందని ఆరోపించారు. ప్రకటనలతోనే అభివృద్ధి జరుగుతుందని కేజ్రీవాల్ భ్రమిస్తున్నారని, ఇదంతా మరో అయిదు, ఏడేళ్ల మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఆప్ ప్రకటనల రాజకీయాలు, బీజేపీ అభివృద్ధి రాజకీయాలు.. ఏది కావాలో ప్రజలు నిర్ణయించుకుంటారన్నారు.

ఆస్ట్రేలియా ఆరోగ్య బీమా సంస్థ డేటా హ్యాక్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా ఆరోగ్య బీమా సంస్థ మెడిబ్యాంక్ హ్యాకర్ల బారిన పడింది. ఆ సంస్థ వినియోగదారులకు చెందిన పరీక్షలు, చికిత్సలు, నేషనల్ హెల్త్ ఐడెంటిఫికేషన్ నంబర్, ఫోన్ నంబర్లు, చిరునామాలు తదితర పూర్తి వివరాలను గుర్తు తెలియని ఓ సైబర్ నేరగాడు గుప్పెట్లో పెట్టుకున్నాడు. మెడిబ్యాంక్ వద్ద 37 లక్షల వినియోగదారులకు చెందిన 200 గిగాబైట్ల సమాచారం ఉంది. ఈ మొత్తాన్ని హ్యాక్ చేసిన నేరగాడు 100 మంది పాలసీల సమాచారాన్ని శాంపిల్‌గా పంపాడని మెడిబ్యాంక్ పేర్కొంది. రాజకీయ నేతలు, మీడియా ప్రముఖులు, నటులు, ఎల్జీబీటీక్యూ ఉద్యమకారులు, డ్రగ్స్ బానిసలు తదితర వెయ్యి మందికి సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని బహిర్గతం చేస్తానంటూ హ్యాకర్ హెచ్చరికలు పంపినట్లు మీడియా అంటోంది.

బీజేపీ గూటికెళ్తారు: ప్రశాంత్

పట్నా: బీజేపీతో బంధం తెంచుకుని ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన నితీశ్‌కుమార్ త్వరలో మళ్లీ బీజేపీ పంచన చేరుతారని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. బిహార్‌లోని పశ్చిమచంపారన్ జిల్లాలో పాదయాత్రలో మద్దతుదారులనుద్దేశిస్తూ ప్రసంగించారు.'బీజేపీతో తెగదెంపులు చేసుకున్నాక రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా ఇంకా కొనసాగుతున్న జేడీయూ నేత హరివంశ్‌ను పదవి నుంచి తప్పుకోవాలని నితీశ్ ఆదేశించి ఉండాల్సింది. కానీ, అలా జరగలేదు. ఎందుకంటే హరివంశ్ ద్వారా నితీశ్ ఇంకా బీజేపీతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు' అని ప్రశాంత్ అంచనావేశారు.'ప్రశాంత్ ఏం చేయగలడనేది దేశవ్యాప్తంగా సీనియర్ రాజకీయనేతలందరికీ తెలుసు. అదే ఎన్నికల్లో గెలిపించడం ' అని ప్రశాంత్ వ్యాఖ్యానించారు.

యూకే ప్రధాని ట్రస్ రాజీనామా

45 రోజుల్లోనే పదవి నుంచి నిష్క్రమణ
- ఆర్థికంగా పెను సవాళ్లు
- దిగజారిన ప్రతిష్ట
- అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన సొంత పార్టీ ఎంపీలు
- వారం రోజుల్లోగా నూతన ప్రధానమంత్రి ఎన్నిక
- తదుపరి ప్రధానమంత్రి రేసులో రిషి సునాక్, బోరిస్ జాన్సన్
- ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలి
- ప్రతిపక్ష లేబర్ పార్టీ డిమాండ్



10 డౌనింగ్ స్ట్రీట్‌లో మాట్లాడుతున్న ట్రస్

లండన్: సొంత పార్టీ సభ్యుల నుంచే అసమ్మతి సెగ ఎదుర్కొంటున్న యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి లిజ్ ట్రస్(47) గురువారం పదవికి రాజీనామా చేశారు. ఆర్థికంగా పెను సవాళ్లు ఎదురవ్వడం, మినీ బడ్జెట్‌తో పరిస్థితి మరింత దిగజారడం, రష్యా నుంచి గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ఖజానాపై విద్యుత్ బిల్లుల భారం పెరిగిపోవడం, ధనవంతులకు పన్ను మినహాయింపుల పట్ల ఆరోపణలు రావడం, డాలర్‌తో పోలిస్తే పౌండు విలువ దారుణంగా పడిపోవడం, వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినడం వంటి అంశాలు ఆమెపై విపరీతమైన ఒత్తిడిని పెంచాయి. మరోవైపు సొంత పార్టీ ఎంపీలు తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధపడడంతో రాజీనామాకే ట్రస్ మొగ్గుచూపారు. కన్జర్వేటివ్ నాయకురాలి పదవి నుంచి తప్పుకున్నారు. అనూహ్య రీతిలో కేవలం 45 రోజుల్లో తన భర్తతో కలిసి '10 డౌనింగ్ స్ట్రీట్' నుంచి భారంగా నిష్క్రమించారు. పార్టీ నాయకత్వం తనకు కట్టబెట్టిన బాధ్యతను నెరవేర్చలేకపోయాయని, ఆర్థిక అజెండాను అమలు చేయలేకపోయానని, అందుకే పదవికి రాజీనామా చేశానని చెప్పారు. కొత్త ప్రధానమంత్రి ఎన్నికయ్యే దాకా ప్రధానిగా ట్రస్ కొనసాగుతారు. నూతన ప్రధాని ఎవరన్నది వారం రోజుల్లోగా తేలిపోనుంది.

పార్టీ, ప్రజల విశ్వాసం పొందలేక

లిజ్ ట్రస్ గత నెల 6వ తేదీన యూకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మార్గరెట్ థాచర్, థెరెసా మే తర్వాత మూడో మహిళా ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారు. కానీ, సొంత పార్టీ ఎంపీల తోపాటు యూకే ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోయారు. కేవలం 45 రోజులపాటు అధికారంలో కొనసాగారు. యునైటెడ్ కింగ్‌డమ్ చరిత్రలో అతి తక్కువ కాలం అధికారంలో ఉన్న ప్రధానమంత్రిగా మరో రికార్డును లిజ్ ట్రస్ నెలకొల్పారు.

తెరపైకి పలువురి పేర్లు

లిజ్ ట్రస్ తాజా మాజీ ప్రత్యర్థి, భారత సంతతికి చెందిన అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ రిషి సునాక్ తదుపరి ప్రధానమంత్రి రేసులో ముందంజలో ఉన్నారు. ఆయనను కొత్త ప్రధానమంత్రిగా ఎన్నుకొనే విషయంలో కన్జర్వేటివ్ పార్టీ అంతరంగం ఏమిటన్నది అంతుచిక్కడం లేదు. పార్టీలోని కొందరు సభ్యులు ఆయన పట్ల విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికైతే పార్టీలో ఏకాభిప్రాయం లేదని స్పష్టంగా చెప్పొచ్చు. మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ పేరు తెరపైకి వస్తుండడం గమనార్హం. జాన్సన్‌ను మళ్లీ ప్రధానిని చేయాల్సిందేనని ఆయన మద్దతుదారులు గొంతు విప్పుతున్నారు. అలాగే గతంలో ఈ పదవికి పోటీ పడిన పెన్నీ మోర్డాంట్, భారత సంతతికి చెందిన సుయెల్లా బ్రేవర్మన్, రక్షణ శాఖ మంత్రి బెన్ వాలెస్ పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. సుయెల్లా బ్రేవర్మన్ దేశ హోం శాఖ మంత్రి పదవికి బుధవారమే రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దేశంలో అస్తవ్యస్త ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వాన్ని రద్దు చేసి, తక్షణమే సాధారణ ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్ష లేబర్ పార్టీ డిమాండ్ చేస్తుండడం ఆసక్తికరంగా మారింది. అనిశ్చితికి తెరపడాలంటే ఎన్నికలు నిర్వహించడం ఒక్కటే మార్గమని లేబర్ పార్టీ నేత సర్ కీర్ స్టార్మర్ చెప్పారు. అధికార కన్జర్వేటివ్ పార్టీ గత 12 ఏళ్లుగా వైఫల్యాల బాటలో కొనసాగుతోందని అన్నారు. అవన్నీ ఇప్పుడు తారస్థాయికి చేరాయని ఆక్షేపించారు.

జీవించి ఉన్న ఏడుగురు మాజీలు

ఆధునిక చరిత్రలో యూకేలో ఏడుగురు మాజీ ప్రధానమంత్రులు జీవించి ఉండడం ఇదే మొదటిసారి. ఒకరకంగా చెప్పాలంటే మాజీ ప్రధానుల జాబితా పెరుగుతోంది. బోరిస్ జాన్సన్, థెరెసా మే, డేవిడ్ కామెరూన్, గోర్డాన్ బ్రౌన్, సర్ టోనీ బ్లెయిర్, సర్ జాన్ మేయర్ సరసన ఇప్పుడు ట్రస్ చేరారు.

45 రోజుల ప్రధానమంత్రి

యూకేలో పలువురు ప్రధానమంత్రులు ఏడాది కంటే తక్కువ కాలమే అధికారంలో కొనసాగారు. పదవిలో ఉండగానే మరణించడం లేదా రాజీనామా వంటివి ఇందుకు కారణాలు. తాజాగా 45 రోజుల ప్రధానిగా ట్రస్ రికార్డు సృష్టించారు.

సంవత్సరం లోపే అధికారంలో ఉన్న యూకే ప్రధానులు

పేరు	ప్రమాణం	రాజీనామా	రోజులు
లిజ్ ట్రస్	2022 సెప్టెంబర్ 6	2022 అక్టోబర్ 20	45
జార్జ్ కానింగ్	1827 ఏప్రిల్ 10	1827 ఆగస్టు 8(మృతి)	119
ఫ్రెడరిక్ రాబిన్సన్	1827 ఆగస్టు 31	1828 జనవరి 21	144
బోనర్ లా	1922 అక్టోబర్ 23	1923 మే 20	210
విలియం కావెండిష్	1756 నవంబర్ 6	1757 జూన్ 29	236
విలియం పెట్టీ	1782 జూలై 13	1783 ఏప్రిల్ 5	267

బాధ్యత నెరవేర్చలేకపోయా

దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతానన్న నమ్మకంతో తనను ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారని, ఆ బాధ్యతను నెరవేర్చడంలో విఫలమయ్యానని లిజ్ ట్రస్ పేర్కొన్నారు. అందుకే పదవి నుంచి తప్పుకుంటున్నానని స్పష్టం చేశారు. గురువారం రాజీనామా అనంతరం ఆమె లండన్‌లోని డౌనింగ్ స్ట్రీట్‌లో మీడియాతో మాట్లాడారు. రాజీనామాకు దారితీసిన కారణాలను వెల్లడించారు. అధికార కన్జర్వేటివ్ పార్టీ నాయకురాలి పదవికి రాజీనామా చేశానంటూ రాజు చార్లెస్‌కు తెలియజేశానని అన్నారు. అస్థిరమైన ఆర్థిక వ్యవస్థ, ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితుల నడుమ యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రిగా అధికార బాధ్యతలు చేపట్టానని గుర్తుచేశారు. లిజ్ ట్రస్ ఇంకా ఏం చెప్పారంటే.. ''బిల్లులు చెల్లించలేక ప్రజలు, వ్యాపారవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఆదాయాలు లేకపోవడంతో బిల్లులు ఎలా కట్టాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రారంభించిన చట్టవిరుద్ధమైన యుద్ధం మన భద్రతకు ముప్పుగా మారింది. ఆర్థిక వృద్ధి క్రమంగా పడిపోతోంది. మన దేశం వెనుకంజ వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలాంటి తరుణంలో ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి, దేశాన్ని ముందుకు నడిపిస్తానన్న విశ్వాసంతో కన్జర్వేటివ్ పార్టీ నన్ను ప్రధానమంత్రిగా ఎన్నుకుంది. ఇంధన బిల్లులు, జాతీయ ఇన్సూరెన్స్‌లో కోత వంటి అంశాల్లో కార్యాచరణ ప్రారంభించాం. తక్కువ పన్నులు, ఎక్కువ ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. బ్రెగ్జిట్ వల్ల లభించిన స్వేచ్ఛను వాడుకోవాలన్నదే మన ఉద్దేశం. కానీ, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకున్నా. పార్టీ నాకు అప్పగించిన బాధ్యతను నెరవేర్చడంలో విఫలమయ్యానని గుర్తించా. రాజు చార్లెస్‌తో మాట్లాడా. కన్జర్వేటివ్ పార్టీ నేత పదవికి రాజీనామా చేశానని తెలియజేశా. ఈ రోజు ఉదయమే '1922 కమిటీ' చైర్మన్ సర్ గ్రాహం బ్రాడీతో సమావేశమయ్యా. వారం రోజుల్లోగా నూతన నాయకుడి (ప్రధానమంత్రి) ఎన్నిక ప్రక్రియను పూర్తిచేయాలని మేము ఒక నిర్ణయానికొచ్చాం. మనం అనుకున్న ప్రణాళికలను సక్రమంగా అమలు చేయడానికి, మన దేశ ఆర్థిక రంగంలో స్థిరత్వాన్ని సాధించడానికి, దేశంలో భద్రత కొనసాగించడానికి నూతన ప్రధానమంత్రి ఎన్నిక దోహదపడుతుందని భావిస్తున్నా. నా వారసుడు(కొత్త ప్రధాని) ఎన్నికయ్యే దాకా పదవిలో కొనసాగుతా''.

45 రోజుల్లో ఏం జరిగింది?

బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ పదవి మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. బ్రెగ్జిట్, కోవిడ్, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో అప్పుల కుప్పగా మారి దేశం ఆర్థికంగా పెనుసవాళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పదవిని చేపట్టిన లిజ్ ట్రస్ దేశాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టడంలో దారుణంగా విఫలమయ్యారు. ప్రధాని పదవి చేపట్టిన తర్వాత లిజ్ ట్రస్ ప్రభుత్వం తీసుకున్న ప్రతీ నిర్ణయం వివాదాస్పదమైంది. బ్రిటన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన మినీ బడ్జెట్‌తో ఏర్పడిన ఆర్థిక, మార్కెట్ ప్రకంపనలు సొంత పార్టీలోనూ ఆమెపై వ్యతిరేకతను పెంచాయి. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన ఎంపీలే ట్రస్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి సిద్ధపడుతూ ఉండడంతో ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది. కేవలం 45 రోజుల మాత్రమే పదవిలో కొనసాగి అత్యంత తక్కువ కాలం ప్రధానిగా ఉన్న వ్యక్తిగా బ్రిటన్ చరిత్రలో లిజ్ ట్రస్ మిగిలిపోయారు. 1827లో కన్జర్వేటివ్ ప్రధాని జార్జ్ కానింగ్ పదవి చేపట్టిన 119 రోజుల్లో న్యుమోనియాతో మరణించారు. ఇన్నాళ్లు బ్రిటన్ చరిత్రలో తక్కువ కాలం కొనసాగిన ప్రధానిగా ఆయనే ఉన్నారు.

విద్యుత్ బిల్లులు ఫ్రీజ్

ప్రజాసంక్షేమం పేరుతో లిజ్ ట్రస్ తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ ఖజానాపై మోయలేని భారాన్ని వేశాయి. రష్యా గ్యాస్ కోతలతో బ్రిటన్‌లో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవతూ ఉండడంతో వాటిని కట్టలేక జనం హడలెత్తిపోతున్నారు. దీంతో లిజ్ ట్రస్ ప్రభుత్వం రెండేళ్ల పాటు విద్యుత్ బిల్లుల్ని ఫ్రీజ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రభుత్వ ఖజానాపై 8,900 కోట్ల పౌండ్ల భారం పడింది. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న ప్రభుత్వం మరింత సంక్షోభంలోకి కూరుకుపోయింది

మినీ బడ్జెట్ ప్రకంపనలు


బ్రిటన్ ఆర్థిక మంత్రి క్వాజీ క్వార్టెంగ్ సెప్టెంబర్ 23న పార్లమెంటులో ప్రవేశపెట్టిన మినీ బడ్జెట్‌తో మార్కెట్లు కుప్పకూలిపోయాయి. ఈ మినీ బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన పన్ను కోతలు కనీవినీ ఎరుగనివి. 1972 తర్వాత ఈ స్థాయిలో పన్ను రాయితీలు ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. సామాన్య ప్రజలతో పాటు సంపన్నులకి 4,500 కోట్ల పౌండ్ల పన్ను మినహాయింపులివ్వడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే మార్గాలను బడ్జెట్‌లో చూపించకుండా విద్యుత్ బిల్లుల రాయితీలకే కోట్లాది పౌండ్లు కేటాయించడం ఆర్థికంగా ప్రకంపనలు సృష్టించింది. డాలర్‌తో పోల్చి చూస్తే పౌండ్ విలువ భారీగా పడిపోయింది. ఈ సంక్షోభాన్ని గట్టెక్కించడానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ 6,500 కోట్ల పౌండ్ల విలువైన బాండ్లను కొనుగోలు చేస్తామని చెప్పడం కొన్ని పెన్షన్ స్కీమ్స్‌ను ప్రమాదంలోకి నెట్టేశాయి. ఇది రాజకీయంగా లిజ్ ట్రస్‌కు ఎదురు దెబ్బగా మారింది. కొందరు ఎంపీలు ఆమె రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేయడం ప్రారంభించారు. అయినప్పటికీ కొద్ది రోజులు ఆమె తన చర్యల్ని సమర్థించుకుంటూ వచ్చారు. అయితే సొంత పార్టీలోనే ఆమెపై వ్యతిరేకత మరింతగా పెరిగిపోవడంతో మినీ బడ్జెట్‌పై యూ టర్న్ తీసుకున్నారు. తనకు అత్యంత సన్నిహితుడైన ఆర్థిక మంత్రి క్వాజీ క్వార్టెంగ్‌పై వేటు వేశారు. కొత్త ఆర్థిక మంత్రిగా జెరెమి హంట్‌ను నియమించారు. మినీబడ్జెట్‌లో ప్రతిపాదనల్ని వెనక్కి తీసుకున్నా అప్పటికే రాజకీయంగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది.



హోంమంత్రి రాజీనామాతో రాజకీయ అనిశ్చితి

బ్రిటన్ హోంమంత్రి సుయెల్లా బ్రేవర్మన్ చేసిన ఒక పొరపాటుతో బుధవారం ఆమె తన పదవికి రాజీనామా చేయడం కూడా లిజ్ ట్రస్‌కు ఎదురు దెబ్బగా మారింది. బ్రిటన్ వలస విధానాలకు సంబంధించిన ఒక డాక్యుమెంట్‌ను బ్రేవర్మన్ తన వ్యక్తిగత ఈ మెయిల్ నుంచి సహచర ఎంపీగా పంపడం తీవ్ర దుమారానికి దారి తీసింది. దీంతో ఆమె తన తప్పుని అంగీకరిస్తూ రాజీనామా చేశారు. మరోవైపు లిజ్‌ట్రస్‌పై కన్జర్వేటివ్ పార్టీకి చెందిన 100 మంది సభ్యులు అక్టోబర్ 31లోగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి దింపాలన్న ప్రచారం జరిగింది. ఆర్థికంగా, రాజకీయంగా ఎదురవుతున్న సవాళ్లను తట్టుకోలేక దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పిన ఒక్క రోజులోనే ఆమె పదవిని వీడారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



3,119 మంది విద్యార్థులు ఒకేసారి ఒకేచోట 45 నిమిషాలపాటు సాఫ్ట్‌వేర్ పాఠాలు విని కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించారు. కొలంబియాలోని మెడెలిన్ సిటీలో తీసిందీ ఫొటో.

జూన్‌లో చంద్రయాన్ 3

ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్

న్యూఢిల్లీ: చందమామపై శోధనకు ఉద్దేశించిన చంద్రయాన్–3 ప్రయోగం వచ్చే ఏడాది జూన్‌లో ఉంటుందని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చైర్మన్ ఎస్.సోమ్‌నాథ్ ప్రకటించారు. గురువారం ఢిల్లీలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో సోమ్‌నాథ్ మాట్లాడారు. ' గగన్‌యాన్ ప్రాజెక్ట్ కోసం తొలి రోదసీనౌక పరీక్షను వచ్చే ఏడాది తొలినాళ్లలో చేపడతాం. లాంచ్ వెహికల్ మార్క్–3 ద్వారా చంద్రయాన్–3ను ప్రయోగిస్తాం. పలుమార్లు మానవరహిత వాహకనౌక పరీక్షల తర్వాత 2024 చివరికల్లా భారతీయ వ్యోమగాములు విజయవంతంగా కక్ష్యలో అడుగుపెట్టేలా చేస్తాం. 2019 సెప్టెంబర్‌లో విక్రమ్ ల్యాండర్‌ను చంద్రుడిపై దింపేందుకు చేసిన చంద్రయాన్–2 ప్రయోగం విఫలమైంది. ఈసారి అలా జరగబోదు. ఇది భిన్నమైన ఇంజనీరింగ్. ఉపరితలంపై ల్యాండర్ దిగేటపుడు పాడవకుండా ఉండేందుకు శక్తివంతమైన కాళ్లు సిద్ధంచేస్తున్నాం. ఈ ప్రక్రియలో ఏవైనా పొరపాట్లు జరిగితే, ప్రయోగం సజావుగా సాగేందుకు 'మరో పరిష్కారం' రంగంలోకి దిగుతుంది. 'చంద్రుడిని చేరే క్రమంలో ఎంత ఎత్తులో ప్రయాణించాల్సి రావచ్చు? చంద్రుడి ఉపరితలంపై సమస్యలు లేని స్థలాల గుర్తింపు వంటి అంశాల్లో మరింత స్పష్టత సాధిస్తున్నాం' అని అన్నారు.

యువతకు దీపావళి కానుక

- కొత్తగా 10 లక్షల మందికి ఉద్యోగాలు
- రేపు 'రోజ్‌గార్ మేళా'

న్యూఢిల్లీ: దేశంలో యువతకు కేంద్ర ప్రభుత్వం దీపావళి కానుక అందజేస్తోంది. ఏకంగా 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడానికి 'రోజ్‌గార్ మేళా'ను ప్రధాని మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన 75,000 మందికి ఇదే కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేస్తారని ప్రధాని కార్యాలయం(పీఎంఓ) పేర్కొంది. ప్రధాని ఆశయ సాధనలో రోజ్‌గార్ మేళా ఒక కీలకమైన ముందడుగు అని అభివర్ణించింది. ప్రతిపక్షాలు ప్రధానంగా నిరుద్యోగ సమస్యను లేవనెత్తుతూ ప్రభుత్వాన్ని తరచుగా ఇరుకునపెడుతున్న సంగతి తెలిసిందే. ఏడాదిన్నర కాలంలో కొత్తగా 10 లక్షల మందిని నియమించుకోవడానికి మిషన్ మోడ్‌లో పనిచేయాలని వివిధ ప్రభుత్వ విభాగాలను ప్రధాని జూన్‌లో ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సంఖ్య, ఖాళీలపై కేంద్రం సమీక్ష నిర్వహించింది. ఖాళీల సంఖ్య తేలడంతో వాటిని భర్తీ చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

నియామకాల ప్రక్రియ 22న

దేశవ్యాప్తంగా ఈ నెల 22న సాగే నియామక ప్రక్రియలో 38 కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు పాల్గొంటాయి. గ్రూప్–ఎ, గ్రూప్–బి(గెజిటెడ్), గ్రూప్–బి(నాన్–గెజిటెడ్), గ్రూప్–సి స్థాయిల్లో కొత్తగా ఉద్యోగులను నియమించుకుంటాయి. రోజ్‌గార్ మేళా ద్వారా సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ పర్సనల్, సబ్–ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, ఎల్‌డీసీ, స్టెనో, ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, మల్టీ–టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్) తదితర పోస్టులను భర్తీ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు సొంతంగా లేదా యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ తదితర రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారా నూతన నియామకాలు చేపడతాయి.

భజరంగ్‌దళ్‌లోకి 50 లక్షల కొత్త సభ్యత్వాలు

ఆన్‌లైన్‌లో ప్రారంభించిన వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: తమ యువజన విభాగం భజరంగ్‌దళ్‌లోకి కొత్తగా 50 లక్షల మందిని చేర్చుకునేందుకు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. 'జాతీయస్థాయిలో భజరంగ్ దళ్ అభియాన్‌ను ప్రారంభించాం. ఇందుకు 15–35 ఏళ్ల యువత అర్హులు. సభ్యత్వం కోసం మా వెబ్‌సైట్ లింక్‌లో అందుబాటులోకి తెచ్చిన దరఖాస్తును నింపాలి' అని గురువారం వీహెచ్‌పీ సెక్రటరీ జనరల్ మిలింద్ పరాండే మీడియాతో అన్నారు. కనీసం 50 లక్షల మంది యువతను చేర్చుకోవాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. వీరందరికీ శిక్షణనిచ్చి, తమ సంస్థలో చేరుకుంటామన్నారు. ఈ కార్యకర్తలకు వ్యక్తిత్వ వికాసంతోపాటు మతం, చరిత్ర, సంస్కృతి, ఆత్మ రక్షణ విధానాలు, యోగ నేర్పిస్తామని చెప్పారు. నవంబర్ 6వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా శ్రేయోభిలాషులు (హృత్‌చింతక్) పేరుతో మరో భారీ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు.

పర్యావరణానికి 'లైఫ్'

- భారత్ ఆధ్వర్యంలో కొత్త కార్యాచరణ
- మిషన్ లైఫ్‌ను ప్రారంభించిన మోదీ, యూఎన్ ప్రధాన కార్యదర్శి గుటెరస్

కెవాడియా: వాతావరణ మార్పుల కారణంగా విధ్వంసకరమైన పరిణామాల నుంచి మన భూమండలాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా భారత్ ఆధ్వర్యంలో ఒక అంతర్జాతీయ కార్యాచరణ రూపుదిద్దుకుంది. ప్రధాని మోదీ, ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ సంయుక్తంగా మిషన్ లైఫ్(లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)ను ప్రారంభించారు. ప్రజలు తమ జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, దీనిని ప్రపంచ దేశాల ప్రజల్లోకి ఒక ఉద్యమంలా తీసుకువెళ్లాలని నిర్ణయించారు. గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం దగ్గర గురువారం లైఫ్ మిషన్‌ను ప్రారంభించారు. ప్రజలు లైఫ్ స్టైల్‌లో మార్చుకోవాల్సిన జాబితాతో పాటు లైఫ్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ మిషన్ పీ3 మోడల్ అని ప్రో ప్లేనెట్, పీపుల్‌గా వ్యాఖ్యానించారు. 'రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్' విధానాన్ని అందరూ అనుసరించాలని ప్రధాని పిలుపునిచ్చారు.

ప్రజలు చేయాల్సిందిదే..!

ప్రతీ రోజూ ఒక వ్యక్తి జిమ్‌కి వెళ్లడానికి పెట్రోల్‌తో నడిచే బైక్, కారు వంటి వాహనాన్ని వాడే బదులుగా సైకిల్‌పై వెళ్లడం మంచిదన్నారు. ఎల్ఈడీ బల్బులు వాడితే విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందని ప్రధాని హితవు పలికారు. ఇలాంటివన్నీ ప్రజలందరూ మూకుమ్మడిగా పాటిస్తే ప్రపంచ దేశ ప్రజలందరి మధ్య ఐక్యత పెరుగుతుందని మోదీ చెప్పారు.



'మిషన్ లైఫ్' కార్యక్రమంలో మోదీ, గుటెరస్

ప్రకృతి వనరుల్ని అతిగా వాడొద్దు : గుటెరస్

ప్రకృతి వనరుల్ని అతిగా వినియోగించడం వల్ల పర్యావరణానికి హాని జరుగుతోందని గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. జీ–20 దేశాలు 80 శాతం గ్రీన్ హౌస్ వాయువుల్ని విడుదల చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చెప్పిన మాటల్ని గుటెరస్ గుర్తు చేసుకున్నారు. ''ప్రతీ ఒక్కరి అవసరాలు తీర్చే వనరులు ఈ భూమిపై ఉన్నాయి. కానీ అందరి అత్యాశలను నెరవేర్చే శక్తి భూమికి లేదు. దురదృష్టవశాత్తూ ఇవాళ రేపు ప్రతీ ఒక్కరూ అత్యాశకి పోతున్నారు. దానిని మనం మార్చాలి'' అని కొన్ని దశాబ్దాల కిందటే గాంధీజీ చెప్పారని ఇప్పటికీ అది అనుసరణీయమని వ్యాఖ్యానించారు. భారత్ తీసుకువచ్చిన ఈ కార్యాచరణని ప్రపంచ దేశాలు ప్రశంసిస్తున్నాయి.


ఢిల్లీ ప్రజల్ని స్వచ్ఛమైన గాలి పీల్చనివ్వండి: సుప్రీం



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో బాణాసంచా వాడకంపై విధించిన సంపూర్ణ నిషేధంపై సత్వర విచారణ చేపట్టాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్..ఢిల్లీ వాసులను పరిశుభ్రమైన గాలిని పీల్చనివ్వండి అంటూ వ్యాఖ్యానించింది. బాణాసంచాకు బదులుగా ప్రజలు తమ డబ్బును స్వీట్లు కొనేందుకు వెచ్చించాలని కోరింది. దీపావళి సమయంలో ఢిల్లీలో కాలుష్య స్థాయిలు ప్రమాదకర స్థాయికి పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే అంశంలో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి దీనిని విచారిస్తామని స్పష్టం చేసింది. ఢిల్లీలో అన్ని రకాల బాణాసంచా ఉత్పత్తి, నిల్వ, విక్రయం, టపాసులను పేల్చడంపై వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ వరకు పూర్తిస్థాయి నిషేధం విధిస్తూ ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సెప్టెంబర్‌లో ఆదేశాలు జారీ చేసింది.

భారత్‌ను దెబ్బతీసిన వాతావరణ మార్పులు

- ఏడాదిలో 15,900 కోట్ల డాలర్ల నష్టం
- అంతర్జాతీయ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: వాతావరణ మార్పులు మన దేశాన్ని ఆర్థికంగా కూడా తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. 2021లో వడగాడ్పులకి భారత్‌కి 15,900 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని క్లైమేట్ ట్రాన్స్‌పరెన్సీ రిపోర్ట్–2022 వెల్లడించింది. పర్యావరణం, వాతావరణ మార్పులపై అధ్యయనం చేస్తున్న కొన్ని అంతర్జాతీయ సంస్థలు కలసికట్టుగా ఈ నివేదిక రూపొందించాయి. వ్యవసాయం, నిర్మాణం, తయారీ, సేవా రంగాల్లో ఈ నష్టం వాటిల్లింది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో 5.4% నష్టం జరిగినట్టు ఆ నివేదిక వివరించింది.

ఆ నివేదికలో ఏముందంటే..!

- మండే ఎండలతో గత ఏడాది దేశంలో 16,700 పని గంటలు వృథా అయ్యాయి. 1990–1999తో పోల్చి చూస్తే 39% పెరిగింది.
- 2016–2021 మధ్య కాలంలో తుపానులు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడి 3.6 కోట్ల హెక్టార్లలో పంటలకి నష్టం వాటిల్లింది. దీంతో రైతన్నలు 375 కోట్ల డాలర్లు నష్టపోయారు.
- దేశంలో 30 ఏళ్లలో వర్షాలు పడే తీరులో ఎన్నో మార్పులు వచ్చాయి. వ్యవసాయం, అటవీ, మత్స్య ఆర్థిక ప్రభావాన్ని కనబరిచింది.
- 1850–1900 మధ్య కాలంతో పోల్చి చూస్తే భూ ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగాయి
- వాతావరణ మార్పుల ప్రభావం అన్ని దేశాలతో పాటు భారత్‌పై రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. నిలువ నీడ లేని వారి సంఖ్య రోజు రోజుకి పెరిగిపోతోంది.
- వాతావరణ మార్పులతో జరుగుతున్న నష్టాన్ని అరికట్టాలంటే ప్రపంచ దేశాలు భూ ఉష్ణోగ్రతల్ని 2 డిగ్రీల సెల్సియస్ కంటే తగ్గించడానికి కృషి చేయాలి. 2015 పారిస్ ఒప్పందాన్ని అన్ని దేశాలు వినియోగించడమే దీనికి మార్గం.
- పర్యావరణ మార్పుల్ని కట్టడి చేయాలంటే మనం వాడుతున్న ఇంధనాలను మార్చేసి, పర్యావరణ పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాల్సి అవసరం ఉందని ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్‌లో ఎర్త్ సైన్సెస్, క్లైమేట్ చేంజ్ డైరెక్టర్ సురుచి భద్వాల్ పేర్కొన్నారు.